Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శనివారం, జూన్ 27, 2026 | సంపుటి - 20 | సంచిక 273 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## వందేళ్లలో ఎప్పుడూ చూడని విధ్వంసం!

- వెనిజులాలో శక్తివంతమైన భూకంపాలు
- రాజధాని కారకాస్‌లో భారీ విధ్వంసం
- కొనసాగుతున్న సహాయక, రెస్క్యూ చర్యలు
- అత్యవసర పరిస్థితి ప్రకటించిన ప్రభుత్వం

కారకాస్ : లాటిన్ అమెరికా దేశమైన వెనిజులాలో గురువారం తెల్లవారుజామున (భారత కాలమానం ప్రకారం) రెండు పవర్‌ఫుల్ భూకంపాలు పెను విధ్వంసాన్ని సృష్టించాయి. భారీగా నష్టాన్ని మిగిల్చాయి. రాజధాని కారకాస్‌తో సహా పలు ప్రాంతాల్లో భవనాలు పేకమేడల్లా కుప్ప కూలిపోవడంతో ప్రజలు శిథిలాల కింద చిక్కుకుపోయారు.




2లో

# హైదరాబాద్‌లో తొలి 'డేటా సెంటర్ సిటీ'

## దేశంలోనే సరికొత్త అధ్యాయానికి నాంది

- 1,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ నగరం
- వికారాబాద్ జిల్లా చేవెళ్లలో త్వరలో ఏర్పాటు
- సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్ : సాంకేతిక రంగంలో ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్న హైదరాబాద్ మహానగరం, ఇప్పుడు మరో సంచలన ప్రాజెక్టుకు వేదిక కాబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకునేందుకు భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా, కేవలం డేటా సెంటర్ల కోసమే ఒక పూర్తి 'డేటా సెంటర్ నగరాన్ని' అభివృద్ధి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో ఈ ప్రాజెక్ట్ దేశంలోనే ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. హైదరాబాద్‌కు సుమారు 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలో దాదాపు 1,500 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఈ అత్యాధునిక డేటా సెంటర్ నగరాన్ని నిర్మించనున్నారు. డేటా సెంటర్లు అంటే కేవలం కంప్యూటర్లు ఉండే భవనాలు మాత్రమే కాదు. వాటిలో వేలాది హై-ఎండ్ సర్వర్లు ఉంటాయి. వాటిని నిరంతరం రన్ చేయడానికి, సురక్షితంగా ఉంచడానికి విస్తృతమైన శీతలీకరణ వ్యవస్థలు

తరువాయి 2లో

## ఏపీ, తెలంగాణలో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు

- వాతావరణశాఖ భారీ రెయిన్ అలర్ట్ జారీ
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ



2

హైదరాబాద్ : నైరుతి రుతుపవనాలు ఏపీలో విస్తరిస్తున్నాయి. దీని ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో భారీ వానలు పడగా.. అమరావతి వాతావరణ కేంద్రం భారీ వర్షసూచన జారీ చేసింది.

## 235కు చేరిన భూకంప మృతుల సంఖ్య

- క్రమంగా పెరుగుతోన్న మృతుల సంఖ్య
- ఇంకా దొరకని 40వేల మంది ఆచూకీ
- భవన శిథిలాల కింద అనేక మంది!?
- వెనెజువెల వ్యాప్తంగా తీవ్ర విధ్వంసం
- సహాయం కోసం ముందుకొచ్చిన దేశాలు

2లో

## అపరేషన్ అమిస్టాడ్

### వెనెజువెలాకు భారత్ ఆపన్నహస్తం
### రెండు విమానాల్లో సహాయ సామగ్రి

న్యూఢిల్లీ : భూకంపాలతో అతలాకుతలమైన వెనుజువెలాకు భారత్? ఆపన్న హస్తం అందించింది. ఆపరేషన్ అమిస్టాడ్ పేరుతో ఆ దేశానికి భారీ సహాయక కార్యక్రమాన్ని చేపట్టింది.

తరువాయి 2లో

## అయోధ్య నిధుల గోల్‌మాల్‌పై జవాబివ్వండి

### 200కోట్ల అవినీతిపై ప్రజలకు సమాధానం చెప్పాలి
### భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్



హైదరాబాద్ : అయోధ్య రామ జన్మభూమి ట్రస్ట్ పేరుతో రూ.200 కోట్లు అవినీతి చేశారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపణలు చేశారు. రాముడి పేరు చెప్పి వసూలు చేసిన డబ్బుతో ఏం చేస్తున్నారో బీజేపీ ప్రజలకు చెప్పాలన్నారు. అయోధ్య రామ జన్మ భూమి తీర్థ ట్రస్ట్ విరాళాల అవకతవకలపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్‌కు సంబంధించి

2లో




## డ్రగ్స్ రహిత తెలంగాణ మాలక్ష్యం

- డ్రగ్స్‌పై పోరాటంలో ఈగిల్ ఫోర్స్ కృషి అసామాన్యం
- డ్రగ్స్ బారిన పడకుండా యువత జాగ్రత్త పడాలి
- ఈగిల్ ఫోర్స్ డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భట్టి

హైదరాబాద్ : విలువైన జీవితాన్ని డ్రగ్స్ బారిన పడి నాశనం చేసుకోవద్దని విద్యార్థులు, యువతకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ మహమ్మారి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని

తరువాయి 2లో

## డిజిటల్ పురోగతితో ఆర్థిక సాధికారత

- ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పురోగతి
- ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ విప్లవం
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- నెదర్లాండ్స్ క్వీన్ మాక్సీమాతో భేటీ
- డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై చర్చ



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి (ఫైనాన్షియల్ హెల్త్), నెదర్లాండ్స్ రాణి అయిన క్వీన్ మాక్సిమా గురువారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. వీరిద్దరి మధ్య జరిగిన ఈ కీలక భేటీలో, భారతదేశంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ఆర్థిక సేవలు సామాన్యులకు ఏ విధంగా మరింత సులభంగా, సరసమైన ధరల్లో అందుబాటులోకి వచ్చాయనే అంశంపై ప్రధానంగా చర్చలు జరిగాయి. ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సామాన్య పౌరుల జీవన ప్రమాణాలను ఏ విధంగా మారుస్తున్నాయో ఇద్దరు నేతలూ సుదీర్ఘంగా సమీక్షించారు. ధాని మోదీ తన (ట్విట్టర్) ఖాతా ద్వారా ఈ సమావేశం గురించి వివరిస్తూ, ఆర్థిక సమ్మిళితంలో ప్రపంచవ్యాప్తంగా బలమైన గొంతుకగా ఉన్న క్వీన్ మాక్సిమాను కలవడం సంతోషంగా ఉందని తెలిపారు. భారతదేశంలో ఆధార్, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ , ప్రధాన మంత్రి జన్-ధన్ యోజన వంటి డిజిటల్ పబ్లిక్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నడిచే డిజిటల్ విప్లవం..

తరువాయి 2లో

## తెలంగాణ కొత్త సీఎస్‌గా ఐఏఎస్ సంజయ్ జాజు

- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి
- జూన్ 30తో ముగియనున్న రామకృష్ణారావు పదవీ కాలం



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో అత్యున్నత స్థాయిలో ఒక కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు.

2లో

## సర్ ప్రక్రియకు పాస్‌పోర్ట్ చెల్లుబాటు

### ఎన్నికల సంఘం కీలక ప్రకటన

న్యూఢిల్లీ : తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో పాస్‌పోర్ట్ పాత్రపై కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ఒక ముఖ్యమైన వివరణ ఇచ్చింది. ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్న లేదా ప్రస్తుతం వివరాలను సవరించుకోవాలన్నా అవసరమైన 12 రకాల ధృవీకరణ పత్రాలలో పాస్‌పోర్ట్ కూడా

2లో

## అమరావతిలో డ్రోన్ డెలివరీ నెట్‌వర్క్



- డ్రోన్ కార్పొరేషన్, ఎయిర్ బౌండ్ సంస్థతో ఒప్పందం
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి
- డ్రోన్ ఆవిష్కరణల రంగంలో సరికొత్త అవకాశాలు

న్యూఢిల్లీ : ప్రస్తుతం డ్రోన్ సేవలు అత్యంత వేగంగా విస్తరిస్తున్నాయి. వ్యవసాయం, వైద్యం, ఈ-కామర్స్, డెలివరీలు, శాంతిభద్రత పరిరక్షణలో వీటిని విస్తృతంగా వాడుతున్నారు. తాజాగా రాజధాని అమరావతిలో డ్రోన్ డెలివరీ నెట్?వర్క్?ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాజధాని ప్రాంతమైన అమరావతి అంతటా డ్రోన్ డెలివరీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసున్నారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్, ఎయిర్‌బౌండ్ సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకుంది. గురువారం దిల్లీలోని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి

తరువాయి 2లో

## పల్నాడు జిల్లాలో వరుస రోడ్డు ప్రమాదాలు

- ఉన్నతాధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష
- ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశం



అమరావతి : పల్నాడు జిల్లాలో వరుస రోడ్డు ప్రమాదాలపై ఉన్నతాధికారులతో ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం కలెక్టర్, ఎస్పీలతో మంత్రి మాట్లాడారు. యాక్సిడెంట్ స్పాట్స్ గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తూ నష్ట నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వాహనం పాడైనా, ఏదైనా కారణం చేత రోడ్డు మీద ఆగిపోతే వెనక వచ్చే వాహనాలకు ఆ విషయం తెలిసేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్పీకి దిశానిర్దేశర చేశారు. పల్నాడు జిల్లా మాచర్ల నగరవనం వద్ద రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందటం పట్ల మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్య వివరాలు తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులను గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.

తరువాయి 2లో

# వందేళ్లలో ఎప్పుడూ చూడని విధ్వంసం!

ఈ ప్రకృతి విధ్వంసానికి భారీ నష్టం వాటిల్లినట్లు నివేదికలు వెలువడ్డాయి. యూఎస్ జియోలాజికల్ సర్వే ప్రకారం, గత 100 సంవత్సరాలలో వెనిజులాను తాకిన అత్యంత శక్తివంతమైన భూకంపాల్లో ఇది ఒకటిగా చెబుతోంది.ప్రాథమిక అంచనాల ప్రకారం లక్ష మంది వరకు మరణించి ఉండవచ్చు. భూకంపం తరువాత, యూఎస్ పసిఫిక్ సునామీ హెచ్చరిక కేంద్రం ప్యూర్టో రికో, యూఎస్, బ్రిటిష్ వర్జిన్ దీవులు, అరుబా, కురాకో, బొనైర్ తీరాలకు సునామీ హెచ్చరికను జారీ చేసింది. అయితే, పరిస్థితిని అంచనా వేసిన తరువాత సుమారు గంట తర్వాత ఆ హెచ్చరికను ఉపసంహరించుకున్నారు.రాజధాని కారకాస్‌లోని అల్టమీరా, చకావో ప్రాంతాలలో అనేక భవనాలు కూలిపోయినట్లు నివేదికలు వెలువడ్డాయి. సహాయక బృందాలు వెంటనే రెస్క్యూ, పునరావాస చర్యలను ప్రారంభించాయి. చకావో ప్రాంతం నుంచి కనీసం 18 మందిని సజీవంగా బయటకు తీశారు. ఫాల్కన్ రాష్ట్రంలో 22 మంది గాయపడినట్లు నిర్ధారించారు. పదిహేను మంది ఇంకా గల్లంతయ్యారు. స్థానిక అధికారులు సహాయక, గాలింపు చర్యలను కొనసాగిస్తున్నారు. తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రభుత్వం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని చెప్పారు. అత్యవసర పరిస్థితిని ప్రకటించి, అంతర్జాతీయ సహాయం కోరతామని అన్నారు.యూఎస్ జియోలాజికల్ సర్వే తన ప్రాథమిక అంచనాలో, విస్తృత ప్రాణనష్టం, అపారమైన విధ్వంసం సంభవించవచ్చని పేర్కొంది. మృతుల సంఖ్య లక్ష వరకు ఉండవచ్చునని ఆ సంస్థ అంచనా వేసింది. అయితే, మొత్తం మరణాలు, గాయపడిన వారి సంఖ్యను ఇంకా అధికారికంగా విడుదల చేయలేదు.ముందస్తు జాగ్రత్త చర్యగా మైకెటియా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేశారు. పలు పాఠశాలలను మూసివేశారు. అయితే, చమురు ఉత్పత్తికి గానీ, ఇంధన మౌలిక సదుపాయాలకు గానీ పెద్ద నష్టం జరిగినట్లు నిర్ధారణ కాలేదు.వెనిజులా కరేబియన్ ప్లేట్, దక్షిణ అమెరికా ప్లేట్ కలిసే చోట ఉంది, అందువల్ల అక్కడ తరచుగా భూకంపాలు సంభవిస్తుంటాయి. ఏదిఏమైనా ఒకసారైనా పెద్ద భూకంపం సంభవించే ప్రమాదం ఉంది.మార్చి 26, 1812న, కారకాస్, మెరిడాలో 7.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆ సమయంలో వెనిజులా స్పెయిన్ నుంచి స్వాతంత్ర్యం కోసం పోరాడుతోంది. ఖూ-ఖా ప్రకారం, ఈ భూకంపంలో సుమారు 30 వేల మంది మరణించారు. దేశ చరిత్రలోనే అత్యంత వినాశకరమైన భూకంపంగా దీనిని పరిగణిస్తారు.1967 జులై 29న కారకాస్‌లో 6.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. అనేక బహుళ అంతస్తుల భవనాలు కూలిపోయాయి. దాదాపు 200 నుంచి 300 మంది మరణించారు. దీని తర్వాత, దేశంలో భవన నిర్మాణ నిబంధనలను మరింత కఠినతరం చేశారు.

# అమరావతిలో డ్రోన్ డెలివరీ నెట్‌వర్క్

రామ్మోహన్ నాయుడు సమక్షంలో ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ గీతాంజలి శర్మ, ఎయిర్?బౌండ్ వ్యవస్థాపకుడు నమన్ పుష్ప్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.అమరావతి, విజయవాడ, గుంటూరులను కలుపుతూ డ్రోన్ కార్యకలాపాలు ప్రారంభించనున్నారు. ఇందుకుగానూ ఎయిర్‌బౌండ్ సంస్థ లాజిస్టిక్స్, ఈ-కామర్స్, హెల్త్‌కేర్ రంగాల్లోని భాగస్వాములతో కలిసి పనిచేయనుంది. వచ్చే ఏడాది రోజుకు 10 వేల డ్రోన్ ఫ్లైట్స్ నిర్వహించే లక్ష్యంతో ఏపీ డ్రోన్ కార్పొరేషన్ పని చేస్తోంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ స్వదేశీ సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకుని, అతిపెద్ద డ్రోన్ డెలివరీ నెట్‌వర్క్‌ను నిర్మించనున్నామని తెలిపారు. దీని వల్ల కనెక్టివిటీతో పాటు ఉద్యోగాలను కల్పించవచ్చని ఆంధ్రప్రదేశ్ నిరూపించనుందన్నారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఛైర్మన్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ ఎయిర్‌బౌండ్ సంస్థ ఒక కొత్త డెలివరీ విధానాన్ని ఆరంభించడమే కాకుండా, కొత్త లాజిస్టిక్స్ వ్యవస్థకు పునాది వేస్తోందని పేర్కొన్నారు.అమరావతి రాజధాని ప్రాంతంలో డ్రోన్ డెలివరీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు ఏపీ డ్రోన్ కార్పొరేషన్, ఎయిర్?బౌండ్? మధ్య జరిగిన అవగాహన ఒప్పంద సంతకం కార్యక్రమాన్ని వీక్షించడం సంతోషంగా ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ 'డిజిటల్ ఇండియా' దార్శనికత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాంకేతికత ఆధారిత పాలన స్ఫూర్తితో, ఏపీ డ్రోన్ ఆవిష్కరణల రంగంలో సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటోంది" అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఎక్స్?లో పోస్ట్ చేశారు. ఎయిర్‌బౌండ్ వ్యవస్థాపకుడు, సీఈవో నమన్ పుష్ప్ మాట్లాడుతూ డ్రోన్ డెలివరీ వస్తు రవాణా వ్యవస్థ స్వరూపాన్నే మారుస్తుందని తెలిపారు. 20 టన్నుల ట్రక్ సామర్థ్యంతో డ్రోన్లు ఒక్కో ప్యాకేజీని ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సులభంగా చేరవేసే నెట్‌వర్క్‌ను నిర్మించడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణ మాలక్ష్యం

అందరం కలిసికట్టుగా పోరాడినప్పుడే డ్రగ్స్ లేని సమాజాన్ని సాధించగలమని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్రత్యేకంగా పనిచేస్తున్న ఈగల్ ఫోర్స్‌కు ఆర్థికంగా ఎలాంటి లోటు రాకుండా ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి సహకారాన్ని అందిస్తుందని భరోసా ఇచ్చారు. తమ పిల్లలు ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరుకునే తల్లిదండ్రుల ఆశ, రాష్ట్ర ప్రభుత్వ కల ఒక్కటేనని.. అది యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండటమేనని ఉద్ఘాటించారు. శిల్పకళా వేదికలో నిర్వహించిన ఈగల్ ఫోర్స్ యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, సినీనటులు రామ్ పోతినేని, మీనాక్షి చౌదరి పాల్గొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తారు. ఈ ప్రభుత్వం కూడా వారిని కాపాడుకోవాలని ప్రయత్నిస్తోంది. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నారు. తమ జీవితాలను రిస్క్‌లో పెట్టి డ్రగ్స్ ముఠాలను పట్టుకుంటున్నారు. డ్రగ్స్ కేసుల్లో దొరికితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని భట్టి హెచ్చరించారు. ఈగల్ ఫోర్స్ సంపూర్ణంగా పనిచేసేలా అన్ని వసతులు కల్పించాం. డ్రగ్స్ కట్టడికి ఎలాంటి కఠిన నిర్ణయమైనా తీసుకుంటాం. తెలంగాణలో పుట్టిపెరగడం ఓ భరోసాగా భావించే పరిస్థితులు కల్పిస్తున్నాం. సమాజంలో పరివర్తన రాకుంటే ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం శూన్యం. సినీ నటులు ఇచ్చే సందేశం సమాజంలోకి బలంగా వెళ్తుందని భట్టి విక్రమార్క అన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రాణాలకు తెగించి, నిరంతరం రిస్క్‌లో పనిచేస్తున్న పోలీస్ అధికారుల, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే అలాంటి ఉద్యోగులకు ప్రత్యేక ఇన్సెంటివ్స్ అందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని నమ్ముతూ, డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక అవేర్‌నెస్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా విద్యావ్యవస్థ బలోపేతం, రాష్ట్ర రక్షణ విషయాలలో ప్రభుత్వం ఎంతో కఠినంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. డ్రగ్స్ రవాణా లేదా వినియోగంలో ఎంతటి పెద్దవారు, ఎంతటి ప్రభావశీలురు ఉన్నా సరే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని భట్టి విక్రమార్క తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చలనచిత్ర రంగానికి చెందిన హీరోలు, హీరోయిన్లు, ఇతర కళాకారులు డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో చురుగ్గా పాల్గొనాలని శిల్పకళా వేదిక నుంచి ఆయన విజ్ఞప్తి చేశారు. సినీ పరిశ్రమలో ఉన్నవారు కూడా సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వానికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం తరఫున కఠినమైన చట్టాలు చేస్తున్నప్పటికీ, ప్రజల్లో మార్పు రానంతవరకు ఆశించిన ఫలితాలు రావని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. దేశంలో వరకట్న నిషేధ చట్టం ఉన్నప్పటికీ, అది ఆశించిన స్థాయిలో అమలు కాకపోవడానికి సామాజిక మార్పు లోపించడమే కారణమని ఉదాహరించారు. డ్రగ్స్ నిర్మూలన వంటి కఠినమైన చట్టాలు వంద శాతం విజయవంతం కావాలంటే, చట్టాలతో పాటు సమాజంలో, ప్రజల ఆలోచనా విధానంలో స్పష్టమైన పరివర్తన రావాలని ఆయన ఆకాంక్షించారు.

# హైదరాబాద్‌లో తొలి 'డేటా సెంటర్ సిటీ'

విద్యుత్ సబ్‌స్టేషన్లు, భారీ ట్రాన్స్‌ఫార్మర్లు, నెట్‌వర్క్ పరికరాలు, భవిష్యత్ విస్తరణకు భారీ స్థలం అవసరం. అందుకే ఈ ప్రాజెక్ట్ కోసం 1,500 ఎకరాల భూమిని కేటాయించారు. డేటా సెంటర్ సిటీలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాలకు ప్రత్యేక మౌలిక వసతులు కల్పించనున్నారు. హైసెక్యూరిటీ జోన్లు, అత్యాధునిక ఫైబర్ కనెక్టివిటీ, విశ్వసనీయ విద్యుత్ సరఫరా, డిజిటల్ నెట్‌వర్క్ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రాజెక్టు రూపకల్పన జరుగుతోంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీరు, విద్యుత్, రవాణా, డిజిటల్ కనెక్టివిటీపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. భూమి గుర్తింపు ప్రక్రియ కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ఈ ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.ఇది ఒక సాధారణ ఐటీ పార్క్ లేదా పారిశ్రామిక ప్రాంతం లాంటిది కాదు. డేటా సెంటర్ కంపెనీల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా ప్లగ్-అండ్-ప్లే పద్ధతిలో మౌలిక సదుపాయాలను ఇక్కడ ముందే సిద్ధం చేస్తోంది ప్రభుత్వం. ఒకే ప్రాంగణంలో పవర్ సబ్‌స్టేషన్లు, హై-స్పీడ్ ఫైబర్ నెట్‌వర్క్‌లు, కూలింగ్ సిస్టమ్‌లు, బ్యాకప్ పవర్, అత్యాధునిక భద్రతా వ్యవస్థలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల వివిధ కంపెనీలు తమ వ్యాపారాల కోసం వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్, నీరు లేదా ఇంటర్నెట్ కనెక్షన్ల కోసం తిరగాల్సిన అవసరం ఉండదు. అతి తక్కువ సమయంలోనే తమ సర్వర్లను ఇక్కడ ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు ప్రారంభించవచ్చు.ఈ ప్రాజెక్ట్ అత్యంత ప్రాధాన్యత కలిగిన, ప్రత్యేకమైన అంశం నీటి పునర్వినియోగం. డేటా సెంటర్లు రోజుకు 24 గంటలు పనిచేస్తాయి. కాబట్టి సర్వర్లు వేడెక్కకుండా చూడటానికి భారీగా నీరు అవసరమవుతుంది. తాగునీటిపై ఒత్తిడి పడకుండా ఉండేందుకు, ఇక్కడ మంచినీటికి బదులుగా శుద్ధి చేసిన మురుగునీటిని ఉపయోగించనున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ కి చెందిన 41 మురుగునీటి శుద్ధి కర్మాగారాల నుండి సుమారు 530 శుద్ధి చేసిన నీటిని రెండు వేర్వేరు పైప్‌లైన్‌ల ద్వారా ఈ డేటా సెంటర్ నగరానికి, పారిశ్రామిక ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. కొన్ని సంవత్సరాల క్రితం వరకు డేటా సెంటర్లను కేవలం వెబ్‌సైట్‌లు, సాధారణ క్లౌడ్ స్టోరేజ్ కోసం వాడేవారు. కానీ నేడు జెనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్ వాడకం విపరీతంగా పెరిగింది. గతంలో ఒకే సర్వర్ ర్యాక్ 5 నుండి 15 కిలోవాట్ల విద్యుత్‌ను వినియోగించుకోగా, ప్రస్తుత జీపీయూ-ఆధారిత ఏఐ సిస్టమ్‌లకు 30 నుండి 120 కిలోవాట్ల విద్యుత్ అవసరం అవుతోంది. ఈ భారీ విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి ఈ ప్రాజెక్ట్‌లో కంపెనీలకు నిరంతరాయంగా 'ఓపెన్ యాక్సెస్ పవర్' అందించనున్నారు. హైదరాబాద్ ఇప్పటికే అమెజాన్, మైక్రోసాఫ్ట్, కంట్రోల్ఎస్, క్యాపిటాల్యాండ్, ఎస్‌టిటి గ్లోబల్, ఎన్‌టిటి డేటా వంటి దిగ్గజ కంపెనీల డేటా సెంటర్లకు నిలయంగా మారింది. ప్రస్తుతం ఇక్కడ 150 నుండి 200 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు పనిచేస్తుండగా, సుమారు 5 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. అంతేకాకుండా, తెలంగాణలో మరో 11 గిగావాట్లకు పైగా సామర్థ్యం గల ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం అవగాహన ఒప్పందాలు కుదిరాయి. విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డేటా సెంటర్ సంస్థలకు ఓపెన్ యాక్సెస్ విధానంలో ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి నేరుగా విద్యుత్ కొనుగోలు చేసే అవకాశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. చందనవెల్లి, భారత్ ఫ్యూచర్ సిటీ, ఫ్యాబ్ సిటీ ప్రాంతాలు కూడా డేటా సెంటర్ క్లస్టర్లుగా అభివృద్ధి చెందుతున్నాయి.

# ఏపీ, తెలంగాణలో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు

జూన్ 26వ తేదీన అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పోలవరం, పశ్చిమగోదావరి, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.ఇక మిగతా జిల్లాల్లో కూడా పిడుగులతో కూడిన వానలు కురిసే అవకాశముందని, పొలాల్లో ఉండే కూలీలు, రైతులు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వర్షాలు పడే సమయంలో సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని పేర్కొంది.ఈదురుగాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. నేడు ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. గడిచిన 24 గంటల్లో పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లిలో 5.2 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదవ్వగా.. కృష్ణా జిల్లా గుడివాడలో 3.5 సె.మీ, పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురంలో 3.5 సె.మీ, పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో 3.3 సె.మీ, ఏలూరు జిల్లా భీమడోలులో 3 సె.మీల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. ఇక ఏలూరు జిల్లా కైకలూరులో 2.9 సెంటీమీటర్లు, విజయనగరంలో 2.7 సె.మీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా అమలాపురంలో 2.6 సె.మీ, ఎన్టీఆర్ జిల్లా పాలేరు బ్రిడ్జి 2.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక రాయలసీమలో రాబోయే మూడ్రోజుల పాటు భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఈదురుగాలులు 40-50 కిలోమీటర్ల వేగంతో వీస్తాయిని తెలిపింది. ఇక కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురవనుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగనుంది. ఏపీపై కూడా ఎల్‌నినో ప్రభావం ఉంటుందని, పంటల సాగు విషయంలో ప్రత్యామ్నాయలను ఎంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అటు తెలంగాణలో రాబోయే మూడ్రోజుల పాటు భారీ వర్షాలకు ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. జూన్ 26,278వ తేదీల్లో మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని అంచనా వేసింది. ఇక జూన్ 27,28వ తేదీల్లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో భారీ వానలు కురుస్తాయని తటిపింది. ఇక జూన్ 28,29వ తేదీల విషయానికొస్తే.. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది. పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరిక జారీ చేసింది.

# 235కు చేరిన భూకంప మృతుల సంఖ్య

కారకాస్ : దక్షిణ అమెరికా దేశమైన వెనెజువెలాను భారీ భూకంపాలు వణికించాయి. సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు శక్తిమంతమైన భూప్రకంపనలతో దేశవ్యాప్తంగా తీవ్ర విధ్వంసం చోటుచేసుకుంది. ఈ ప్రకృతి విపత్తులో మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పటివరకు 235 మంది మృతి చెందినట్లు వెనెజువెలా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. మరో 4,300 మంది గాయపడినట్లు తెలిపింది. అనేక మంది భవన శిథిలాల కింద చిక్కుకుపోవడంతో సహాయక బృందాలు వారిని వెలికితీసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నాయి. అధికారుల సమాచారం ప్రకారం, ఈ వరుస భూకంపాల అనంతరం దాదాపు 40 వేల మంది ఆచూకీ తెలియడం లేదు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. రాజధాని కారకాస్‌తో పాటు దేశంలోని పలు ప్రధాన నగరాల్లో భూప్రకంపనలు సంభవించినప్పటికీ, తీర ప్రాంత నగరమైన లా గువేరాలో అత్యధిక నష్టం వాటిల్లింది. భూకంపం ధాటికి అక్కడి పరిస్థితి దయనీయంగా మారింది. ఐక్యరాజ్యసమితి ప్రతినిధుల వివరాల ప్రకారం, లా గువేరాలో 100కు పైగా భవనాలు పూర్తిగా కూలిపోయాయి. శిథిలాల కింద చిక్కుకున్నవారిని గుర్తించడం, వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం అత్యంత క్లిష్టంగా మారిందని వారు తెలిపారు. భారీ కాంక్రీట్ శిథిలాలను తొలగించేందుకు ప్రత్యేక యంత్రాలను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా సుమారు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా నేలమట్టమైనట్లు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ తెలిపారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని శాఖలను అప్రమత్తం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ విపత్తు సమయంలో తమ దేశానికి అండగా నిలిచిన ప్రపంచ దేశాలకు డెల్సీ రోడ్రిగ్స్ కృతజ్ఞతలు తెలిపారు. మానవతా దృక్పథంతో సహాయక చర్యల్లో భాగస్వాములవుతున్న అన్ని దేశాలకు వెనెజువెలా ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ప్రపంచ దేశాలు చూపుతున్న సంఘీభావం తమకు ఎంతో ధైర్యాన్ని ఇస్తోందని ఆమె అన్నారు.భూకంపం అనంతరం సమాచార మార్పిడిని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించిన ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు, సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని వెనెజువెలా ప్రభుత్వాన్ని కోరారు. అత్యవసర సమాచారాన్ని ప్రజలకు త్వరగా చేరవేయడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందని సూచించారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వెనెజువెలాలో 'ఎక్స్' సామాజిక మాధ్యమ వేదికను మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది. 2024లో అప్పటి ప్రభుత్వం ఈ మైక్రోబ్లాగింగ్ వేదికపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, వెనెజువెలాకు అంతర్జాతీయంగా భారీగా సహాయం అందుతోంది. అమెరికా 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని పంపనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసినట్లు తెలిపింది. స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్, మెక్సికో, బ్రెజిల్ తదితర దేశాలు కూడా వైద్య బృందాలు, సహాయక సిబ్బంది, అత్యవసర సామగ్రిని పంపేందుకు ముందుకొచ్చాయి. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్నవారిని సజీవంగా రక్షించేందుకు సహాయక బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న ప్రభుత్వం, బాధితులకు అవసరమైన అన్ని విధాల సహాయాన్ని అందించేందుకు చర్యలు చేపడుతోంది.

## తెలంగాణ కొత్త సీఎస్‌గా

# ఐఏఎస్ సంజయ్ జాజు

ప్రస్తుతం సీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె. రామకృష్ణారావు సుదీర్ఘ పదవీ కాలం పొడిగించిన గడువుతో సహా జూన్ 30తో ముగియనుంది. అదే రోజున సంజయ్ జాజు రాష్ట్ర అత్యున్నత బ్యూరోక్రాటిక్ పదవిని స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థన మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయన్ను కేంద్ర సర్వీసుల నుండి రిలీవ్ చేసి మాతృ కేడర్‌కు పంపిన మరుసటి రోజే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.సంజయ్ జాజుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్రంలోనూ అత్యంత సమర్థుడైన అధికారిగా పేరుంది. 1992 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన.. గతంలో ఉమ్మడి ఏపీలో ఐటీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా పనిచేసినప్పుడు నేటికీ ప్రజలకు అందుబాటులో ఉన్న విప్లవాత్మక డిజిటల్ సేవలైన మీసేవ , మున్సిపల్ పరిధిలో సౌకర్యం ప్రాజెక్టులను డిజైన్ చేసి అమలు చేసిన ఘనత సాధించారు. అంతేకాకుండా, గతంలో ఉమ్మడి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విభజన తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రతినిధిగా పలు హోదాల్లో సేవలందించి క్షేత్రస్థాయి పరిపాలనపై తిరుగులేని పట్టు సాధించారు.సంజయ్ జాజు గత 13 ఏళ్లుగా కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్‌పై అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర రక్షణ ఉత్పాదక శాఖ , కేంద్ర సమాచార-ప్రసారాల శాఖ సెక్రటరీగా దేశ డిజిటల్, రక్షణ రంగాల విధాన నిర్ణయాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణకు తిరిగి వచ్చే ముందు ఆయన కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్రంలో సుదీర్ఘ కాలం పనిచేయడం వల్ల ఢిల్లీ సర్కిళ్లలో గల ఉన్నతాధికారులు, వివిధ మంత్రిత్వ శాఖలతో ఆయనకు ఉన్న బలమైన నెట్‌వర్క్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతగానో ఉపయోగపడనుందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి.ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ విరమణ తరుణంలో రేసులో జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి పలువురు సీనియర్ల పేర్లు వినిపించినప్పటికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గు చూపారు. దీనికి ప్రధాన కారణం ఆయనకున్న క్లీన్ ఇమేజ్ , వివాదరహిత ట్రాక్ రికార్డ్. రాష్ట్రంలో గుణాత్మక మార్పులు, పాలనా సంస్కరణలు తేవాలని భావిస్తున్న రేవంత్ రెడ్డికి.. ఐటీ, డిజిటల్ పరిపాలనలో ఎక్స్‌పర్ట్ అయిన జాజు అయితేనే కరెక్ట్ అని భావించారు. అంతేకాకుండా, కేంద్ర నిధుల సాధనలోను, కేంద్ర-రాష్ట్రాల మధ్య పెండింగ్ జలవివాదాలు, విభజన సమస్యల పరిష్కారంలో జాజుకు ఢిల్లీలో ఉన్న సీనియారిటీ మరియు పట్టు రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీరామరక్షగా మారుతుందని సీఎం గట్టిగా విశ్వసించారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత మాతృ రాష్ట్రానికి తిరిగి వస్తున్న సంజయ్ జాజుకు సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించగానే పలు సవాళ్లు ఎదురుకానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గ్యారెంటీల అమలు, రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పరిపాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. ఒకవైపు ఐటీ విజనరీగా, మరోవైపు కఠినమైన టాస్క్ మాస్టర్‌గా పేరు తెచ్చుకున్న సంజయ్ జాజు.. రాబోయే రోజుల్లో తెలంగాణ బ్యూరోక్రసీని ఏ విధంగా లీడ్ చేస్తారనేది సచివాలయ ఉద్యోగ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

## అయోధ్య నిధుల గోల్‌మాల్‌పై జవాబివ్వండి

ఎలాంటి అవినీతి జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారని.. కానీ యూపీ సిట్ పోలీసులు చంపత్ రాయ్ మనుషులను అరెస్టు చేశారన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని విరాళాలు వసూలు చేశారని అన్నారు. చంపత్ రాయ్‌ను ట్రస్ట్ కార్యదర్శి పదవి నుంచి తప్పించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. యూపీ సీఎం పదవికి యోగి ఆదిత్య నాథ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇది యూపీకి సంబంధించిన వ్యవహారం కాదని.. దేశ ప్రజలకు సంబంధించిన అంశమన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ ఎంపీలు 20 మందిని, మహారాష్ట్రలో శివసేన ఉద్ధవ్ థాక్రే ఎంపీలు 6 మందిని.. ఒక్కొక్కరికీ రూ.75 కోట్లు ఇచ్చి బీజేపీ కొనుగోలు చేసిందంటూ వ్యాఖ్యానించారు. రామ జన్మభూమి ట్రస్ట్ అవినీతి వ్యవహారంలో ప్రధాని మోదీ, అమిత్ షా, యోగి ఆదిత్య నాథ్ ప్రజలకు వాస్తవాలు చెప్పాలన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడారని చామల మండిపడ్డారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాను పదవి నుంచి తప్పించి చేతులు దులుపుకుంటే సరిపోదన్నారు. దేశంలో ప్రజలు ఏ స్థితిలో ఉన్నా అయోధ్య రామ మందిరం నిర్మాణం కోసం విరాళాలు ఇచ్చారన్నారు. 'ప్రజలు దేవుడి కోసం డబ్బులు ఇచ్చారు. మీరు దోచుకోవడం కోసం కాదు' అంటూ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# అపరేషన్ అమిస్టాడ్

రెండు వాయుసేన విమానాల్లో సహాయక సామాగ్రి, వైద్యబృందాన్ని పంపింది. వెనుజువెలాకు సహాయం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ మిషన్?కు 'ఆపరేషన్? అమిస్టాడ్?' అని నామకరణం చేసినట్లు విదేశాంగ మంత్రి జైశంకర్? ఎక్స్? వేదికగా పేర్కొన్నారు.వెనుజువెలాకు అత్యవసర సాయాన్ని అందించేందుకు, భారత వైమానిక దళానికి చెందిన రెండు జ-17 విమానాలు ఈ రోజు ఆ దేశానికి బయలుదేరాయి. ఈ సహాయక సామగ్రిలో భారత సైన్యానికి చెందిన ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్, 35 టన్నులకు పైగా సహాయక సామాగ్రి, మందులు, వైద్య పరికరాలు ఉన్నాయి. ఈ క్లిష్ట సమయంలో వెనిజులా ప్రభుత్వానికి, ప్రజలకు అండగా నిలవడానికి భారతదేశం కట్టుబడి ఉంది" అని జైశంకర్? ఎక్స్? పోస్టులో పేర్కొన్నారు.

# పల్నాడు జిల్లాలో వరుస రోడ్డు ప్రమాదాలు

పల్నాడు జిల్లా మాచర్ల సమీపంలోని నగరవనం వద్ద లారీ, తుఫాను వాహనం ఢీకొనడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వేగంగా వెళ్తున్న కారు ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. నలుగురు అక్కడికక్కడే మృతిచెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి గురైన బాధితులు హైదరాబాద్‌కు చెందిన వారుగా పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి పామూరు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# డిజిటల్ పురోగతితో ఆర్థిక సాధికారత

ప్రజల జీవన ప్రమాణాల్ని ఏ విధంగా పెంచుతోందో వారు చర్చించారు. ఈ డిజిటల్ విధానాలు లక్షల మంది ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి, ఆర్థిక సాధికారత కల్పిస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. భారతదేశం సాధించిన ఈ సాంకేతిక, ఆర్థిక సమ్మిళిత అనుభవాలను ప్రపంచంలోని ఇతర భాగస్వామ్య దేశాలతో పంచుకోవడానికి భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు భారతదేశ మోడల్ ఒక ఖర్చు-తక్కువ, సులభతరమైన మార్గదర్శకంగా నిలుస్తుందని భారత ప్రభుత్వం పదేపదే తెలియజేస్తోంది. ఐక్యరాజ్యసమితి ఫైనాన్షియల్ హెల్త్ అడ్వకేట్‌గా తన మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా క్వీన్ మాక్సిమా.. ముంబై, న్యూఢిల్లీలను సందర్శించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, భారతదేశం ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో అద్భుతమైన ప్రగతిని సాధించిందని ప్రశంసించారు. ఒకప్పుడు కేవలం బ్యాంకింగ్ సేవలు అందించడం పైనే దృష్టి ఉండగా, ఇప్పుడు ఈ సాంకేతికతను ఉపయోగించి ప్రజల వాస్తవ ఆర్థిక ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరచాలన్నది ప్రధాన అంశంగా మారిందని ఆమె అన్నారు. ముంబై పర్యటనలో క్వీన్ మాక్సిమా కొందరు సాధారణ ప్రజలు, నర్సులు, యువతతో ముఖాముఖి చర్చలు జరిపారు. వారు తమ ఆర్థిక నిర్వహణ, బడ్జెటింగ్, పొదుపు కోసం డిజిటల్ యాప్‌లను ఎలా ఉపయోగిస్తున్నారో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అట్టడుగు వర్గాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలను ఉచితంగా అందించే 'జన్ ధన్' పథకం లబ్ధిదారులతో కూడా ఆమె ముచ్చటించి వారి సాధక బాధకాలను విన్నారు. డిజిటల్ చెల్లింపులు, సబ్సిడీల నేరు బదిలీ వంటి కార్యక్రమాలతో భారతదేశం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. భవిష్యత్తులో అందరికీ సురక్షితమైన, అనుకూలమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించడంలో క్వీన్ మాక్సిమా, ప్రధాని మోదీ మధ్య జరిగిన ఈ చర్చలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

# సర్ ప్రక్రియకు పాస్‌పోర్ట్ చెల్లుబాటు

ఒకటిగా ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ వివరణ సాధారణ ఓటర్లకు, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారికి ఎంతో ఊరటనిచ్చే అంశం. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 1967 పాస్‌పోర్ట్ చట్టాన్ని ఉటంకిస్తూ, పాస్‌పోర్ట్ అనేది కేవలం ప్రయాణ పత్రమే కానీ, అది పౌరసత్వానికి నిరూపణ కాదని పేర్కొంది. ఈ ప్రకటన సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. పాస్‌పోర్ట్ ఉన్నప్పటికీ పౌరసత్వం విషయంలో సమస్యలు వస్తాయా? ఓటర్ల జాబితాలో పాస్‌పోర్ట్ ఆధారంగా పేరు నమోదు చేయడం సాధ్యం కాదా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమయ్యాయి. దీంతో ఎన్నికల సంఘం క్లారిటీ ఇచ్చింది. ఎన్నికల సంఘం అధికారుల ప్రకారం, ఓటర్ల జాబితాలో ఒక వ్యక్తి పేరు చేర్చడానికి ఆ వ్యక్తి భారతీయ పౌరుడై ఉండటం, నిర్ణీత వయసు కలిగి ఉండటం ప్రాథమిక సూత్రం. దీనిని నిరూపించడానికి ఓటరు నమోదు అధికారి కొన్ని పత్రాలను పరిశీలిస్తారు. ఈ పత్రాల జాబితాలో పాస్‌పోర్ట్ ఎప్పటి నుంచో ఉంది. అది అలాగే కొనసాగుతుంది. " పాస్‌పోర్ట్ అనేది ఒక వ్యక్తి గుర్తింపును, నివాసాన్ని ధృవీకరించే కీలక పత్రం. ఇందులో ఎలాంటి మార్పు లేదు" అని ఒక ఉన్నతాధికారి స్పష్టం చేశారు.

## మతం మారినంత మాత్రాన రిజర్వేషన్లు వర్తించవు

### ప్రభుత్వ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమైనవి

### సంచలన తీర్పు వెల్లడించిన మద్రాస్ హైకోర్టు

మద్రాస్, జూన్26 : మతం మార్పిడులు, రిజర్వేషన్ల ప్రయోజనాలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఇతర వెనుకబడిన వర్గాల నుండి ఇస్లాం మతంలోకి మారిన వారికి "వెనుకబడిన తరగతి ముస్లిం" కేటగిరీ కింద రిజర్వేషన్ ప్రయోజనాలను కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వును హైకోర్టు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ పూర్తిగా కొట్టివేసింది. 2024 మార్చి 9న తమిళనాడు ప్రభుత్వం ఒక ప్రత్యేక ఉత్తర్వును జారీ చేసింది. దీని ప్రకారం... వెనుకబడిన తరగతి ), అత్యంత వెనుకబడిన తరగతి , డినోటిఫైడ్ కమ్యూనిటీస్ ), షెడ్యూల్డ్ కులాల (రాజ)కు చెందిన వ్యక్తులు ఇస్లాం మతంలోకి మారినప్పటికీ, వారు 'బీసీ ముస్లిం' కేటగిరీ కింద రిజర్వేషన్ ప్రయోజనాలను పొందడం కొనసాగించవచ్చని పేర్కొంది. అంతేకాకుండా, ప్రభుత్వం నోటిపై చేసిన ఏడు ప్రత్యేక బీసీ ముస్లిం వర్గాలలో ఒకదానికి చెందిన సభ్యులుగా వారిని గుర్తిస్తూ కమ్యూనిటీ సర్టిఫికేట్లు జారీ చేయడానికి కూడా ఈ ఉత్తర్వు అనుమతించింది. తమిళనాడు ప్రభుత్వ భావన చట్టపరంగా మరియు భావనాత్మకంగా పూర్తిగా తప్పని మద్రాస్ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. "ఇస్లాం మతంలోకి మారిన వ్యక్తి వెనుకబడిన తరగతి ముస్లిం హోదాను పొందలేరని మేము నిర్ధారిస్తున్నాము. మతం మారిన వ్యక్తి కేవలం ఒక ముస్లిం మాత్రమే అవుతాడు, అంతే తప్ప ప్రత్యేక వర్గానికి చెందడు" అని కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఏడు ప్రత్యేక వెనుకబడిన ముస్లిం వర్గాలలో అన్సార్, దక్కనీ ముస్లింలు, దుబేకుల, లబ్బాయి, మాపిళ్ళ, షేక్, సయ్యద్ ఎవరైనా కొత్తగా మతం మారిన వారిని సభ్యునిగా పరిగణించడం సాధ్యం కాదని, అందువల్ల వారు ఆ వర్గం కింద రిజర్వేషన్లు పొందడానికి అర్హులు కారని కోర్టు తేల్చి చెప్పింది. జూలై 2008లో జారీ చేసిన ఒక ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా తమిళనాడులోని పైన పేర్కొన్న ఏడు ముస్లిం వర్గాలను ప్రత్యేక కేటగిరీలో చేర్చారు. అయితే, ఇతర సామాజిక వర్గాల నుండి ఇస్లాంలోకి మారిన వారికి కూడా ఈ సర్టిఫికేట్లు ఇవ్వాలనే 2024 నాటి ప్రభుత్వ నిర్ణయం చెల్లదని హైకోర్టు స్పష్టం చేయడంతో తమిళనాడు ప్రభుత్వానికి దౌత్యపరంగా పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.

## రాంగ్‌రూట్‌లో వచ్చిన స్కూటీని ఢీకొన్న బైక్

### స్కూటీపై ఉన్న ఇద్దరు అక్కడిక్కడే మృతి

హైదరాబాద్,జూన్26 : నగరంలోని గచ్చిబౌలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. రాంగ్ రూట్‌లో వచ్చిన స్కూటీని.. ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. గచ్చిబౌలిలో ఈ ఘటన చోటు చేసుకుంది. వినోద్ అనే వ్యక్తి శుక్రవారం ఉదయం 7:30 గంటల ప్రాంతంలో తన బైక్‌పై గచ్చిబౌలి నుంచి హఫీజ్‌పేట్ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో హఫీజ్‌పేట్ నుంచి గచ్చిబౌలి వైపు రాంగ్ రూట్‌లో ఫ్లై ఓవర్ మీదుగా శ్రీకాంత్, విట్టల్ స్కూటీపై వెళ్తున్నారు. రెండు వాహనాలు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు మృతిచెం దగా.. బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి స్వల్పంగా గాయ పడ్డాడు. సమా చారం అందిన వెంటనే గచ్చిబౌలి పోలీ సులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమా దంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామంటూ మోసం

### గోల్డ్‌మ్యాన్ సూర్యభాయ్‌పై పోలీస్ కేసు

హైదరాబాద్,జూన్26 : గోల్డ్ మ్యాన్ సూర్య భాయ్‌పై కేసు నమోదు అయ్యింది. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని లక్షల రూపాయలు తీసుకుని మోసం చేశారంటూ ఆరోపణలు రావడంతో సూర్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌లకు సన్నిహితుడి నంటూ నమ్మించాడని, తక్కువ ధరకే విదేశీ బంగారం ఇస్తామంటూ లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించాడంటూ బాధితులు వాపోయారు. అటు బంగారం ఇవ్వక, డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులు సూర్య భాయ్ ఇంటికి వెళ్లారు. దీంతో తన దగ్గర ఉన్న మూడు ఐఫోన్లను ఇచ్చి వీటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని చెప్పడంతో పాటు రూ.20 లక్షల చెక్ ఇచ్చి పంపించాడు. అయితే, బాధితులు వెళ్లిపోయాక వారిపైనే అత్తాపూర్ పోలీసులకు సూర్య ఫిర్యాదు చేశాడు. తనను బెదిరించి తన ఫోన్లు లాక్కెళ్లారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు అసలు విషయాన్ని రాబట్టారు. బంగారం కోసం హిమాయత్‌నగర్, నీలోఫర్‌లో సూర్య భాయ్‌కు బాధితులు రూ.30 లక్షలు ఇచ్చినట్లు విచారణలో బయటపడింది. దీంతో అత్తాపూర్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. కేసును నారాయణగూడకు బదిలీ చేశారు.

## సీఆర్ పాటిల్‌తో సీఎం ఏం మాట్లాడారో ప్రజలకు చెప్పాలి

హైదరాబాద్, జూన్26 : భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ప్రస్తావించిన ప్రాజెక్టులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, తుంగభద్ర అంశంపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని అన్నారు. తెలంగాణకు ఆ రెండు ప్రాజెక్టుల నుంచి 15.9 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉండగా, కేవలం 5 టీఎంసీలే చూపిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. కేసీఆర్ తెలంగాణకు రావాల్సిన వాటా కంటే తక్కువకు అంగీకరించారని పేర్కొన్నారు. అలాగే ఎస్ఐఆర్‌పై ఓవైసీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, భాజపా ఐడీ కార్డు మాత్రమే కాదు, పాస్‌పోర్ట్ వంటి గుర్తింపు పత్రాల చెల్లుబాటుపై ఆయన చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు.

# కొత్త హంగులతో భోగాపురం విమానాశ్రయం

### జూలై 5న ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం!

### 8నుంచి విమానాల రాకపోకలు ప్రారంభం!!

### ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ



భోగాపురం, జూన్26 : ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, నవ్యాంధ్రప్రదేశ్ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. జూలై 5న భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని అత్యంత వైభవంగా ప్రారంభించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుని, రికార్డు సమయంలో పనులను పూర్తి చేయించారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి తుది అధికారిక షెడ్యూల్ ఆమోదం కోసం రాష్ట్ర అధికార యంత్రాంగం ప్రస్తుతం వేచి చూస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్న విమానాశ్రయం ఐఎన్ఎస్ డేగా నేవీ రక్షణ పరిధిలో ఉండటం వల్ల అంతర్జాతీయ సర్వీసులకు, రాత్రి వేళల్లో విమానాల రాకపోకలకు అనేక సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా జీఎమ్ఆర్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించారు. అత్యాధునిక రన్‌వే, అంతర్జాతీయ కార్గో టెర్మినల్, ఏకకాలంలో పదుల సంఖ్యలో విమానాలు పార్క్ చేసే ఏప్రాన్ సౌకర్యాలతో ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ రూపుదిద్దుకుంది. ఇది అందుబాటులోకి వస్తే ప్రపంచ దేశాల నుండి నేరుగా విశాఖకు విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. భోగాపురం విమానాశ్రయం కేవలం ప్రయాణికుల రాకపోకలకే పరిమితం కాకుండా, ఉత్తరాంధ్ర ఆర్థిక వృద్ధికి ఒక ప్రధాన చోదక శక్తిగా మారబోతోంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్న ఫార్మా హబ్‌లు, ఐటీ కారిడార్లు, అక్వా రంగానికి ఈ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ కార్గో సేవలు విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయి. ఇక్కడి ఉత్పత్తులను నేరుగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు వీలవుతుంది. దీనివల్ల వందలాది గ్లోబల్ కంపెనీలు ఉత్తరాంధ్ర వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని, తద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వరకు ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన సిక్స్ లేన్ బీచ్ కారిడార్ రోడ్డు పనులను కూడా వేగవంతం చేసింది. ఈ కనెక్టివిటీ వల్ల భోగాపురం పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగానికి రెక్కలు వచ్చాయి. అలాగే రుషికొండ, భీమిలి, తొట్లకొండ తీరప్రాంతాలు గ్లోబల్ టూరిజం స్పాట్స్‌గా మారబోతున్నాయి. అంతర్జాతీయ పర్యాటకులు నేరుగా ఇక్కడికి చేరుకునే వీలుండటంతో హోటల్, హాస్పిటాలిటీ రంగాలు ఊపందుకోనున్నాయి. గతంలోనే ఈ ప్రాజెక్టుకు బీజం వేసిన చంద్రబాబు నాయుడు, మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోగాపురం పనులపై ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించారు. నిధుల కొరత లేకుండా చూస్తూ, నిర్మాణ సంస్థ జీఎమ్ఆర్‌పై ఒత్తిడి తెచ్చి పనులను పరుగులు పెట్టించారు. పౌర విమానయాన శాఖ నుంచి అవసరమైన అన్ని రకాల అనుమతులు, ట్రయల్ రన్స్‌ను ఇప్పటికే విజయవంతంగా పూర్తి చేశారు. జూలై 5న ఈ మెగా ప్రాజెక్ట్‌ను ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించి, తమ ప్రభుత్వ డెవలప్‌మెంట్ విజన్‌ను దేశవ్యాప్తంగా చాటాలని కూటమి భావిస్తోంది. ఎయిర్‌పోర్ట్ రన్‌వే, టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ టవర్ పనులు వంద శాతం పూర్తవడంతో పీఎమ్ఓ నుంచి క్లియరెన్స్ రాగానే అధికారికంగా ప్రారంభోత్సవ తేదీని ప్రకటించనున్నారు. ప్రధాని మోదీ పర్యటన ఖరారైతే.. అదే రోజు ఉత్తరాంధ్రలో మరికొన్ని కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ సిద్ధం చేస్తోంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభం అనేది నవ్యాంధ్రప్రదేశ్ జెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి ఒక మైలురాయి కాబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదని సామాన్య ప్రజల భావన.

# సమిష్టిగా ఏఐ పునాదులను పటిష్టం చేద్దాం

### భారత్-యూఎస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో నిర్ణయం

న్యూఢిల్లీ,జూన్26 : భారత్, అమెరికా సంబంధాలలో కీలక పరిణామం జరిగింది. ఇరు దేశాల వ్యూహాత్మక సాంకేతిక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకునే ప్రయత్నంలో భాగంగా భారత్, అమెరికాలు ఒక రహస్య రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించాయి. ఈ మీటింగ్‌లో ఇరు దేశాల సీనియర్ ప్రభుత్వ అధికారులు, పారిశ్రామిక నాయకులు పాల్గొని ఏఐ, సెమీకండక్టర్ సరఫరా గొలుసులు, కీలక ఖనిజాల రంగాలలో సహకారాన్ని బలోపేతం చేయడంపై చర్చించారు. ఈ సమావేశంలో కలిసికట్టుగా ఏఐ పునాదులను పటిష్టం చేద్దామని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఈ మీటింగ్ ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ అమెరికాలోని భారత రాయబార కార్యాలయం శుక్రవారం ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. "చిప్స్, కీలక ఖనిజాలు, ఏఐ రంగాలలో పనిచేస్తున్న భారతీయ, అమెరికన్ కంపెనీల బృందాన్ని ఉద్దేశించి అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా, ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్, వాణిజ్య శాఖ డిప్యూటీ అండర్ సెక్రటరీ బిల్ గైడెరా ప్రసంగించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని యూఎస్‌లోని ఇండియన్ ఎంబసీ యూఎస్ఐఎస్‌పీఎఫ్, సిల్వరాడో పాలసీ యాక్సిలరేటర్ (పరిశోధనా సంస్థ)తో కలిసి నిర్వహించింది. ఈ మీటింగ్‌లో జరిగిన చర్చలలో విదేశాంగ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నాగరాజ్ నాయుడు, యూఎస్ఐఎస్‌పీఎఫ్ అధ్యక్షుడు ముకేశ్? అఘి, ఇంధన శాఖ డిప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీ క్రిస్టోఫర్ సల్దానా కూడా పాల్గొన్నారు. పెట్టుబడి వాతావరణాన్ని బలోపేతం చేయడం, ఏఐ రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించడంపై ఈ రౌండ్ టేబుల్ సమావేశం దృష్టి సారించింది" అని అమెరికాలోని ఇండియన్ ఎంబసీ ఎక్స్ పోస్టులో పేర్కొంది. కొద్ది రోజుల క్రితం అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా పెట్టుబడి విస్తరణ, సరఫరా గొలుసు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల గురించి చర్చించడానికి అగ్రశ్రేణి కార్పొరేట్, టెక్నాలజీ నాయకులతో పలు ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించారు. అమెరికాతో ఢిల్లీకి పెరుగుతున్న ఆర్థిక, సాంకేతిక భాగస్వామ్యాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. భారత మార్కెట్లో తమ ఉనికిని మరింత విస్తరించుకోవడంపై చర్చించడానికి రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ ప్రెసిడెంట్, సీఈఓ క్రిస్ నికోలస్‌తో సమావేశమయ్యారు. "దేశంలో వాల్‌మార్ట్ పెట్టుబడులు, దీర్ఘకాలిక వృద్ధి ప్రణాళికలు, పటిష్టమైన సరఫరా గొలుసులను నిర్మించాలనే నిబద్ధతపై ఆ కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ క్రిస్ నికోలస్‌తో ఫలప్రదమైన చర్చలు జరిపా " అని వినయ్ క్వాత్రా పేర్కొన్నారు. సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మిని అహ్వానం మేరకు ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశంలో జూన్ 27–29 వరకు పర్యటించనున్నారు. జూన్ 29న జరిగే సీషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకల్లో గౌరవ అతిథిగా పాల్గొననున్నారు. అలాగే సెషెల్స్ జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ప్రవాస భారతీయులతో కూడా సమావేశమవుతారు. అయితే మోదీ పర్యటన నేపథ్యంలో విక్టోరియా–మహే ప్రాంతమంతటా ప్రవాస భారతీయులు ఆయనకు స్వాగతం పలుకుతూ పోస్టర్లను ఏర్పాటు చేశారు.

## పాఠశాలలు, పిల్లలపై దాడులు ఉపేక్షించం

### దాడులు చేసేవారిని వదిలిపెట్టొద్దు

### ఐరాసలో గళమెత్తిన భారత ప్రతినిధులు

న్యూఢిల్లీ,జూన్26 : ప్రపంచవ్యాప్తంగా యుద్ధ ప్రాంతాల్లో నలిగిపోతున్న పిల్లలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సరిహద్దుల్లో యుద్ధాలు, అంతర్గత ఘర్షణల సమయంలో పాఠశాలలు, పిల్లలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసేవారిని వదిలిపెట్టొద్దని, చట్టం ముందు నిలబెట్టాలని భారత్ పేర్కొంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వేదికగా భారత్ ఈ మేరకు స్పష్టం చేసింది. కేవలం పిల్లలకు రక్షణ కల్పించడం మాత్రమే సరిపోదని, వారిపై అఘాయిత్యాలకు ఒడిగట్టే వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించినప్పుడే ఆ రక్షణకు పూర్తి అర్థం చేకూరుతుందని నొక్కి చెప్పింది. ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ భద్రతా మండలిలో జరిగిన "సంఘర్షణల ప్రభావితమైన పిల్లల విద్యా సంరక్షణ – నిబంధనల అమలు" అనే అంశంపై జరిగిన చర్చలో పాల్గొని ఆయన మాట్లాడారు. యుద్ధాలు, అంతర్గత కలహాల వల్ల తీవ్రంగా నష్టపోయేది భవిష్యత్తు తరమైన పిల్లలేనని భారత్ ఆవేదన వ్యక్తం చేసింది. భీకర ఘర్షణల సమయంలో కూడా విద్య అనేది పిల్లల ప్రాథమిక హక్కుగా కొనసాగాలని, దీన్ని ఏ శక్తీ హరించలేదని పర్వతనేని హరీశ్ స్పష్టం చేశారు. సమాజంలో శాశ్వత శాంతిని స్థాపించడంలో విద్య అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని, సాయుధ పోరాటాల్లో పిల్లల ప్రాణాలను కాపాడటానికి, వారి విద్యా హక్కును రక్షించడానికి భారతదేశం ఎల్లప్పుడూ అగ్రభాగాన నిలుస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. పాఠశాలలపై బాంబుల వర్షం కురిపిస్తూ, బాల్యాన్ని చిదిమేస్తున్న శక్తుల పట్ల అంతర్జాతీయ సమాజం కఠినంగా వ్యవహరించకపోతే మానవాళికే ముప్పని హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, హక్కుల ఉల్లంఘనలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యంత భయంకరమైన స్థాయికి చేరుకున్నాయని భారత్ గుర్తుచేసింది. ఈ మేరకు ఇటీవల ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ సమర్పించిన నివేదికలోని గణాంకాలను ప్రస్తావించింది. ఈ నివేదికలోని గణాంకాలు అంతర్జాతీయ సమాజపు సామూహిక వైఫల్యానికి అద్దం పడుతున్నాయని విచారం వ్యక్తం చేసింది. కేవలం ఒక సంవత్సర కాలంలోనే పిల్లలపై ఏకంగా 38,558 తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయని ఐరాస నివేదిక చెబుతోంది. వీటివల్ల ప్రపంచవ్యాప్తంగా 24,174 మంది పిల్లలు ప్రత్యక్షంగా నష్టపోయారు. ఇందులో 15,493 మంది బాలురు, 7,990 మంది బాలికలు ఉండగా, మిగిలిన వారి వివరాలు లభ్యం కాలేదు. ఐక్యరాజ్యసమితి ఈ రికార్డులను సేకరించడం ప్రారంభించిన తర్వాత, ఇంత భారీ సంఖ్యలో పిల్లలు హింసకు గురికావడం ఇదే మొదటిసారి. యుద్ధాలు, అంతర్గత కలహాలు జరిగే ప్రాంతాల్లో పిల్లలపై ఒకటి కంటే ఎక్కువసార్లు జరుగుతున్న దాడుల సంఖ్య కూడా ఏటా పెరిగిపోతోందని నివేదిక చెబుతోంది. యుద్ధ నిబంధనలను, అంతర్జాతీయ మానవతా చట్టాలను ఆయా పక్షాలు తుంగలో తొక్కుతున్నాయని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. అన్నింటికంటే దారుణమైన విషయం ఏమిటంటే, కేవలం ఒక్క ఏడాదిలోనే పాఠశాలలు, విద్యాసంస్థలపై జరిగిన దాడుల సంఖ్య 44 శాతం పెరిగాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 47.3 కోట్ల మంది పిల్లలు అంటే ప్రపంచంలోని ప్రతి ఆరుగురిలో ఒకరు యుద్ధ వాతావరణంలో బతుకుతున్నారు లేదా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వలసపోతున్నారని ఐరాస నివేదిక చెప్పింది. వీరిలో 8.5 కోట్ల మందికి పైగా పిల్లలకు అసలు చదువుకునే భాగ్యమే లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇది పిల్లల భవిష్యత్తును మాత్రమే కాదని, ఆయా దేశాల భవితవ్యాన్ని కూడా నాశనం చేస్తోందని భారత్ ఆవేదన వ్యక్తం చేసింది. దురదృష్టవశాత్తూ కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ బలగాలే బాధ్యతారహితంగా ఆసుపత్రులు, పాఠశాలలపై దాడులకు కారణమవుతున్నాయని ఐరాస నివేదిక స్పష్టం చేసింది.

# రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

### సిఎంఓ నుంచి అజిత్ రెడ్డి ఔట్

### కొత్తగా ఇన్వెస్ట్ తెలంగాణ సివిఓగా నియామకం

### సిఎంవో ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్

### జిఎడి ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్

### అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్

హైదరాబాద్,జూన్ 26 : తెలంగాణ రాష్ట్ర పాలనా విభాగంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చేపట్టింది. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంటూ ఒకేసారి 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తాజా బదిలీలలో భాగంగా ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌ను నియమించారు. అలాగే ఇప్పటివరకు సీఎంఓలో సేవలందించిన అజిత్‌రెడ్డిని అక్కడి నుంచి బదిలీ చేసి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొత్త బాధ్యతలను అప్పగించారు. జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమితులు అయ్యారు. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ అధికారులకు అదనపు బాధ్యతలను కూడా కేటాయించింది. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులు కాగా.. ఆయనకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించగా.. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. చేనేత, హస్తకళల ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సవ్యసాచి ఘోష్‌కు ఆ శాఖలోనే మరికొన్ని అదనపు బాధ్యతలను కేటాయించగా.. అదే శాఖకు జాయింట్ సెక్రటరీగా కాత్యాయనీ దేవిని నియమించారు. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా రఘునందన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే.. హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కె. చంద్రకళను, తెలంగాణ రెడ్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీని నియమించారు. ఆర్‌అండ్‌బీ స్పెషల్ సెక్రటరీగా గంగాధర్‌కు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా టి.వెంకన్నను నియమించారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత కీలకమైన టూరిజం డైరెక్టర్‌గా కె.విద్యాసాగర్‌ను నియమించారు. తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 30న పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రికి అడ్వైజర్ / ఎక్స్–అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం. 912 జారీ చేసింది. పరిపాలనలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవాన్ని వినియోగించుకునేందుకు రిటైర్మెంట్ రోజే ప్రభుత్వం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ఈ నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను విడిగా జారీ చేస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# ఝార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### ప్రయాణికుల వ్యానును ఢీకొన్న లారీ

### ఏడుగురు అక్కడికక్కడే మృతి

రామ్‌గఢ్, జూన్26 : ఝార్ఖండ్‌లోని రామ్‌గఢ్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బొగ్గుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ప్రయాణికుల వ్యానును ఢీకొట్టడంతో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడగా మెరుగైన చికిత్స కోసం రాంచీకి తరలించారు. ఈ ప్రమాదంతో ప్రాంతమంతా విషాదంలో మునిగిపోయింది. మృతులంతా బ్యాండ్, తాషా బృందానికి చెందిన కళాకారులేనని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదం గురువారం అర్ధరాత్రి సమయంలో రామ్‌గఢ్ జిల్లాలోని రజరప్ప పోలీస్‌స్టేషన్ పరిధిలో లారి–బర్లాంగ్ సమీపంలోని రామ్‌గఢ్–బొకారో జాతీయ రహదారి (ఎన్‌హెచ్–23)పై జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా దెబ్బతిన్న వ్యానులో చిక్కుకున్న వారిని బయటకు తీసి రామ్‌గఢ్ సదర్ ఆస్పత్రికి తరలించారు. అయితే వారిలో ఏడుగురు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉండటంతో రాంచీలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బల్సగరా ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, మారంగ్‌మర్చా గ్రామానికి చెందిన బ్యాండ్–తాషా బృంద సభ్యులు ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వ్యానులో వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత మొత్తం అంతా ఒకే వాహనంలో తిరిగి బల్సగరా వైపు బయలుదేరారు. ఇదే సమయంలో రామ్‌గఢ్ వైపు నుంచి వేగంగా వస్తున్న బొగ్గు లారీ ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వచ్చిన వ్యానును ఢీకొట్టింది. లారీ ఢీకొట్టిన వేగానికి వ్యాను పూర్తిగా ధ్వంసమైంది. వాహనం ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో అందులో ప్రయాణిస్తున్న వారంతా తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం మృతుల్లో ఆరుగురు మారంగ్‌మర్చా గ్రామానికి, ఇద్దరు బల్సగరా ప్రాంతానికి చెందిన వారిగా భావిస్తున్నప్పటికీ అధికారికంగా ఇంకా పూర్తి వివరాలు వెల్లడించలేదు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది సహాయంతో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. రామ్‌గఢ్ సదర్ ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, మొత్తం ఎనిమిది మందిని ఆస్పత్రికి తీసుకువచ్చారని, వారిలో ఏడుగురు అప్పటికే మృతి చెందారని చెప్పారు. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని మెరుగైన చికిత్స కోసం రాంచీకి పంపినట్లు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మార్చురీలో భద్రపరిచినట్లు వెల్లడించారు. రామ్‌గఢ్ ఎస్‌డీపీఓ ఆలోక్ రంజన్ మాట్లాడుతూ, ప్రాథమిక దర్యాప్తులో లారీ రాంగ్‌సైడ్‌లోకి వచ్చి వ్యానును ఢీకొట్టినట్లు తెలుస్తోందన్నారు. వ్యానులో బ్యాండ్–తాషా బృంద సభ్యులు ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఢీకొట్టిన తీవ్రతకు వాహనం పూర్తిగా ధ్వంసమైందని, అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ ప్రమాదంతో మృతుల కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రామ్‌గఢ్–బొకారో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో రహదారిపై రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. స్థానిక ప్రజలతో అధికారులు చర్చలు జరిపి రహదారి దిగ్బంధాన్ని తొలగించే ప్రయత్నం చేశారు. గ్రామస్థుల ఆరోపణల ప్రకారం, ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ శాశ్వత భద్రతా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలకు కారణమవుతున్న ఈ ప్రాంతాన్ని 'బ్లాక్ స్పాట్'గా గుర్తించి వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానికుల సమాచారం ప్రకారం ఇదే ప్రాంతంలో గత నాలుగు రోజుల వ్యవధిలోనే పదిమందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై వేగ నియంత్రణ చర్యలు, హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ పర్యవేక్షణను పెంచాలని కోరుతున్నారు.

# సంపాదకీయం

## వెనిజువెలా విలయం !

పర్యావరణ విధ్వంసం కూడా భూకంపాలకు కారణమై ఉండొచ్చని నిపుణులు కొందరు అభిప్రాయ పడుతున్నారు. జాపన్ భూకంపాలకు నిలయం. అయితే ఇప్పుడు వెనిజువెలాలో జరిగిన భూకంప విలయం అంతా ఇంతా కాదు. ఏకకాలంలో పలు దేశాల్లో భూకంపాలు ఆందోళనకు గురిచేశాయి. ఇవి మానవులకు హెచ్చరిక కావాలి. వెనెజువెలాలో సంభవించిన రెండు భారీ భూకంపాలు అక్కడి ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయి. ఒక్క నిమిషం వ్యవధిలో రెండు తీవ్ర భూకంపాలు రావడంతో భారీ ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించాయి. ఇకపోతే లాటిన్ అమెరికా దేశం వెనెజువెలాలో సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ విలయంలో మృతులు అంతకంత కూ పెరుగుతుండగా గల్లంతైన వారి సంఖ్య వేలల్లో ఉండటం విచారకరం. ప్రకృతి ప్రకోపానికి ఇప్పటివరకు 235 మంది బలైనట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. మరో 4300 మంది గాయపడి నట్లు తెలిపింది. భవన శిథిలాల కింద ఇంకా అనేక మంది చిక్కుకున్నట్లు పేర్కొంది. ఈ వరుస భూకంపాల అనంతరం దాదాపు 40వేల మంది జాడ తెలియరాలేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వెనెజువెలా రాజధాని కారకాస్ సహా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఈ భూప్రకంపనలు సంభవించాయి. అయితే, అత్యంత తీవ్రంగా ప్రభావితమైన లా గువేరాలో మాత్రం పరిస్థితి దయనీయంగా ఉంది. భూకంపం ధాటికి ఈ తీర నగరం అతలాకుతలమైంది. ఇక్కడ 100కు పైగా భవనాలు నేలమట్టమైనట్లు సహాయక చర్యల్లో పాల్గొన్న ఐరాస ప్రతినిధులు వెల్లడించారు. వీటి కింద చిక్కుకున్నవారిని గుర్తించడం కూడా కష్టతరంగా మారిందని పేర్కొన్నారు. శిథిలాలను తొలగించడానికి చాలా సమయం పడుతోందని తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా శిథిలాల దిబ్బగా మారినట్లు తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ వెల్లడించారు. భూకంపం నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని ఐరాస ప్రతినిధులు వెనెజువెలా ప్రభుత్వాన్ని కోరారు. సోషల్ మీడియాతో ప్రజలు కీలక సమాచారాన్ని వేగంగా తెలుసుకోగలుగుతారని పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వెనెజువెలా పౌరులకు 'ఎక్స్' అందుబాటులోకి వచ్చింది. 2024లో మదురో అధికారంలో ఉన్నప్పుడు ఈ మైక్రోబ్లాగింగ్ సైట్‌ను నిషేధించిన సంగతి తెలిసిందే. మరోవైపు ఈ క్లిష్ట సమయంలో వెనెజువెలాను ఆదుకునేందుకు పలు దేశాలు ముందుకు వస్తున్నాయి. 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని అందిస్తామని అమెరికా ప్రకటించింది. దీన్ని తరలించేందుకు ఇప్పటికే రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసింది. స్పెయిన్,జర్మనీ,ఫ్రాన్స్, స్విట్జర్లాండ్,నెదర్లాండ్, మెక్సికో, బ్రెజిల్ వంటి దేశాలు కూడా సహాయక సిబ్బంది, వైద్య సిబ్బంది, మానవతా సాయం అందించేందుకు సిద్ధమయ్యాయి. ఈ భూకంపాల ప్రభావం భారత్‌పై కూడా తీవ్రంగా పడనుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల వాణిజ్యపరంగా ఆదేశంతో పలు ఒప్పందాలు జరిగాయి. ఇప్పుడు దెబ్బతిన్న వెనిజువెలాతో మనకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇటీవలి కాలంలో వెనెజువెలా నుంచి భారత్ చమురు దిగుమతులను గణనీయంగా పెంచింది. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో భారత చమురు శుద్ధి సంస్థలు ఇటీవల వెనెజువెలా నుంచి ముడి చమురు కొనుగోళ్లను పెంచాయి. ఏప్రిల్, మే నెలల్లో భారత్‌కు ప్రధాన చమురు సరఫరాదారుల్లో ఒకటిగా వెనెజువెలా ఎదిగింది. ఈ పరిస్థితుల్లో భూకంపం వల్ల అక్కడి ఎగుమతి వ్యవస్థకు అంతరాయం కలిగితే భారత్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. భూ÷ఔకంపం కారణంగా వెనెజువెలా నౌకాశ్రయాల కార్యకలాపాలు దెబ్బతినడం, విద్యుత్ అంతరాయాలు, రవాణా వ్యవస్థలో సమస్యలు, అత్యవసర ఆంక్షలు అమలులోకి రావడం వల్ల చమురు ట్యాంకర్ల రాకపోకలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీంతో సరుకు రవాణా ఖర్చులు, బీమా ప్రీమియంలు, నౌకల నిరీక్షణ వ్యయాలు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. భారత ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ విదేశ్‌కు వెనెజువెలా చమురు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు ఉన్నాయి. భూకంప ప్రభావం ఎక్కువకాలం కొనసాగితే ఆ పెట్టుబడుల నిర్వహణ, ఉత్పత్తి కార్యకలాపాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే వెనిజువెలా కోలుకుంటేనే మళ్లీ వ్యాపార కార్యకలాపాలు ముమ్మరం కానున్నాయి. అందువల్ల అప్పటి వరకు భారత్ వ్యాపారాలకు దెబ్బగానే భావించాలి.

# అయోధ్య దొంగతనం కేసులో కీలక మలుపు!



### ట్రస్ట్ ప్రధాన కార్యదర్శులు రాజీనామా !

న్యూఢిల్లీ,జూన్26 : సిట్ దర్యాప్తు అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో అయోధ్య రామ మందిర కానుకల చోరీ కేసు మరింత ముదిరింది. రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఇప్పుడు రాజీనామా చేశారు. ఆయనతోపాటు అనిల్ మిశ్రా కూడా తప్పుకున్నారు. విరాళాలు, కానుకల దొంగతనం ఆరోపణల నేపథ్యంలో చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ఇద్దరిపై రాజీనామా చేయాలని ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. అందుకే వారు తప్పుకున్నారు. రామ మందిర విరాళాల దొంగతనం కేసులో సిట్ నివేదిక నేపథ్యంలో, పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. నిందితులు ఎనిమిది మంది మధ్యాహ్నం 2:00 గంటల తర్వాత కోర్టులో హాజరుపరుస్తారు. మొహర్రం కారణంగా ఈరోజు కోర్టులకు సెలవు. అందువల్ల, నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తారు. డ్యూటీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అనగా, సాధారణ కోర్టు పనివేళల వెలుపల, సెలవు దినాల్లో లేదా వారాంతాల్లో, అరెస్టు, రిమాండ్ లేదా బెయిల్‌కు సంబంధించిన అత్యవసర న్యాయపరమైన విషయాలను విచారించడానికి నియమించిన న్యాయమూర్తి.రామ మందిర కానుకల దొంగతనం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు అయిన అనంతరం, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఒక కీలక ప్రకటన విడుదల చేశారు. ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించిందని ఆయన తెలిపారు. సిట్ వేగంగా దర్యాప్తు జరిపి తన నివేదికను సమర్పించగా, వెంటనే కేసులు నమోదు చేశారు. ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీసే వారిని వదిలిపెట్టబోమని ఆయన అన్నారు. అయోధ్య హిందూ విశ్వాసానికి ప్రతీక. విశ్వాసాన్ని దెబ్బతీయడం ఆమోదయోగ్యం కాదు అని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరంలో కానుకల దొంగతనం జరిగింది. ఇది బహిర్గతమైన వెంటనే ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఆ సిట్ నివేదిక ఆధారంగా జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇందులో పలువురు గుర్తుతెలియని వ్యక్తులతోపాటు, ఎనిమిది మందిని నిందితులుగా చేర్చారు. ట్రస్ట్ సభ్యుడు కృష్ణమోహన్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా, శ్రీ రామ్ జన్మభూమి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, శ్రీరామ్ శంకర్ యాదవ్ అలియాస్ తిను పేర్లు చేర్చారు. గుర్తించని ఇతర వ్యక్తులను కూడా నిందితులుగా పేర్కొన్నారు. నిందితులపై భారత శిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్లు, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(ఎ) కింద అభియోగాలు మోపారు. ఎఫ్ఐఆర్ నమోదైన వారందరూ ఆలయంలోని విరాళాలు, నగదు నిర్వహణతో ఏదో ఒక విధంగా ఆలయం ట్రస్ట్‌తో సంబంధం కలిగి ఉన్నారని చెబుతున్నారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి అయిన చంపత్ రాయ్‌కు తిన్ను యాదవ్ సహచరుడని చెబుతున్నారు. విరాళాల పెట్టె తాళాలు అతని వద్దే ఉన్నాయని విచారణలో వెల్లడైంది. అనుకల్ప్ మిశ్రా విరాళాలను లెక్కించేవాడు . లవ్‌కుష్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రాకు బంధువని చెబుతున్నారు. మనీష్ యాదవ్, తిన్ను యాదవ్ మేనల్లుడు. సుభాష్ శ్రీవాస్తవ నగదు లెక్కించేవాడు. విరాళాల లెక్కింపు ప్రక్రియలో అవినాష్ శుక్లా కూడా పాలుపంచుకున్నాడు. కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా కూడా నగదు లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్నారు. ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా పేర్కొన్న వ్యక్తులు చాలావరకు కానుకల లెక్కింపు, నగదు నిర్వహణ ప్రక్రియలో పాలుపంచుకున్న ఉద్యోగులేనని అర్థమవుతోంది. ఇది, వీరు వ్యవస్థలోని కింది స్థాయి వ్యక్తులు మాత్రమేనా, లేక ఈ వ్యవస్థ మొత్తం ఉన్నతాధికారుల ఆదేశాలు, రక్షణలో పనిచేస్తోందా అనే ప్రశ్నలను లేవనెత్తుతోంది.

# నేడు వరంగల్‌లో జాబ్ మేళా

### 5 వేల ఉద్యోగాల భర్తీకి అవకాశం

వరంగల్,జూన్26 : నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 27న వరంగల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో 'వరంగల్ కౌశల్ మహోత్సవ్' పేరుతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్‌లోని కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) కళాశాల ప్రాంగణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభం కానుందని, ప్రముఖ ప్రైవేట్ సంస్థలు పాల్గొని సుమారు 5 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు పొందాలని కోరారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఈ మేళా మంచి అవకాశంగా నిలవనుందని పేరొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం

### సర్ ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలి

వరంగల్,జూన్26 : ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం అని బిజెపి నేతలు అన్నారు. ఓటరు జాబితా సవరణ పక్రియ ప్రారంభం కాగా ఎన్యుమరేషన్ పంపిణీ పక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ద్వారా కచ్చితమైన సమాచారంతో కూడిన ఓటరు జాబితా తయారవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించేందుకు తమ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. ఇప్పటికే పార్టీపరంగా బీఎల్‌ఏలను నియమించామని, వారు బూత్ స్థాయిలో ఓటర్లను కలుస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో మ్యాపింగ్ దాదాపు పూర్తయ్యిందని, హనుమకొండ వంటి పట్టణాల్లో మ్యాపింగ్ కొంత కష్టతరంగా మారిందనే సమాచారం పార్టీ శ్రేణుల ద్వారా తెలుసుకున్నామన్నారు. కానీ, ఓటరు మ్యాపింగ్ చేసేందుకు ఎన్నికల కమిషన్, బీఎల్‌వోలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. భారతదేశం ప్రజాస్వామ్యబద్ధంగా నడుస్తున్నదేశమని, ప్రజాస్వామ్యంలో ప్రజలు వారి ప్రతినిధులను ఓటు హకు ద్వారా ఎన్నుకొంటారని, నేడు జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన పక్రియ అని అన్నారు. ఓటరు విధిగా తన ఓటును 2002 ఓటర్ లిస్ట్ ప్రకారం మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు. డబుల్, డెత్ ఓటర్ లేకుండా అర్హత కలిగిన వారి ఓటు ఉండేలా, కొత్త ఓటరును సైతం నమోదయ్యే విధంగా బీఆర్ఎస్ పార్టీ, పార్టీ నియమించిన బీఎల్‌వోలు పనిచేస్తున్నారని తెలిపారు. సర్ పక్రియపై పార్టీ పరంగా ఇప్పటికే డివిజన్ల వారీగా సమావేశాలు సైతం నిర్వ హించామని స్పష్టం చేశారు.

# ఎల్‌నినోతో తక్కువ వర్షపాతం

### కేంద్రం తాజా అంచనాలు

న్యూఢిల్లీ : ఎల్ నినో ప్రభావం కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ జిల్లాలు కలిగిన ఆయా రాష్ట్రాలు తమ అత్యవసర ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించింది. ఈ 315 జిల్లాల్లో 25 శాతం కంటే తక్కువ సాగునీటి వసతి కలిగిన 111 జిల్లాలను అత్యంత ప్రమాదకమైన కేటగిరీగా గుర్తించారు. 25 నుంచి 50 శాతంలోపు సాగునీటి వసతి ఉన్న మరో 76 జిల్లాలను మధ్యస్థ ప్రమాదకర కేటగిరీలో చేర్చగా, 50 శాతం కంటే ఎక్కువ సాగునీటి సౌకర్యం ఉన్న 128 జిల్లాలను సాపేక్షంగా తక్కువ ముప్పు ఉన్న ప్రాంతాలుగా పరిగణించారు. అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జిల్లాలు ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో కేంద్రీకృతమై ఉన్నాయి. మిగిలిన జిల్లాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. బలహీనమైన రుతుపవనాల ప్రభావాన్ని తట్టుకునేందుకు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల సాగువైపు రైతులను ప్రోత్సహించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. పంటల వైవిధ్యం, తేమ సంరక్షణ, సమర్థవంతమైన నీటి యాజమాన్యం వంటి వ్యూహాలను అనుసరించాలని తెలిపింది. చెరువుల మరమ్మతులు, చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ, కాలువల్లో పూడికతీత, నీటి సంరక్షణ నిర్మాణాల విస్తరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. మరోవైపు 2026 ద్వితీయార్థంలో ఎల్ నినో తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ హెచ్చరించింది. 'సౌత్ ఏషియన్ లకెమేట్ అవుట్ లుక్ ఫోరం' అంచనాల ప్రకారం భారతదేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో కేవలం 90 శాతం మాత్రమే కురిసే అవకాశం ఉంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి కారణంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎల్ నినో వల్ల అనావృష్టి ఏర్పడి ఆహార ద్రవ్యోల్బణం పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది.


# మరో నాలుగు చెరువుల పునరుద్ధరణ

### 107 కోట్లతో చేపట్టిన హైడ్రా

హైదరాబాద్,జూన్26 : నగరంలో వరదల కట్టడి, భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీచెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూ. 107 కోట్ల భారీ వ్యయంతో మరో నాలుగు ప్రముఖ చెరువుల అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ అధికారికంగా ప్రారంభించారు. ఇబ్రహీంపట్నంలోని పెద్ద చెరువు, కాముని చెరువుల వద్ద ఆయన స్వయంగా భూమి పూజ చేసి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హైడ్రా చేపట్టిన ఈ పునరుద్ధరణ జాబితాలో ఇబ్రహీం పెద్ద చెరువు, భగీరథమ్మ చెరువు, కాముని చెరువు, కాప్రా చెరువులు ఉన్నాయి. మొత్తం 311 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఉన్న ఈ నాలుగు చెరువులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. వీటిని కేవలం జలాశయాలుగానే కాకుండా, స్థానికులకు ఆహ్లాదాన్ని పంచే అద్భుతమైన పర్యాటక కేంద్రాలుగా మార్చనున్నారు. ఇందులో భాగంగా చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు పెద్ద చెరువుల్లో పర్యాటక శాఖ సహకారంతో త్వరలోనే బోటింగ్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# నీ ఉన్నతి నీ చేతిలోనే

ప్రపంచంలో ప్రతివ్యక్తీ తనను తానే ఉద్ధరించుకోవాలే కానీ పతనావస్థను పొందకూడదు. ప్రపంచంలో తనకు తానే బంధువు.. తానే శత్రువు అంటున్నాడు కృష్ణపరమాత్మ. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' సాంసారిక బంధాలకు లేదా విముక్తికి కారణమైన మనసు వలలో చిక్కితే బంధనాలు.. దానిని జయిస్తే.. విముక్తి. ప్రపంచంలో ప్రతివ్యక్తీ తనను తానే ఉద్ధరించుకోవాలే కానీ పతనావస్థను పొందకూడదు. ప్రపంచంలో తనకు తానే బంధువు.. తానే శత్రువు అంటున్నాడు కృష్ణపరమాత్మ. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' సాంసారిక బంధాలకు లేదా విముక్తికి కారణమైన మనసు వలలో చిక్కితే బంధనాలు.. దానిని జయిస్తే.. విముక్తి. మనసును జయించినవాడే ఆత్మవంతుడు, ప్రశాంతుడు, విజయసాధకుడు. గురువులు, శాస్త్రాలు, దేవుడు.. ఇవన్నీ మార్గాన్ని చూపుతాయే కాని నడవవలసింది మాత్రం మనమే! పంచభక్షపరమాన్నాలను బల్లపై ఉంచినా.. మనకాళ్లతోనే అక్కడికి నడవాలి. మన కండ్లతోనే చూడాలి. మన చేతులతోనే తినాలి. వందమంది అనుభవజ్ఞులైన వైద్యులు తనచుట్టూ ఉన్నా క్షయరోగి తన దగ్గు తానే దగ్గాలి. ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగాలనే తపన అణువణువునా రగిలిపోయే వ్యక్తి ఉన్నత శిఖరాలకు చేరగలుగుతాడు. సోమరులై, ఇంద్రియలోలురై, ప్రవాహాన్ని అనుసరించి నడిచేవారిని ఏ దేవుడూ ఉద్ధరించడు. అనుక్షణం మన మనసు ధర్మాధర్మ విచికిత్స చేస్తూనే ఉంటుంది.. యుక్తమైన దానిని ఆదరిస్తే.. జీవితలక్ష్యం నెరవేరుతుంది. ఎవరైనా సహాయం చేస్తారు లేదా భగవంతుడే ఉద్ధరిస్తాడనే భావన పనికిరాదు. ఆరుపాళ్లు నువ్వు ప్రయత్నిస్తే.. ఒకపాలు భగవంతుడు సాయపడతాడు. తనను తాను ఉన్నతీకరించు కునే వ్యక్తికే భగవంతుడు కూడా సహాయకారిగా ఉంటాడనే సామెత ఉన్నది.



ఆధ్యాత్మికం

# మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరూ భాగస్వాములు కావాలి

## • పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి • మాదకద్రవ్యాల నియంత్రణపై గోదావరిఖనిలో మానవహారం





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి కోరారు. శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, అఫ్జలొద్దీన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గోదావరిఖని మున్సిపాలిటీ జంక్షన్ వద్ద గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించే ఉద్దేశంతో మానవహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ రమేష్ హాజరై విద్యార్థులతో కలిసి మానవహారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 22 నుంచి 26 వరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గోదావరిఖని సబ్‌డివిజన్‌లో మానవహారం నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని గంజాయి, మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా గత 6 నెలలుగా పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డ్రగ్స్, గంజాయి వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తమ పరిసరాల్లో ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే డయల్-100 లేదా 1908కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాజాన్ని, ముఖ్యంగా యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఏసీపీ రమేష్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు బానిసలైన వారిని నేరస్తులుగా కాకుండా బాధితులుగా చూడాలని అన్నారు. మత్తువ్యసనానికి గురైన వారిలో ఆరోగ్య పరిస్థితి, మానసిక స్థితి, ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా డీ-అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు వ్యసనానికి గురైన వారిని గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే, వారిని సంబంధిత ఆసుపత్రులు, డీ-అడిక్షన్ సెంటర్లకు తరలించి వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యసనాన్ని శిక్షల ద్వారా కాకుండా చికిత్స ద్వారా నిర్మూలించడం సాధ్యమవుతుందన్నారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజల సహకారం అత్యంత కీలకమని పేర్కొంటూ, డ్రగ్స్ వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే సమాజాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దడం సాధ్యమవు తుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువత, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం నిర్వహణ సందర్భంగా కొంతమంది వాహనదారులకు స్వల్ప అసౌకర్యం కలిగినప్పటికీ సహకరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గంజాయి నియంత్రణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, సమాజ భద్రత కోసం ప్రజలు పోలీసులకు నిరంతరం సహకరించి, సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మనోహర్, అనూష, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# మహిళా భవనం ప్రారంభంలో శిలాఫలకం రగడ..

## • గత శంకుస్థాపన ఫలకం ఎక్కడ? • ఎమ్మెల్యేను నిలదీసిన బిఆర్ఎస్ శ్రేణులు • హామీతో సద్దుమణిగిన వివాదం



ఎమ్మెల్యేకు నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ నాయకులు

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం జీలకుంట గ్రామంలో మహిళా భవనం ప్రారంభోత్సవం సందర్భంగా శిలాఫలకం అంశం రాజకీయ వివాదానికి దారితీసింది. మహిళా భవనం ప్రారంభోత్సవానికి విచ్చేసిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావును బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకుని తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేశాయి. బీఆర్ఎస్ నాయకుల కథనం ప్రకారం.. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి చొరవతో మహిళా భవనానికి శంకుస్థాపన జరిగిందని, ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన శంకుస్థాపన శిలాఫలకాన్ని పక్కన పెట్టి, ప్రస్తుతం కేవలం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని మాత్రమే ఏర్పాటు చేయడం సరికాదని వారు ప్రశ్నించారు. అలాగే భవన నిర్మాణానికి సంబంధించిన ఎక్కువశాతం పనులు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని, అలాంటప్పుడు గత శంకుస్థాపనకు సంబంధించిన గుర్తింపును అక్కడ ఏర్పాటు చేయకపోవడం సమంజసం కాదని బీఆర్ఎస్ శ్రేణులు అభిప్రాయపడ్డాయి. ఉద్దేశపూర్వకంగానే ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేను కొంతసేపు అడ్డుకుని తమ నిరసన తెలిపారు. విషయంపై స్పందించిన ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, "ఈ విషయం నా దృష్టికి ఇప్పుడే వచ్చింది. శంకుస్థాపన శిలాఫలకాన్ని కూడా అక్కడే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాను" అని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీ అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు శాంతించడంతో వివాదం సద్దుమణిగి, కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది. ఈ ఘటన స్థానికంగా రాజకీయ చర్చకు దారితీయగా, అభివృద్ధి పనుల్లో గత ప్రభుత్వాల పాత్రకు తగిన గుర్తింపు ఇవ్వాలనే అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో జీలకుంట మాజీ సర్పంచ్ పత్తి సమ్మిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రైతు జలపతి, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మారెళ్ల రవీందర్, నల్ల రమణారెడ్డి, దొడ్డిపల్లి శ్రీనివాస్, బంగారి మొగిలి, బంగారి సారయ్య, తాండ్ర రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజ్ సమస్యను పరిష్కరించండి

## విలేకరుల సమావేశంలో బాధితురాలు పేర్ని త్రివేణి ఆవేదన



**ఖమ్మం, జూన్ 26, (ది క్రైమ్ న్యూస్):** ఖమ్మం కార్పొరేషన్ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య ధోరణి తో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, ఇంటి ముందు మురుగునీరు నిలిచి తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ప్రకాష్ నగర్ కు చెందిన బాధితురాలు పేర్ని త్రివేణి ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పేర్ని త్రివేణి మాట్లాడుతూ.. ఖమ్మం నగరంలోని 28వ డివిజన్ ప్రకాష్ నగర్ 5వ లైన్ 4-7-125/1 ఇంటి వద్ద ఎగువ నుంచి వచ్చే మురుగునీరు నిలిచి తీవ్ర అసౌకర్యంగా మారిందని, ఈ సమస్యను పరిష్కరించమని ఇప్పటికే అనేకమార్లు మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి తెలియజేసిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇంటికి ఎదురుగా ఉన్న కొంతమంది వ్యక్తులు రాంపులు ఎత్తుగా ఏర్పాటు చేసుకొని కార్లు, ఇతర వాహనాలు నిలుపుకుంటున్నారని, ఇష్టానుసారంగా చెత్త చెందారని కాలువలోకి నెట్టి మురుగునీరు నిలిచి ఉండేందుకు దోహదపడుతుందని తెలిపారు. కాల్వ నిర్మాణాలు కొంతవరకు చేపట్టి నిలిపివేశారని, కాలువ డైవర్షన్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కాల్వ నిర్మాణాలు సక్రమంగా చేయకపోవడం వల్ల మురుగు నీరు నిలిచి దోమలు వృద్ధి చెంది తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేకమార్లు మున్సిపల్ అధికారులు వారి సిబ్బంది దృష్టికి తీసుకు వెళ్ళామని, ఆర్టిఐ కింద దరఖాస్తు చేశామని, సైడ్ కాల్వలను అధ్వానంగా చేసిన వారిపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామని అయినా కూడా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వెల్లుబుచ్చారు. ఇప్పటికే తన తండ్రి చనిపోయాడని,తనకు తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి ఎగువ నుంచి వచ్చే మురుగునీరు సక్రమంగా దిగువకు వెళ్లే విధంగా సైడ్ కాల్వ నిర్మాణాలు చేపట్టాలని, మురుగు నీటి నిల్వ, చెత్తాచెదారం సమస్య లేకుండా చూడాలని, రోడ్డును ఆక్రమించి ఎత్తుగా ర్యాంపులు ఏర్పాటు చేసుకున్న వాటిని తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# సాహూ మహారాజ్ ఆశయాలు సామాజిక న్యాయానికి మార్గదర్శకం: జాజుల లింగం గౌడ్



**మిర్యాలగూడ, జూన్ 26.(ది క్రైమ్ న్యూస్):** భారతదేశంలో రిజర్వేషన్ల అమలుకు ఆద్యుడైన ఛత్రపతి సాహూ మహారాజ్ 152వ జయంతి సందర్భంగా ఆయన సేవలను బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం తొలి అడుగులు వేసిన మహనీయుల్లో సాహూ మహారాజ్ ఒకరని అన్నారు. వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించేందుకు 1902లో కొల్హాపూర్ సంస్థానంలో రిజర్వేషన్లను అమలు చేసి భారతదేశ చరిత్రలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి రిజర్వేషన్లు అత్యంత అవసరమని సాహూ మహారాజ్ దూరదృష్టితో గుర్తించారని చెప్పారు. అలాగే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయులకు అండగా నిలిచి సామాజిక మార్పుకు విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుత కాలంలో కూడా సాహూ మహారాజ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక న్యాయం, సమాన అవకాశాల పరిరక్షణకు ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని జాజుల లింగం గౌడ్ అన్నారు. రిజర్వేషన్ల పరిరక్షణతో పాటు వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వాలు మరింత చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

# సోదర భావానికి ప్రతీక మొహర్రం

## మొహర్రం వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి



**ధర్మపురి, జూన్ 26, (ది క్రైమ్ న్యూస్):** మొహర్రం సందర్భంగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం ధర్మపురిలో మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని నంది చౌరస్తాలో పీరీలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా హిందూ, ముస్లీంలు సోదరభావంతో కలిసి పీర్ల పండుగ జరుపుకుంటారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజాస్వామ్యా దేశంలో భవిష్యత్తు తరాల కోరకు ఇదే సంస్కృతిని కొనసాగించాలని మంత్రి కోరారు.

# మద్దికుంట పెద్దమ్మతల్లిని దర్శించుకున్న పలు సంఘాల నాయకులు



**కరీంనగర్ టౌన్, జూన్26(ది క్రైమ్ న్యూస్):** పెద్దమ్మ జాతర సందర్భంగా మద్దికుంట గ్రామంలో వెలిసిన పెద్దమ్మతల్లిని పలు కుల సంఘాల నాయకులు ఈరోజు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. గోపగోని నవీన్ గౌడ్ గౌడ సంక్షేమ సంఘం మానకొండూర్ నియోజకవర్గ ఇంచార్జి, చిల్ల ఎల్లయ్య ముదిరాజ్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, కుమార్ ప్రధాన కార్యదర్శి, కొయ్యడ రమేష్ మాదిగ మాదిగ సంఘ అధ్యక్షులు, నరసయ్య ఉపాధ్యక్షులు, గణేష్ పంబాల పూజారి, ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల కోలాహలంతో సందడిగా మారింది.

# పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీఓ జలకుమారి..



**జమ్మికుంట, జూన్ 26 (ది క్రైమ్ న్యూస్):** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) జలకుమారి జమ్మికుంట పరిధిలోని పోలింగ్ స్టేషన్ నం.177ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం అమలును పరిశీలించి, అక్కడ నిర్వహిస్తున్న ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిర్దావర్ గడ్డం శంకర్, జీపీఓ శ్రవణ్, బీఎల్ఓ అఖిలాండం పాల్గొని ఓటర్లకు ఫారాలను అందజేసి, వాటిని సక్రమంగా నింపి నిర్ణీత గడువులోగా సమర్పించాలని అవగాహన కల్పించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేసేందుకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని అధికారులు కోరారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞత సభను విజయవంతం చేయండి..

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎక్కటి సంజీవరెడ్డి



**జమ్మికుంట జూన్ 26 (ది క్రైమ్ న్యూస్):** పట్టణంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సెక్రటరీ జనరల్ మరియు జిల్లా అధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి మాట్లాడుతూ చలో కొడంగల్ కారు ర్యాలీని జయప్రదం చేయాలని కోరడం జరిగింది. 28 వ తేదీ ఆదివారం రోజున చేవెళ్ల వెంకటేశ్వర స్వామి టెంపుల్ నుండి కొడంగల్ వరకు జరిగే ర్యాలీని జయప్రదం చెయ్యాలి ఉద్యమకారుల ఫోరం కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టడం, అదేవిధంగా మొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేకే కమిటీ వెయ్యడం తోపటూ టఫ్ విజయము చెప్పక తప్పదు, అదేవిధంగా కమిటీ కాలయాపన లేకుండా ఉద్యమకారుల ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కొడంగల్ లో కృతజ్ఞత సభ చేసే కార్యక్రమానికి 33 జిల్లాల ఉద్యమకారులు, అదేవిధంగా కరీంనగర్ జిల్లా ఉద్యమకారులు స్వచ్ఛందంగా కారు ర్యాలీలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్న. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మూడేళ్ల కుమారస్వామి కాన్స్టెన్సీ ఇన్చార్జి ఆరే రమేష్ రెడ్డి, రేణిగుంట్ల రజిని కుమార్, జమ్మికుంట టౌన్ అధ్యక్షులు మద్దూరి శంకరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్ర భూమిరెడ్డి, ఉపాధ్యక్షులు రాం రాజబాబు, ఎజ్జె తిరుపతి, ఇమ్మడి రాజు, మోతే స్వామి, ఇమ్మడి రాజు, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కనవేని సతీష్ కుమార్, రచ్చ గణేష్, అక్కనపెల్లి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బిచ్చాల లక్ష్మమ్మ గౌడ్‌కు నివాళు అర్పించిన జై గౌడ ఉద్యమం ఖమ్మం జిల్లా కమిటీ



**ఖమ్మం, జూన్ 26, (ది క్రైమ్ న్యూస్):** ఈ నెల ఆదివారం రోజున ముదిగొండ మండలం లోని వల్లభి గ్రామ సర్పంచ్ బిచ్చాల బిక్షం గౌడ్ మాతృ మూర్తి బిచ్చాల లక్ష్మమ్మ గౌడ్ స్వర్గస్తులైనారని తెలిసి, జై గౌడ ఉద్యమం ఖమ్మం జిల్లా కమిటీ వారు బిచ్చాల బిక్షం ఇంటికి వెళ్లి వారి మాతృ మూర్తి బిచ్చాల లక్ష్మమ్మకు నివాళు అర్పించి వారిని పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమం లో జై గౌడ జిల్లా అధ్యక్షులు పొలం పల్లి నాగరాజు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మక్కా రవీందర్ గౌడ్, టౌన్ అధ్యక్షులు బంధం హనుమంతు రావు గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న అవార్డు గ్రహీతతోడేటిదుర్గప్రసాద్‌గౌడ్,తోడేటిసమ్మయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలను సమాజానికి దూరం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత

## ● జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్





**ఖమ్మం, ప్రతినిధి, జూన్ 24(ది క్రైమ్ న్యూస్):** మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, బాధ్యతగా కృషి చేయాలని, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం ఖమ్మం నగరం మమత రోడ్డు లోని వివిసి టాటా సర్వీస్ సెంటర్ నుంచి లాకారం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు, యువత, పోలీస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తో కలిసి రన్ లో కలెక్టర్, పోలీస్ కమిషనర్ లు పాల్గొని స్ఫూర్తినిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో యువత పాత్ర చాల కీలకమని, యువతకు ఉపాధి కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు కేటాయిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే అప్రమత్తం కావాలని అన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకోవాలని, మాదకద్రవ్యాలు, మత్తు పానీయాలు సేవించడం వ్యాధి కంటే ప్రమాదకరమని వివరించారు. డ్రగ్స్ వాడకం వల్ల ఒకరి జీవితం మాత్రమే ప్రభావితం కాదని, కుటుంబం, సమాజాన్ని నాశనం చేస్తుందని అన్నారు. డ్రగ్స్ నియంత్రణ కేవలం అధికారులు మాత్రమే చేయలేరని, ప్రజలంతా సమిష్టిగా ఉంటూ అధికారులకు సహకరిస్తేనే మెరుగైన ఫలితాలు లభిస్తాయని కలెక్టర్ తెలిపారు. డ్రగ్స్ వాడకం ప్రారంభించకముందే మనమంతా మేల్కొనాలని, యువత డ్రగ్స్ వంటి వాటి వైపు వెళ్లకుండా దూరంగా ఉండాలని, తమ ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ఆరోగ్యశాఖ, మాదకద్రవ్య నివారణ సంస్థలు, సమాజం అందరూ కలిసి సమష్టిగా చైతన్యం పెంచినప్పుడే మాదకద్రవ్యాల ప్రమాదం నుంచి దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించగలుగుతామన్నారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలని అన్నారు. యువత దృష్టి అంతా జీవిత లక్ష్యంపై మాత్రమే ఉండాలని, నిషేధిత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థులు ఆకర్షితులు కావద్దని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడితే మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పాడు చేస్తుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన, గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా పోలీసుశాఖ కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తునమన్నారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1908 కు సమాచారం అందించాలన్నారు. మీ వివరాలు గోప్యం గా ఉంచడం జరుగుతుందని అన్నారు. అనంతరం ప్రజలు, యువత, విద్యార్థులు, అధికారులతో కలిసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం పై ప్రతిజ్ఞ చేశారు. తర్వాత "ఐయామ్ యాంటీ డ్రగ్ సోల్జర్స్" సెల్ఫ్ పాయింట్ వద్ద ఫోటోలు దిగడంతో పాటు సైన్ బోర్డు వద్ద సంతకాలు చేసి మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, ఎస్బి ఏసీపీ మహేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు, ఎస్సై లు, అధికారులు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్

## ● పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు పి మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాడపంగి నాగరాజు





**ఖమ్మం, ప్రతినిధి, జూన్ 24 (ది క్రైమ్ న్యూస్):** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం లెనిన్ నగర్ లో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా విద్యారంగాన్ని బాగు చేయడంలో విఫలమైందన్నారు. అధికారంలోకి వస్తే మూతపడిన 6 వేల పాఠశాలను తిరిగి పున ప్రారంభిస్తామని హామీ ఇచ్చి వాటిని ప్రారంభించకపోగా మరో 23 వేల పాఠశాలలను మూసి వేస్తానని ముఖ్యమంత్రి ప్రకటించడం సిగ్గుచేటు అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా నేటికీ గడుస్తున్న పేద విద్యార్థులకు ఇవ్వవలసిన బుక్స్, యూనిఫామ్స్ ఇవ్వలేదన్నారు. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ స్కూళ్లల్లో కనీస వసతులు లేక అనేక మంది విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను బూచిగా చూపెట్టి ఉన్న ప్రభుత్వ స్కూల్స్ ను పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. విద్యార్థులకు ఇవ్వవలసిన పెండింగ్ రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్య హక్కు చట్టం అమలు కోసం చర్యలు చేపట్టాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో కోట్లాది రూపాయల ఫీజులు దోపిడీ జరుగుతున్న ప్రభుత్వం, విద్యారంగ అధికారులు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. యూనిఫామ్స్ బుక్స్ లతో పాటు రకరకాల ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులను కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థ లు దోపిడీ చేస్తున్నాయి. ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకొచ్చి వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాకు కేటాయించిన యూనివర్సిటీని వెనువెంటనే నిర్మించాలని, జేఎన్టీయూ కాలేజీ ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈనెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన లోపు విద్యారంగ సమస్యలను పరిష్కరించే విధంగా నిర్దిష్టమైన కార్యాచరణ ను ప్రకటించాలని లేనిపక్షంలో ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యుజిల్లా అధ్యక్షుడు మస్తాన్, పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షురాలు ఈశ్వరి, గాంధీ, జిల్లా నాయకులు సంజయ్, దివ్య, సుశ్విత, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## ● ఏ ఐ యు కె ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి యాదగిరి డిమాండ్



**ఖమ్మం, ప్రతినిధి, జూన్ 24(ది క్రైమ్ న్యూస్):** శుక్రవారం అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) నారాయణపేట డివిజన్ కమిటీ అధ్యక్షులు చెన్నారెడ్డి అధ్యక్షతన డివిజన్ కమిటీ సమావేశం నారాయణపేట జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి బి యాదగిరి, డివిజన్ కార్యదర్శి కొండ నర్సిములు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏ ఐ యు కె ఎస్) ఆధ్వర్యంలో తేదీ 25 నుండి 30 వరకు మండల అధికారులకు, జిల్లా కలెక్టర్ లు, వ్యవసాయ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేయుటకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం వర్షాకాల పంటల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న విత్తనాల కొరత, నకిలీ విత్తనాలు, ఎరువుల కొరత, పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు, పెరుగుతున్న పెట్టుబడి భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల సమస్యలు మరింత తీవ్రతరం అవుతున్నాయన్నారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, యూరియాను యాప్ ద్వారా బుక్ చేసుకునే విధానాన్ని రద్దు చేసి రైతాంగానికి అవసరమైనంత యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ఎరువుల ధరలను నియంత్రించి రైతులకు అందుబాటు ధరల్లో సరఫరా చేయాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోతున్న రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. రైతులు పండించిన అన్ని రకాల వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, కొనుగోళ్లపై పరిమితులు విధించవద్దని డిమాండ్ చేశారు. పంట మార్పిడిని ప్రోత్సహించాలంటే అన్ని పంటలకు కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి) ప్రకారం కొనుగోలు హామీ ఇవ్వాలని, అదనపు ప్రోత్సాహకాలు ప్రకటించాలని కోరారు. రైతాంగ సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించకపోతే అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏ ఐ యు కె ఎస్) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించించారు. ఈ సమావేశంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం డివిజన్ సహాయ కార్యదర్శి బి నారాయణ, కోశాధికారి తాయప్ప, సభ్యులు మల్లేష్, కనకప్ప, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

# అర్బన్ డెవలప్మెంట్ కమిటీ వైస్ చైర్మన్‌గా సిద్ధం శెట్టి శ్రీకాంత్



**ఖమ్మం, ప్రతినిధి, జూన్ 24 (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అర్బన్ డెవలప్మెంట్ వైస్ చైర్మన్ సిద్ధంశెట్టి శ్రీకాంత్ శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు, మహాత్మా గాంధీ ఫౌండేషన్, పౌరసమితి వ్యవస్థాపక అధ్యక్షులు, పులిపాటి విద్యాసంస్థల అధినేత డాక్టర్ పులిపాటి ప్రసాద్ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను పొందారు. తెలంగాణ రాష్ట్రంలో పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న ఆర్యవైశ్యుల స్థితిగతులను వారి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకొని వారి అభివృద్ధికి కృషి చేసే విధంగా నియామకపు ఉత్తర్వుల్లో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ పొందుపరిచారు. ఈ సందర్భంగా సిద్ధం శెట్టి శ్రీకాంత్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను త్రికరణ శుద్ధిగా నిర్వహిస్తానని తెలిపారు. జిల్లా అధ్యక్షులు పసుమర్తి సీతారామచంద్రరావు, వనమా సూరి, వనమా విశ్వేశ్వరరావు, కొంకిమళ్ళ మృత్యుంజయ, గుప్తా, ఖమ్మం మూడవ నగర అభివృద్ధి సాధన సమితి అధ్యక్షులు వెలంపల్లి వెంకట సుబ్బారావు, చేడే జనార్ధన్, కోదు మూరు భద్రయ్య, గుమ్మడవెల్లి శ్రీనివాస్, గొల్ల రాధాకృష్ణ, కోదుమూరి జగన్నాథం, మాశెట్టి వరప్రసాద్ తదితరులు శ్రీకాంత్ కు అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు.

# జర్నలిస్ట్ గండమల్ల ఉపేందర్ అకాల మృతి

## - కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు - పాడే మోసిన ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీనివాసరావు



**ఖమ్మం, ప్రతినిధి, జూన్ 24 (ది క్రైమ్ న్యూస్):** మండల జర్నలిజం రంగంలో తనదైన ముద్ర వేసిన సీనియర్ పాత్రికేయుడు, టీయూడబ్ల్యూజే (ఐజేయు) తిరుమలాయపాలెం మండల ప్రెస్ క్లబ్ సభ్యుడు గండమల్ల ఉపేందర్ ఇక లేరనే వార్త స్థానిక పాత్రికేయ లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి కన్నుమూశారు. ఆయన మరణంతో గండమల్ల ఉపేందర్ కుటుంబంలో ఒక విషాద ఛాయలు అలముకున్నాయి. కన్నీటి వీడ్కోలు పలికిన తోటి జర్నలిస్టులు: ఉపేందర్ మరణవార్త తెలియగానే టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కమిటీ సభ్యులు, మండల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. శుక్రవారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, కన్నీటి నివాళులర్పించారు. ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కూరపాటి విజయకుమార్, గోవింద సురేష్, ప్రచార కార్యదర్శి గుజ్జ రామకృష్ణతో పాటు పాత్రికేయ మిత్రులు ఎలిమల్ల శ్రీనివాస్, కామల్ల వీరయ్య, మేకల నాగరాజు గోవింద సురేష్ ఉబ్బని సుందర్ కొండా ఉపేందర్, ఎడవల్లి నాగరాజు, కూరపాటి ఉపేందర్, మెట్టు రుద్రరాజు ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ సుబ్లేడు మాజీ సర్పంచ్ మందడి ఇజ్రాయిల్ టిఆర్ఎస్ మండల నాయకులు సందు రాజు ఐసయ్య తదితరులు ఉపేందర్ పార్థివదేహంపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఆయనతో గడిపిన క్షణాలను, వృత్తిపరంగా ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ తోటి జర్నలిస్టులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎల్లప్పుడూ నవ్వుతూ, అందరితో స్నేహపూర్వకంగా ఉండే ఉపేందర్ అంత చిన్న వయసులోనే దూరమవ్వడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. అనాథలైన భార్యాపిల్లలు: ఉపేందర్ మృతితో ఆయన కుటుంబం ఒక్కసారిగా రోడ్డున పడింది. ఆయనకు భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న తండ్రి ఇక లేడనే విషయాన్ని తెలుసుకుని ఆ పిల్లలు ఏడుస్తున్న తీరు, భర్త భౌతికకాయంపై పడి భార్య రోదిస్తున్న దృశ్యాలు అక్కడ ఉన్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించాయి. ఉపేందర్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి ఈ పుట్టెడు దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ మండల పాత్రికేయ లోకం తమ సెంటిమెంట్‌ను చాటుకుంది.

# మొహరం పండుగ సందర్భంగా మెగా అన్నదానం

## హిందూ ముస్లింలకు అతీతంగా వేడుకలు





**ఖమ్మం, ప్రతినిధి, జూన్ 24(ది క్రైమ్ న్యూస్):** శుక్రవారం మొహరం పండగా సందర్భంగా శుక్రవారం పేట సెంటర్ నందు శుక్రవారి పేట్ యూత్ ఆధ్వర్యంలో మెగా అన్నదానం నిర్వహించారు. నిర్వాహకులు వాజిద్ (చంటి) మాట్లాడుతూ మొహరం అంటే మా ఇస్లామిక్ పద్ధతిలో నూతన సంవత్సరము అని గత కొన్ని సంవత్సరాలుగా మా తాతలు మా నాన్నల కాలం నుండి మొహరం పండగ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని అదే విధంగా శుక్రవారం కూడా సుమారు 2వేల నుండి 3వేల వరకు పాల్గొన్నారని హిందూ ముస్లిమ్స్ కి అతీతంగా అన్నదానం నిర్వహించామని హిందూ ముస్లిం అంతా కలిసి ఈ కార్యక్రమం పాల్గొంటారని ఇక్కడికి వచ్చే వారందరి కూడా ఆ అల్లా దయ ఉండాలని మొహరం పండుగ రోజు పీర్ల ఊరేగింపు కూడా మంచిగా జరగాలని ఈ కార్యక్రమానికి సహకరించిన నా మిత్రులందరికీ కుడా కృతజ్ఞతలుఎ తెలుపుతున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు సాజిత్, మున్నా ఆవేజ్, ఆవే సలీం, నాగోల్ తదితరులు పాల్గొన్నారు.

# మొహర్రం వేడుకల్లో పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హైదర్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన మొహర్రం వేడుకల్లో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి సాంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ మొహర్రం ఇస్లామిక్ క్యాలెండర్‌లో తొలి పవిత్ర మాసమని, ముస్లింల నూతన సంవత్సరానికి నాంది పలికే నెలగా దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. ఇది కేవలం పండుగ మాత్రమే కాదని, మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సైన్, ఆయన కుటుంబ సభ్యులు కర్బలా యుద్ధంలో చేసిన త్యాగాలను స్మరించుకునే పవిత్ర సందర్భంగా మొహర్రంను జరుపుకుంటారని తెలిపారు. మొహర్రంను "పీర్ల పండుగ"గా కూడా పిలుస్తారని, కర్బలా అమరవీరుల త్యాగాలకు ప్రతీకగా పీర్లను అలంకరించి భక్తిశ్రద్ధలతో ఊరేగింపులు నిర్వహించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. మొహర్రం నెలలో పదవ రోజైన ఆషూరా అత్యంత పవిత్రమైన రోజుగా భావిస్తారని, ముఖ్యంగా షియా ముస్లింలు ఈ రోజున సంతాప ఊరేగింపులు నిర్వహిస్తూ ఇమామ్ హుస్సైన్ త్యాగాన్ని స్మరించుకుంటారని వివరించారు. అన్ని మతాలు శాంతి, సోదరభావం, మానవత్వాన్ని బోధిస్తాయని, మొహర్రం కూడా త్యాగం,



ధర్మం, న్యాయం కోసం పోరాటానికి ప్రతీకగా నిలుస్తుందని ఆరెకపూడి గాంధీ అన్నారు. సమాజంలో మత సామరస్యం, పరస్పర గౌరవం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, పోతుల రాజేందర్, చాట్ల రవి, రాజిరెడ్డి, షరీఫ్, యాసిన్, నిఖిల్, హమీద్, ఫసి, ముస్లిం మత పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# "గో టు విలేజ్ - మాదిగ పల్లెలకు తరలండి" కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి మంద రాజు మాదిగ
- మానకొండూరు మండలం జంగాల కాలనీలో ఎమ్మార్పీఎస్ గద్దె నిర్మాణానికి భూమిపూజ
- జూలై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**కరీంనగర్ టౌన్, జూన్ 26, (ది క్రైమ్ న్యూస్):** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చిన 40 రోజుల కార్యచరణలో భాగంగా "గో టు విలేజ్ - మాదిగ పల్లెలకు తరలండి" కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి మంద రాజు మాదిగ పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం జంగాల కాలనీలో, మండల ఇంచార్జి దండు వరలక్ష్మి మాదిగ ఆధ్వర్యంలో బుడగ జంగాల కాలనీలో ఎమ్మార్పీఎస్ గద్దె నిర్మాణానికి ముగ్గు వేసి భూమిపూజ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంద రాజు మాదిగ మాట్లాడుతూ, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాతే ఎస్సీల వర్గీకరణను సాధించుకున్నామని గుర్తుచేశారు. ఈ వర్గీకరణ ఫలాలను జాతి బిడ్డలు అందిపుచ్చుకునేలా వారిని చైతన్యం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మే 25 నుండి జూలై 05 వరకు జరిగే ఈ "గో టు విలేజ్" కార్యక్రమంలో భాగంగా ప్రతి ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పి, అనుబంధ సంఘాల నాయకులు మాదిగ పల్లెల్లోకి వెళ్లి యువతను విద్యా, సంస్థగత నిర్మాణంపై చైతన్యపరచాలని కోరారు. అన్ని మండలాల్లోని గ్రామాలలో నూతన కమిటీలను నిర్మించాలని, ఎక్కడైతే గద్దెల నిర్మాణం జరగలేదో అక్కడ కొత్తగా గద్దెలను నిర్మించాలని ఆదేశించారు. జూలై 7వ తేదీతో ఎమ్మార్పీఎస్ 32వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా, ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు జరిపి, ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగలా ఘనంగా నిర్వహించాలని మంద రాజు మాదిగ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ముఖ్య నాయకులు, స్థానిక మాదిగయువకులు,



విద్యార్థులు, టెన్త్, ఇంటర్, సిరిగిరి లావణ్య, నూనె ఐశ్వర్య, నూనె సుమలత, కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్కపల్లి పౌలు మాదిగ, మానకొండూరు మండలం తప్పట్ల సంపత్ మాదిగ, నూనె మల్లయ్య పెద్దమనిషి జంగాలు, పానేటి రమేష్, నూనె కొమరయ్య, శ్రీహరి రాజయ్య, రామంచి చందు, హస్తం రమేష్, నూనె సంపత్, ముహూర్తం సారయ్య, మోతే శేఖర్, నూనె పోసావా, గురిగిరా మైసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మయూరి నగర్‌లో కాలనీవాసులతో పాదయాత్ర చేసిన మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించేందుకు తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కాలనీవాసులతో కలిసి శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాళాలు, డ్రైనేజీ, రోడ్లు, మంచినీటి సమస్యలను స్వయంగా పరిశీలించినట్లు తెలిపారు. అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకే ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సహకారంతో డివిజన్‌లో మంజూరైన అభివృద్ధి పనులను విడతల వారీగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మయూరి నగర్ కాలనీ అధ్యక్షుడు కె. రామరాజు, ఉపాధ్యక్షుడు హరికృష్ణ, జనరల్ సెక్రటరీ కిషోర్, అసోసియేషన్ సభ్యులు గోపాల్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రమణ రెడ్డి, వేణు, విజయ్ మోహన్, ప్రేమానందం, శ్రీధర్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్-167 రోడ్డుపై గుంతల పూడ్చివేత.. ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి ఆదేశాలతో చర్యలు




**నల్గొండ, ప్రతినిధి, జూన్ 26 (ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌హెచ్-167 రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గుంతల కారణంగా ఇప్పటికే పలువురు ప్రమాదాలకు గురై గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ సమస్యను నాగార్జునసాగర్ ఎమ్మెల్యే శ్రీ కుందూరు జయవీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే నేషనల్ హైవే-167 అధికారులతో మాట్లాడి రోడ్డుపై ఉన్న గుంతలను తక్షణమే పూడ్చివేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేసే పనులను చేపట్టించారు. దీంతో స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ, సమస్యపై వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి మరియు సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ వెంకటేశ్వరస్వామి జ్యేష్ఠాభిషేకంలో పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులో ఉన్న సెవెన్ హిల్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం 1008 కలశాలతో నిర్వహించిన సహస్ర కలశాభిషేకం, శ్రీ వారి జ్యేష్ఠాభిషేక మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమానికి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ఈఓ సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ జ్యేష్ఠ మాసంలో శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామికి నిర్వహించే జ్యేష్ఠాభిషేకం అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమమని అన్నారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, చెరుకురసం, పండ్లరసాలతో పాటు సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి విశేష అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. ఈ మహోత్సవం ద్వారా ప్రజలందరిపై శ్రీ వెంకటేశ్వరస్వామి కృపాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ం

# మధుమేహ వ్యాధిగ్రస్తులు కుంకుమ పువ్వు తీసుకుంటే.. కేవలం 8 వారాలలో ఈ మార్పు చూడోచ్చు!



ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మసాలా దినుసు ఏదంటే టక్కున గుర్తొచ్చేది కుంకుమపువ్వు. ఈ పువ్వు ఉత్పత్తికి సాగు చేసే విధానం కారణంగా, కుంకుమపువ్వు ధర అత్యధికంగా ఉంటుంది. నిజానికి.. ఇతర మసాలా దినుసుల కంటే కుంకుమపువ్వు వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు చాలా ఎక్కువ. అవేంటో తెలుసుకుందాం.. కొన్నిసార్లు కోపం రావడం, కొన్నిసార్లు ఏడవడం.. ఇలాంటి మానసిక కల్లోలం తరచుగా రావడం అస్సలు మంచిది కాదు. ఈ పరిస్థితిలో కుంకుమపువ్వు సహాయం తీసుకోవచ్చు. కుంకుమపువ్వు మనస్సును ఆరోగ్యంగా ఉంచుతుందని, డిప్రెషన్ లక్షణాలను తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆందోళనను తగ్గించడంలోనూ కుంకుమ పువ్వు సహాయపడుతుంది. కుంకుమపువ్వులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి హానికరమైన ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. కుంకుమపువ్వు తినడం వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి ఆహారంలో కుంకుమపువ్వును తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా కుంకుమపువ్వు మహిళల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రీ-మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్ సమస్యకు కుంకుమపువ్వు మేలు చేస్తుంది. అంటే రుతుక్రమం రాకముందే కలిగే మానసిక, శారీరక ఆనారోగ్యాన్ని కుంకుమపువ్వు దూరం చేస్తుంది. కాలు నొప్పి, మూడ్ స్వింగ్స్ వంటి లక్షణాలను నియంత్రిస్తుంది. రోజూ కుంకుమపువ్వు కలిపిన టీ లేదా పాలు తాగడం వల్ల బరువు కూడా తగ్గవచ్చు. కుంకుమపువ్వు ఆకలిని అణిచివేసి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా ఈ మసాలాలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఊబకాయాన్ని నివారిస్తాయి. జీవక్రియ రుగ్మతలను తొలగిస్తాయి. కుంకుమపువ్వు గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. కుంకుమపువ్వులోని యాంటీఆక్సిడెంట్ కంటెంట్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. గుండె సమస్యలను నివారించడానికి ఆహారంలో కుంకుమపువ్వు తీసుకోవచ్చు. రోజువారీ ఆహారంలో కొద్దిగా కుంకుమపువ్వు తీసుకుంటే మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా మంచిది. కుంకుమపువ్వు కేవలం 8 వారాలలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తుంది. కుంకుమపువ్వు టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.

# విద్యార్థులను అభినందించిన మంత్రి అడ్లూరి



**ధర్మపురి, జూన్ 26, (ది క్రైమ్ న్యూస్):** అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల విద్యార్థులను రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అభినందించారు. మే 29నుండి 31వరకు నేపాల్ దేశం కాట్మాండ్ లో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్స్ షిప్ పోటీలల్లో పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన రూషగాని వినూత్న అండర్ 9-10 బాలికల స్పారింగ్ విభాగంలో ప్రథమ స్థానం నిలువగా అండర్ 14-15 బాలికల స్పారింగ్ విభాగంలో వి నిహారిక ప్రథమ స్థానంలో నిలవగా దాసరి ధనస్విని 9-10 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. ఓదెల గ్రామానికి చెందిన లాగిశెట్టి శరణ్య 16-17 బాలికల స్పారింగ్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి బ్రౌంజ్ మెడల్ సాధించగా అండర్ 17-18 బాలికల స్పారింగ్ విభాగంలో ఎంబడి చందన తృతీయ స్థానం స్థానం బ్రౌంజ్ సాధించారు. కరాటే మాస్టర్ కాలువల రమేష్ ఆధ్వర్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను కలువగా వీరిని మంత్రి లక్ష్మణ్ కుమార్ అభినందించారు.

# పెద్దమ్మ దేవాలయంలో మినీ హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ టౌన్, జూన్ 26(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 12వ డివిజన్ రామచంద్రాపూర్ కాలనీలోని పెద్దమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన మినీ హైమాస్ట్ లైట్లను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని అన్ని డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. దేవాలయాలు, కాలనీలు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో మెరుగైన వెలుతురు ఉండేలా మినీ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ లైట్ల ఏర్పాటు ద్వారా రాత్రి వేళల్లో భక్తులు, స్థానిక ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణంతో పాటు భద్రత కూడా మెరుగుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, 12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘం పెద్దలు, స్థానిక నాయకులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# కంప్యూటర్ ఆపరేటర్లను కొనసాగించాలి

## మంత్రి అడ్లూరికి వినతి పత్రం అందజేసిన ఆపరేటర్లు



**ధర్మపురి, జూన్ 26, (ది క్రైమ్ న్యూస్):** రెవెన్యూ శాఖలో గత 20 సం.ల నుండి పని చేస్తున్న 632 టైపిస్ట్ మరియు కంప్యూటర్ ఆపరేటర్లను యాధావిధిగా కొనసాగించాలని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను కలిసి శుక్రవారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. టైపిస్ట్ మరియు కంప్యూటర్ ఆపరేటర్లను డిస్కాంటినేషన్ చేయమని ప్రభుత్వం మెమో జారీ చేయాలని వారు మంత్రికి వివరించారు. మెమో రద్దు చేసి ఆపరేటర్లను యాధావిధిగా కొనసాగించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, రెవెన్యూ శాఖ మంత్రి తో మాట్లాడి టైపిస్ట్ మరియు కంప్యూటర్ ఆపరేటర్ సేవలను వినియోగించుకునే విధంగా సహకరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో స్టేట్ యూనియన్ జనరల్ సెక్రటరీ యం. భూమేష్, జగిత్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, దేవాల గోపి, రాపర్తి రాజేందర్, నరేష్, మహేందర్, అర్జున్, వినోద్, సల్మాన్, రాజేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా రాపాక ప్రవీణ్ నియామకం

## ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



**కరీంనగర్ టౌన్, జూన్ 26(ది క్రైమ్ న్యూస్):** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కరీంనగర్ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా రాపాక ప్రవీణ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అధికారిక నియామక ఉత్తర్వులను జారీ చేశారు. రాపాక ప్రవీణ్ గతంతో మానకొండూర్ మండల అధ్యక్షునీగా పనిచేశారు. ప్రస్తుతం లక్ష్మీపూర్ ఉప సర్పంచ్ గా, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ అడ్వైజరీ ప్యానెల్ మెంబర్ హోదాలో కొనసాగుతున్నారు. ఎస్సీ వర్గాల సమస్యలకోసం, జిల్లాలో ఎస్సీ మోర్చా విభాగం మరింత బలోపేతం చేయడానికి, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేస్తానని రాపాక ప్రవీణ్ ఈ సందర్భంగా తెలిపారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, జిల్లాలో ఎస్సీ మోర్చాను అత్యంత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని, తన నియామనకానికి సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు చెప్పారు.

# వారానికో బాతు గుడ్డు తినండి..!

## ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదులుకోరు



బాతు గుడ్లు వివిధ ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. కోడి గుడ్లకు రుచికరమైన, పోషకమైన ప్రత్యామ్నాయం బాతుగుడ్లు. వాటిలో ప్రోటీన్, విటమిన్లు, విటమిన్ బి12, విటమిన్ డి, ఐరన్, సెలీనియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. అదనంగా బాతు గుడ్లు, కోడి గుడ్ల కంటే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాల సాంద్రతను కలిగి ఉంటాయి. ఇవి గుండె, మెదడుకు మేలు చేస్తాయి. బాతు గుడ్లు కొంతమందికి సులభంగా జీర్ణమవుతాయి. మీ ఆహారంలో బాతు గుడ్లను చేర్చుకోవడం వల్ల మీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. వారానికి ఒకసారి బాతు గుడ్లు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ఇక్కడ తెలుసుకుందాం.. కోడి గుడ్ల కంటే రెట్టింపు ప్రయోజనం బాతు గుడ్లు వల్ల



కలుగుతుంది. బాతు గుడ్లలో ప్రొటీన్లు, విటమిన్లు, విటమిన్ బి12, విటమిన్ డి, ఐరన్, సెలీనియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. అంతే కాదు ఇందులో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా చాలా ఎక్కువ. మన గుండె, మెదడు, జ్ఞాపకశక్తికి ఈ ప్రయోజనాలన్నీ చాలా మంచివి. బాతు గుడ్లు అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేస్తాయి. ఇది బరువు నిర్వహణ, కండరాల పెరుగుదల, వ్యాయామం తర్వాత కోలుకోవడానికి సహాయపడుతుంది. బాతు గుడ్లు చాలా తేలికగా జీర్ణమవుతాయి. కోడి గుడ్ల కంటే బాతు గుడ్లు చాలా ప్రయోజనాలను కలిగి ఉన్నాయని, పరిమాణం పరంగా మరింత మెరుగ్గా ఉంటాయి. ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదు. వారానికి ఒకసారి బాతు గుడ్డు మీ ఆహారంలో చేర్చుకోవడం మంచిది. యాంటీఆక్సిడెంట్ లక్షణాలు.. బాతు గుడ్లలో యాంటీఆక్సిడెంట్ చర్యలో గణనీయమైన పెరుగుదల గమనించబడింది. బాతు గుడ్లలో ఉండే కెరోటినాయిడ్స్, అమినో యాసిడ్స్ యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. క్యాన్సర్ నివారణకు బాతు గుడ్లను ముఖ్యమైన ఆహారంగా తీసుకోవచ్చు. కోడి గుడ్ల కంటే డీసాల్టెడ్ బాతు గుడ్డులోని తెల్లసొన మంచి కాల్షియం శోషణను కలిగి ఉంటుంది. బరువు నియంత్రణతో పాటు, బాతు గుడ్లు కండరాల ఆరోగ్యానికి, బలానికి సహాయపడతాయి. వ్యాయామం తర్వాత వారానికి ఒకసారి బాతు గుడ్లు తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. బాతు గుడ్లు కండరాల బలాన్ని పెంచుతుంది. కండరాల నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి.

## ఎండు ద్రాక్ష నీరు ఇలా తాగారంటే.. కేవలం 10 రోజుల్లోనే ఆ సమస్యలన్నీ పరార్..!



ప్రస్తుత కాలంలో ఎంతో మంది ఎదుర్కొంటున్న సమస్యల్లో అధిక బరువు కూడా ఒకటి. అధిక బరువు కారణంగా చాలా మంది అనేక అనారోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. వెయిట్ లాస్ అయ్యేందుకు ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యాయామం, వాకింగ్, హెల్దీ డైట్, జిమ్ ఇలా చాలానే ట్రై చేస్తున్నారు. అయితే కొన్ని రకాల సింపుల్ చిట్కాలతో కూడా వెయిట్ లాస్ అవ్వొచ్చని నిపుణులు చెబుతున్నారు. వెయిట్ లాస్ అయ్యేందుకు ఎండు ద్రాక్ష వాటర్ ఎంతగానో సహకరిస్తుంది. ప్రతిరోజూ ఎండు ద్రాక్ష నీరు తాగుతూ, మంచి డైట్ మెయిన్ టైన్ చేస్తూ.. వ్యాయామం చేస్తే మీకు కేవలం 10 రోజుల్లోనే రిజల్ట్ కనిపిస్తుంది. ఇలాంటి వాటర్ తాగడం వల్ల మీ బాడీ కూడా ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంటుంది. మరి ఇంకా ఎండు ద్రాక్ష నీటిని తీసుకుంటే ఎలాంటి లాభాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం. బాడీని డిటాక్సిఫికేషన్ చేస్తుంది: ఎండుద్రాక్ష నీటిని తాగడం వల్ల శరీరం డీటాక్సిఫై అవుతుంది. రోజు వారీ జీవితంలో మనకు తెలియకుండానే కాలుష్యం, తినే ఆహారం ఇలా రకరకాల కారణాల వల్ల శరీరంలో మలినాలు అనేవి చేరతాయి. కాబట్టి ఎండు ద్రాక్ష నీటిని తాగడం వల్ల శరీరంలో ఉండే మలినాలు బయటకు పోతాయి. శరీరం ఫ్రీ రాడికల్స్‌తో పోరాడే శక్తి కూడా లభిస్తుంది. నిద్ర లేమి సమస్యలను దూరం చేస్తుంది: బరువు పెరిగేందుకు నిద్ర లేమి సమస్యలు కూడా ఒక కారణంగా ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సరైన నిద్ర లేకపోతే.. తిన్నది అరగక.. పొట్టలో కొవ్వు అనేది నిల్వ ఉండిపోతుంది. అంతే కాకుండా గ్యాస్ అసిడిటీ సమస్యలు కూడా వస్తాయి. కాబట్టి మీరు ఎండు ద్రాక్ష నీటిని తాగితే నిద్ర లేమి సమస్యల్ని దూరం చేస్తుంది. ఎలక్ట్రోలైట్ సమతుల్యత: ఎండు ద్రాక్ష నీటిలో పొటాషియం, మెగ్నీషియం వంటివి లభ్యమవుతాయి. ఇవి శరీరంలోని ద్రవాల స్థాయిల్ని కంట్రోల్‌లో ఉంచుతుంది. చెమట వల్ల కోల్పోయిన శక్తి ఈ నీళ్ల వల్ల తిరిగి వస్తుంది. నాడీ వ్యవస్థ పనితీరు, కండరాల తీరును సరి చేస్తుంది. గట్ హెల్త్: ఎండు ద్రాక్ష నీరు తాగడం వల్ల గట్ హెల్త్ కూడా మెరుగు పడుతుంది. శరీరంలో నుంచి మలినాలన్నీ బయటకు పంపుతుంది. ఎండు ద్రాక్షలో ఉండే ఫైబర్ జీర్ణ శక్తిని, మలబద్ధకం వంటి సమస్యలు రాకుండా చేస్తుంది. వెయిట్ లాస్: ఎండు ద్రాక్ష నీరు తాగడం వల్ల తక్కువ రోజుల్లోనే బరువు తగ్గుతారు. ఎండు ద్రాక్ష నీటిలో ఫైబర్ కంటెంట్ మెండుగా ఉంటుంది. కాబట్టి ఈ నీటిని తీసుకుంటే కడుపు నిండిన భావన కలుగుతుంది. గోరు వెచ్చటి నీటిలో 3 లేదా 4 ఎండు ద్రాక్షను వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం లేవగానే ఆ నీటిని తాగి ఎండుద్రాక్ష తినాలి.

## క్యాన్సర్ భూతాన్ని పారదోలే అద్భుత ఫలం.. ఎక్కడ కనిపించినా వదిలిపెట్టకండీ!

ఆప్రికాట్ పండు చాలా రుచికరమైన పండు. యాంటీఆక్సిడెంట్లతో నిండిన ఈ పండులో పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలకంగా వ్యవహరిస్తుంది. వీటిని రోజు వారీ ఆహారంలో క్రమం తప్పకుండా తింటే ఎన్నో ప్రయోజనాలు పొందుతారు. ఆప్రికాట్ పండును సూపర్ ఫుడ్ అని కూడా అంటారు. ఇందులో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. అయితే పోషకాలు మాత్రం పుష్కలంగా ఉంటాయి. ఆప్రికాట్ పండ్లలో బీటా కెరోటిన్, లుటిన్, పొటాషియం, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, జియాక్సంతిన్ అధికంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఆప్రికాట్ పండ్లు కళ్లకు కూడా చాలా మేలు చేస్తాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులో బీటా కెరోటిన్, విటమిన్ ఎ, జియాక్సంతిన్ ఉంటాయి. ఈ మూడు పదార్థాలు కళ్లకు ఎంతో మేలు చేస్తాయి. ఆప్రికాట్‌పండ్లు కంటిశుక్లం, రేచీకటి ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఆప్రికాట్ పండ్లలో వివిధ రకాల ఫైబర్ ఉంటుంది. కాబట్టి ఈ పండు తింటే జీర్ణం సులువుగా కడుపు క్లీన్ చేస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఈ పండు ఎంతగానో ఉపయోగపడుతుంది. బీటా-కెరోటిన్, లుటిన్, జియాక్సంతిన్, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, యాంటీఆక్సిడెంట్లు వంటి పదార్థాలు శరీరంలోని యాంటీ-క్యాన్సర్ ఏజెంట్లుగా పనిచేస్తాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుండి కణాలను రక్షిస్తాయి. ఆప్రికాట్ పండ్లు శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతాయి. ఆప్రికాట్ పండ్లలో అధికంగా పొటాషియం ఉంటుంది. కాబట్టి ఇది రక్తపోటును పెంచదు. ఆప్రికాట్ కూడా కాలేయం దెబ్బతినకుండా కాపాడుతుంది. ఈ పండు కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆప్రికాట్ పండ్లు శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ తగ్గకుండా కాపాడుతాయి. అంటే మీరు ఎంత కష్టపడి పనిచేసినా శరీరం బలహీనపడకుండా ఉంటుంది.

## తమలపాకును నీళ్లలో మరిగించి తాగితే ఏమవుతుందో తెలుసా..? నమ్మలేని లాభాలు..





ఇందుకోసం ముందుగా పొయ్యి మీద ఒక పాత్ర పెట్టి, ఒక గ్లాసు నీళ్లు పోసి, ఒక తమలపాకును ముక్కలుగా కట్ చేసి అందులో వేయాలి. 5 నుంచి7 నిమిషాలు మరిగించి ఆ నీటిని వడకట్టి తాగాలి. మలబద్దకం సమస్య ఉన్నవారికి ఈ తమలపాకు నీరు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పేగు కదలికలు బాగా జరిగేలా చేస్తుంది. శరీరంలో వాపులను తగ్గిస్తుంది. తమలపాకులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉండటంవల్ల ఛాతీలో పేరుకుపోయిన కఫాన్ని తొలగిస్తుంది. అలాగే జలుబు, దగ్గు, గొంతు నొప్పి నుండి ఉపశమనం కలిగిస్తుంది. మధుమేహం నియంత్రణలో కూడా తమలపాకు నీరు తోడ్పడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచటమే కాకుండా, మధుమేహం కారణంగా వచ్చే సమస్యలను కూడా తగ్గిస్తుంది. చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను కూడా తమలపాకు నీరు నియంత్రిస్తుంది. తద్వారా గుండె ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. తమలపాకులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉండుటవల్ల ఆస్తమాను కూడా అదుపులో ఉంచుతుంది. అంతేగాక తమలపాకును మౌత్ ఫ్రెషనర్‌గా ఉపయోగిస్తున్నారు. ఇది నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. తమలపాకు నోటిలో బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధిస్తుంది. అయితే తమలపాకు నీటిని ఎప్పుపడితే అప్పుడు తాగడం కూడా మంచిదికాదు. రోజులో ఒకసారి మాత్రమే తీసుకోవాలి.


# వయసు పెరిగినా యవ్వనంగా కనిపించాలంటే.. ఈ పండ్లు తినండి! ఏంజెల్స్‌లా మెరిసిపోతారు

ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ యవ్వనంగా, అందంగా కనిపించాలని కోరుకుంటారు. దీని కోసం అనేక రకాల చికిత్సలు కూడా తీసుకుంటూ ఉంటారు. బ్యూటీ పార్లర్లలలో రకరకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులను వినియోగిస్తుంటారు. కానీ ప్రతీసారి ఆశించిన ఫలితాలు అందకపోవచ్చు. నిజానికి, చర్మం యవ్వనంగా కనిపించాలంటే కొన్ని ఆహారాలను డైట్‌లో చేర్చుకోవాలి. అలాగే చెడు జీవనశైలి కారణంగా కూడా చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. ఏది ఏమైనప్పటికీ, వేసవి కాలంలో సూర్యుని కిరణాల కారణంగా చర్మం దెబ్బతింటుంది. అటువంటి పరిస్థితిలో చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఆహారపు అలవాట్లు సరిగా లేకపోవడం వల్ల అతి చిన్న వయసులోనే వృద్ధాప్య సంకేతాలు కనిపిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖంపై, ముడతలు, మచ్చలు కనిపించడం ప్రారంభిస్తాయి. చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే ఏయే ఆహారాలు తీసుకోవాలో ఇక్కడ తెలుసుకుందాం.. బెర్రీ పండ్లు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు బెర్రీలలో పుష్కలంగా లభిస్తాయి. స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీస్, బ్లాక్బెర్రీస్ తినడం వల్ల చర్మం యవ్వనంగా ఉంటుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మంలో వేగవంతమైన మార్పులను నెమ్మదించేలా చేస్తాయి. దీనితో పాటు బెర్రీలు ఆక్సీకరణ ఒత్తిడిని తొలగించడంలో కూడా సహాయపడతాయి. డ్రై ఫ్రూట్స్ బాదం, వాల్‌నట్, జీడిపప్పు, వాల్‌నట్, గుమ్మడికాయ గింజలు వంటి డ్రై ఫ్రూట్స్ చర్మానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. చర్మానికి మేలు చేసే డ్రై ఫ్రూట్స్ రోజూ తినడం వల్ల ఇందులో ఉండే విటమిన్-ఇ, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు పుష్కలంగా చర్మానికి అందుతాయి. కొవ్వు చేప నాన్ వెజ్ ఫుడ్ ఇష్టపడే వారు చర్మాన్ని కాపాడుకోవడానికి ఫ్యాటీ ఫిష్ ను తమ డైట్‌లో చేర్చుకోవచ్చు. చర్మంపై కనిపించే వృద్ధాప్య సంకేతాలను నివారించడంలో ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కొవ్వు



చేపలలో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో సహాయపడతాయి. వీటితోపాటు గ్రీన్ టీ ద్వారా కూడా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. గ్రీన్ టీని రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల చర్మ కణాలు ఆరోగ్యంగా ఉంటాయి.

# అధిక రక్తపోటు ఎంత ప్రమాదమో తెలుసా? నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం తప్పదంటున్న నిపుణులు



హైపర్ టెన్షన్ కూడా ఓ విధమైన సైలెంట్ కిల్లర్. అధిక రక్తపోటు ప్రాణాలను నెమ్మదిగా హరిస్తుంది. మీకూ అధిక రక్తపోటు సమస్య ఉంటే ప్రతిరోజూ తప్పకుండా మెడిసిన్ తీసుకోవాలి. అధిక రక్తపోటు వల్ల గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యలు వస్తాయి. అసలు అధిక రక్తపోటు ఎందుకు దాడి చేస్తుంది? ఈ సమస్యను ఎలా నియంత్రించవచ్చు వంటి వివరాలు నిపుణుల మాటల్లో తెలుసుకుందాం. బిర్లా హార్ట్ హాస్పిటల్‌లోని కార్డియాలజీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సబ్యసాచి పాల్ మాట్లాడుతూ.. రక్తపోటు వెనుక అనేక జీవనశైలి కారకాలను వివరించారు. వీటిలో వ్యాయామం నుంచి ఊబకాయం, ధూమపానం వరకు అనేక కారకాలు ఉన్నాయి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుందని డాక్టర్ సబ్యసాచి పాల్ అంటున్నారు. కానీ రోజువారీ ఏరోబిక్ వ్యాయామం రక్తపోటును పెంచుతుంది. ముఖ్యంగా రక్తపోటు అదుపులో లేని వారు, శరీర బరువు పెరిగినవారికి, ఊబకాయంతో బాధపడుతున్నవారికి గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. ఊబకాయం కారణంగా అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా తరచుగా సంభవిస్తుంది. ఇది రక్తపోటు ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. ప్రిజర్వేటివ్స్, చక్కెర, ఉప్పుతో కూడిన ప్రాసెస్ చేసిన ఆహారాలు రక్తపోటుకు కారణమని డాక్టర్ సబ్యసాచి పాల్ చెబుతున్నారు. ఇందులో అధిక మొత్తంలో కేలరీలు, సోడియం ఉంటుంది. ఇవి అధిక రక్తపోటుతో పాటు కిడ్నీ సమస్యలు, మధుమేహం ప్రమాదాన్ని పెంచుతాయి. అధిక రక్తపోటు ప్రమాదాన్ని నివారించడానికి ఫాస్ట్ ఫుడ్ మానుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. రక్తపోటు ప్రమాదాన్ని నివారించడానికి, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని డాక్టర్ పాల్ సూచిస్తున్నారు. జీవనశైలి కారకాలు మాత్రమేకాకుండా, రక్తపోటుకు మరొక కారకం కూడా ఉంది. అధిక రక్తపోటుకు ఒత్తిడి కూడా కారణం. ఒత్తిడిని తగ్గించుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. మీరు హైపర్‌టెన్షన్ రోగి అయితే, ప్రతిరోజూ తప్పనిసరిగా మందులు వాడాల్సి ఉంటుంది. బిఎమ్ బిర్లా హార్ట్ హాస్పిటల్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ అంజన్ సియోటియా ఈ విషయాన్ని సూచిస్తున్నారు. చాలా మంది హైపర్ టెన్షన్ కు చికిత్స తీసుకోరని డాక్టర్ అంజన్ అంటున్నారు. సగం కంటే ఎక్కువ మందికి తమకు అధిక రక్తపోటు ఉందనే విషయమే తెలియదు. ఎందుకంటే వారు ఎప్పుడూ రక్తపోటును క్రమం తప్పకుండా టెస్ట్ చేయించుకోరు. అలాగే దీనిపై అవగాహన ఉన్న రోగులలో కూడా సగం మంది రోగులు రోజూ మందులు తీసుకోరు. ఈ కారణంగా మరణాల సంఖ్య పెరుగుతుంది. చికిత్స చేయకపోతే సమస్య మరింత తీవ్రతరం అవుతుంది. దీంతో పక్షవాతం, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి తరచుగా రక్తపోటు పరీక్షించుకోవాలి. అలాగే మందులు తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. ఇలాచేస్తే రక్తపోటును నియంత్రించడం సులభతరం అవుతుంది.

# స్పోర్ట్స్

# నా లైఫ్‌లో చూసిన అత్యుత్తమ బ్యాటర్ కోహ్లీ



## సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్

సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ ఒక ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. తన దృష్టిలో ప్రపంచపు అత్యుత్తమ టాప్ 3 బ్యాటర్లు ఎవరో వెల్లడించాడు. పైగా అందులో నంబర్ వన్ ప్లేస్‌లో మన టీమిండియా దిగ్గజ క్రికెటర్ ఉండటం విశేషం. ఇంతకీ డివిలియర్స్ ఎవర్ని అత్యుత్తమ బ్యాటర్లుగా పేర్కొన్నాడో ఇప్పుడు తెలుసుకుందాం.. భారత స్టార్ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ తన జీవితంలో చూసిన అత్యుత్తమ బ్యాటర్ అని ఏబీ డివిలియన్స్ అన్నాడు. ముఖ్యంగా ఒత్తిడితో కూడిన రన్ ఛేజ్‌లలో కోహ్లీ ప్రదర్శించే సంయమనం, టార్గెట్‌ని చేరుకునే స్కిల్, ఇన్నింగ్స్‌ను నియంత్రించే సామర్థ్యం అసాధారణమని కొనియాడాడు.ఒక ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో మాట్లాడుతూ.. "నా జీవితంలో నేను చూసిన అత్యుత్తమ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ. అతని తర్వాతే రికీ పాంటింగ్, కుమార సంగక్కర వంటి దిగ్గజాలు వస్తారు" అని డివిలియర్స్ పేర్కొన్నాడు. కోహ్లీ ఆటలో కనిపించే నిలకడ, ఫిట్‌నెస్, మానసిక దృఢత్వం అతడిని ప్రత్యేక ఆటగాడిగా నిలబెట్టాయని చెప్పాడు. వన్డే క్రికెట్‌లో ఛేజింగ్ విషయానికి వస్తే కోహ్లీకి సాటే లేదని డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు. భారీ లక్ష్యాలను ఛేదించే సమయంలోనూ ఒత్తిడిని అధిగమించి జట్టును విజయతీరాలకు చేర్చే సామర్థ్యం కోహ్లీని ప్రపంచంలోనే అత్యుత్తమ ఛేజ్ మాస్టర్‌గా నిలబెట్టిందని పేర్కొన్నాడు. అందుకే తాను చూసిన అత్యుత్తమ ఆటగాడిగా కోహ్లీని ఎంచుకుంటానని స్పష్టం చేశాడు. టీ20 క్రికెట్‌లోనూ కోహ్లీపై డివిలియర్స్ ప్రశంసలు తగ్గలేదు. ఆధునిక టీ20లో పవర్ హిట్టర్ల హవా కొనసాగుతున్నప్పటికీ, పరిస్థితులకు అనుగుణంగా ఇన్నింగ్స్‌ను నిర్మించడం, చివరి వరకు నిలబడి మ్యాచ్‌ను ముగించడం, అద్భుతమైన నిలకడను కొనసాగించడం వంటి లక్షణాల్లో కోహ్లీ నంబర్‌వన్ అని ఆయన పేర్కొన్నాడు. "నేను చూసిన వారిలో అతనే నంబర్ 1 బ్యాట్స్‌మన్" అంటూ మరోసారి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. కాగా ఐపీఎల్‌లో ఆర్సీబీ తరఫున ఎన్నో సంవత్సరాలు కలిసి ఆడిన కోహ్లీ, డివిలియర్స్ మధ్య మైదానంలోనే కాకుండా మైదానం వెలుపల కూడా మంచి స్నేహం ఏర్పడింది. ఇద్దరూ కలిసి ఎన్నో చిరస్మరణీయ భాగస్వామ్యాలు నమోదు చేసి జట్టుకు ఎన్నో విజయాలు అందించారు. పరస్పరం ఒకరిపై ఒకరు ఎన్నో సందర్భాల్లో ప్రశంసలు కురిపించారు.

# నల్గొండ నైట్స్ వరుసగా రెండో విజయం

టీజీ20 లీగ్?లో అనురాగ్ నల్గొండ నైట్స్? వరుసగా రెండో విజయం నమోదు చేసింది. తాజాగా వరంగల్ వారియర్స్?తో మ్యాచ్?లో నల్గొండ 91 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. నల్గొండ నిర్దేశించిన 260 పరుగుల భారీ ఛేదనలో వరంగల్ తేలిపోయింది. 14 ఓవర్లలో 168 రన్స్?కే ఆలౌట్ అయ్యింది. కెప్టెన్ పేరాల అమన్?రావు (46 పరుగులు, 15 బంతుల్లో), మురుగన్ అభిషేక్ (44 పరుగులు) మాత్రమే చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడారు. నల్గొండ బౌలర్లలో నిషాంత్, వరుణ్ గౌడ్ చెరో 3, అనికేత్ రెడ్డి 2, అర్ఫాజ్, దివేశ్ సింగ్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. భారీ ఛేదనలో మూడో ఓవర్లోనే రెండు వికెట్లు తీలసి వరంగల్?ను నల్గొండ కష్టాల్లోకి నెట్టింది. 2.3 ఓవర్ వద్ద హర్షిత్ చౌదరి (10) ఔట్ కాగా, ఆ తర్వాత బంతికే రిషికేత్ సిసోదియా (0)ను నిషాంత్ పెవిలియన్?కు పంపించాడు. ఆ తర్వాత కెప్టెన్ పేరాల అమన్?రావు (46 పరుగులు, 15 బంతుల్లో), మురుగన్ అభిషేక్ (31 పరుగులు) చెలరేగడంతో నాలుగు ఓవర్లకే వరంగల్ 70 రన్స్ చేసింది. దీంతో గాడిలో పడ్డట్లే అనిపించింది. కానీ ఐదో ఓవర్లో అమన్ రావు ఔటయ్యాడు. 6.6 ఓవర్ వద్ద భవేష్ సేత్ (22)ను దివేశ్ ఔట్ చేశాడు. కాసేపటికే 9.4 వద్ద మణి కిరణ్ (16) స్వల్ప స్కోర్?కే ఔటయ్యాడు. దీంతో 10 ఓవర్లలోపే వరంగల్ 5 కీలక వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత వికెట్ల పతనం కొనసాగింది. 11వ ఓవర్లో అభిషేక్ ఔట్ అవ్వడంతో వరంగల్ ఓటమి దాదాపు ఖాయమైంది. 13వ ఓవర్లో కులకర్ణి, మన్సూరి పెవిలియన్ చేరగా, 14వ ఓవర్లో రెండో బంతికి హుస్సేన్, ఆరో బంతికి క్రాంతి ఔటయ్యారు. దీంతో వరంగల్ ఇన్నింగ్స్ ముగిసింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన నల్గొండ నైట్స్? జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 259 పరుగులు చేసింది. గౌరవ్ రెడ్డి (80 పరుగులు), పాట్కూరి నితీశ్ రెడ్డి (84 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. చివర్లో అర్ఫాజ్ అహ్మద్ (33 పరుగులు, 14 బంతుల్లో), దివేశ్ సింగ్ (18 పరుగులు) మెరుపులు మెరిపించారు. దీంతో నల్గొండ స్కోర్ 250 పరుగులు దాటింది. వరంగల్ బౌలర్లలో మహ్మద్ మాలిక్ 2, ముదాసర్ హుస్సేన్, కులకర్ణి తలో 1 వికెట్ పడగొట్టారు. టాస్ ఓడి బ్యాటింగ్?కు దిగిన నల్గొండకు తొలి ఓవర్ ఐదో బంతికే షాక్ తగిలింది. ఓపెనర్ ప్రణవ్?ను మహ్మద్ మాలిక్ పెవిలియన్?కు చేర్చాడు. దీంతో 7రన్స్?కే 1 వికెట్ పడింది. అయితే వన్ డౌన్?లో వచ్చిన నితీశ్ రెడ్డితో కలిసి గౌరవ్ విధ్వంసం సృష్టించాడు. ఈ ఇద్దరూ పోటీపడి మరీ బౌండరీలు బాదేశారు. ఈ క్రమంలోనే అర్ధ శతకాలు పూర్తి చేశారు. రెండో వికెట్?కు ఈ జోడీ 65 బంతుల్లోనే 142 పరుగులు జోడించింది. 11.4 ఓవర్ వద్ద గౌరవ్?ను ముదాసిర్ ఔట్ చేయగా, 15.1 వద్ద నితీశ్ రనౌట్ అయ్యాడు. అలా ఇద్దరు సెట్ బ్యాటర్లు సెంచరీలు మిస్ చేసుకున్నారు. ఇక చివర్లో రాహుల్ (31 పరుగులు, 18 బంతుల్లో) అర్ఫాజ్ చెలరేగి ఆడారు. వీళ్ల విధ్వంసానికి దివేశ్ సింగ్ మెరుపులు తోడవ్వడంతో జట్టు స్కోర్ 250 పరుగులు దాటింది. కాగా, ఇప్పటిదాకా మూడు మ్యాచ్?లు ఆడిన నల్గొండకు ఇది రెండో విజయం. దీంతో పట్టిక (4 పాయింట్లు)లో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. మూడు మ్యాచ్?లు ఆడిన వరంగల్?కు ఇది రెండో ఓటమి. ఇక ఆడిన రెండు మ్యాచ్?ల్లోనూ విజయం సాధించిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ టీమ్ 4 పాయింట్లతో రెండో స్థానంలోఅన్నే పాయింట్లున్న రంగారెడ్డి మూడో ప్లేస్?లో ఉన్నాయి.




# అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో అదరగొట్టిన రిలయన్స్ ఫౌండేషన్ అథ్లెట్లు

టోర్నీ రెండో రోజున అద్భుతమైన ఫామ్‌ను ప్రదర్శించిన అథ్లెట్లు.. ఈ ఏడాది జపాన్ వేదికగా జరగబోయే 'ఆసియా క్రీడలు 2026' అర్హత ప్రమాణాలను విజయవంతంగా అధిగమించారు. మొత్తం ఆరుగురు అథ్లెట్లు ఆసియా గేమ్స్ బెర్త్‌లను ఖరారు చేసుకోవడం విశేషం. షార్ట్ డిస్టెన్స్ పరుగు పందెంలో రిలయన్స్ ఫౌండేషన్ అథ్లెట్లు మైదానాన్ని శాసించారు. స్టార్ అథ్లెట్ అనిమేష్ కుజూర్ అద్భుత వేగంతో దూసుకెళ్లి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. హరిత భద్ర తన అసాధారణ ప్రదర్శనతో ప్రథమ స్థానంలో నిలిచి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఇదే ఈవెంట్‌లో రైజింగ్ స్టార్ ఉన్నతి అయ్యప్ప కఠినమైన పోటీని ఎదుర్కొని రజత పతకాన్ని సాధించి హరితతో పాటు పోడియంపై నిలిచింది. మిడిల్ డిస్టెన్స్ రేస్‌లో సీనియర్ రన్నర్ మొహమ్మద్ అఫ్సల్ తన అనుభవాన్నంతా ఉపయోగించి రేసును పూర్తిగా శాసించాడు. ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. ట్రాక్ ఈవెంట్లలోనే కాకుండా ఫీల్డ్ ఈవెంట్లలోనూ రిలయన్స్ అథ్లెట్లు కీలకమైన విజయాలను నమోదు చేశారు. పురుషుల షాట్‌పుట్ ఈవెంట్‌లో కృష్ణ మీనన్ ఇనుప గుండును రికార్డు దూరానికి విసిరి రజత పతకం సాధించాడు. మహిళల పోల్ వాల్ట్ విభాగంలో బరానిక ఇ. అద్భుతమైన జంప్‌తో బార్‌ను దాటి సిల్వర్ మెడల్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఈ రెండో రోజు పోటీల్లో పతకాలు సాధించిన ఆరుగురు అథ్లెట్లు కూడా ఆసియా క్రీడల సెలక్షన్ టైమింగ్స్ మరియు మార్కులను విజయవంతంగా బ్రేక్ చేశారు. ఈ ఏడాది చివర్లో జపాన్‌లో జరగబోయే ఆసియా క్రీడల్లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించి, దేశానికి పతకాలు తీసుకురావడమే లక్ష్యంగా రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ కింద వీరంతా ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. ఈ అద్భుత ప్రదర్శనపై రిలయన్స్ ఫౌండేషన్ క్రీడా విభాగం హర్షం వ్యక్తం చేసింది.



# తొలి ప్రాక్టీస్ సెషన్‌లో వైభవ్ సూర్యవంశీకి చేదు అనుభవం

బెల్ఫాస్ట్ చేరుకున్న భారత ఆటగాళ్లకు ఇక్కడి ప్రాక్టీస్ స్టేడియంలో సరైన మౌలిక వసతులు కల్పించకపోవడంతో టీమ్ మేనేజ్‌మెంట్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. భారత ఆటగాళ్లు ప్రాక్టీస్ చేయడానికి కేటాయించిన ఒక పిచ్ వెనుక 'సైట్‌స్క్రీన్' లేకపోవడాన్ని మేనేజ్‌మెంట్ గుర్తించింది. బౌలర్ చేతి నుంచి వచ్చే బంతి బ్యాటర్‌కు స్పష్టంగా కనిపించాలంటే సైట్‌స్క్రీన్ తప్పనిసరి. అది లేకపోవడంతో ఇషాన్ కిషన్ వంటి సీనియర్ బ్యాటర్లతో పాటు ఇతర ఆటగాళ్లు కూడా బంతిని సరిగ్గా అంచనా వేయడానికి ఇబ్బంది పడ్డారు. దీనిపై భారత జట్టు ఆపరేషన్స్ మేనేజర్ వెంటనే స్పందించి, క్రికెట్ ఐర్లాండ్ అధికారులతో మాట్లాడి నిరసన వ్యక్తం చేశారు. దీంతో అప్రమత్తమైన స్థానిక నిర్వాహకులు ప్రాక్టీస్ సెషన్ వేగం పుంజుకోకముందే ఆ లోపాన్ని సరిదిద్దారు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి ఇది టీమిండియాతో తొలి ట్రైనింగ్ సెషన్ కాగా.. సైట్ స్క్రీన్ కారణంగా అతడికి ఒక చేదు అనుభవంగా మారింది. ఈ గందరగోళం సర్దుమణిగిన తర్వాత, అందరి దృష్టి 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపైనే నిలిచింది. సీనియర్ జాతీయ జట్టుతో తన కెరీర్‌లో మొట్టమొదటి నెట్ సెషన్‌లో పాల్గొన్న వైభవ్, తనపై ఉన్న భారీ అంచనాల ఒత్తిడిని ఏమాత్రం దరిచేరనివ్వలేదు. ఎడమచేతి వాటం కలిగిన ఈ కుర్రాడు నెట్స్‌లో అత్యంత ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేస్తూ, మైదానం నలుమూలలా క్లాసిక్ డ్రైవ్‌లు, తన మార్క్ అటాకింగ్ షాట్లతో అలరించాడు. పిచ్‌పై బౌన్స్ హెచ్చుతగ్గులుగా ఉన్నప్పటికీ సూర్యవంశీ సులువుగా సిక్సర్లు బాదడం విశేషం. సాధారణంగా క్రికెట్ హడావుడి పెద్దగా లేని బెల్ఫాస్ట్ నగరంలో వైభవ్ రాకతో ఒక్కసారిగా సందడి నెలకొంది. భారత సంతతికి చెందిన ప్రవాస భారతీయులు పెద్ద సంఖ్యలో స్టేడియానికి తరలివచ్చారు. నెట్స్ ముగిసిన తర్వాత వైభవ్‌తో సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌ల కోసం అభిమానులు ఎగబడ్డారు. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ వైభవ్‌కు సంరక్షకుడిగా నియమించిన రోమి భిందర్‌తో పాటు, వైభవ్ తల్లిదండ్రులు కూడా ఈ పర్యటనలో జట్టుతో పాటే ఉన్నారు. సరికొత్త టీ20 శకంలో అడుగుపెడుతున్న భారత్, ఈ మ్యాచ్‌లో వైభవ్‌కు తుది జట్టులో అవకాశం ఇచ్చి చరిత్ర సృష్టిస్తుందా.. లేదా ఇషాన్ కిషన్, సంజూ శాంసన్ వంటి సీనియర్లతోనే బరిలోకి దిగుతుందా అనేది కొన్ని గంటల్లో తేలనుంది.

# మాజీ కోచ్ మనుకు 35 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

క్రికెట్ ట్రైనింగ్ వచ్చిన మైనల్ బాలికను లైంగికంగా వేధించిన కేసులో కేరళ క్రికెట్ అసోసియేషన్ మాజీ కోచ్ మనుకు 35 ఏళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. ఈ మేరకు తిరువనంతపురం పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. తిరువనంతపురంలోని శ్రీవరగం ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల క్రికెట్ కోచ్ మనుపై మొత్తం 6 పోక్సో కేసులు నమోదయ్యాయి. తన అకాడమీకి వచ్చిన చిన్నారులను లైంగికంగా వేధించాడనే అభియోగాలతో పోలీసులు ఈ కేసులు పెట్టారు.ఇందులోని రెండో కేసును విచారించిన తిరువనంతపురం ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అంజు మీరా బిర్లా.. నిందితుడు మనుకు 35 ఏళ్ల కఠిన కారాగా శిక్షతో పాటు రూ.66,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే మరో 6 ఏళ్ల 9 నెలలు జైలులో గడపాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.ఈ కేసు వివరాల ప్రకారం ఓ బాధితురాలు 2018లో మను అకాడమీలో చేరింది. ఆ మైనర్ బాలికకు ప్రత్యేక ఫిట్‌నెస్ ట్రైనింగ్ ఇస్తానన్న నెపంతో జిమ్, బాత్రూమ్‌కు తీసుకెళ్లి లైంగికంగా వేధించాడు. అంతేకాకుండా రహస్యంగా ఆ బాలిక ఫొటోలు, వీడియోలు కూడా తీసాడు. ఒకవేళ ఆ విషయాన్ని బయటపెడితే ఆమె క్రికెట్ భవిష్యత్తును నాశనం చేస్తానని బెదిరించాడు. భయపడిన ఆ బాలిక 2019లో అకాడమీని విడిచిపెట్టింది. ఏళ్లు గడిచినా ఆ చిన్నారులు భయంతో మౌనంగా ఉండిపోయారు. ఈ పరిస్థితుల్లో తిరువనంతపురం వేదికగా జరిగిన మహిళల క్రికెట్ మ్యాచ్ సందర్భంగా కోచ్ మనును మళ్లీ చూసిన బాధిత విద్యార్థి భయంతో గట్టిగా ఏడ్చేసింది. ఆ తర్వాత జరిగిన విచారణలో మను లైంగిక వేధింపులకు పాల్పడిన విషయం వెలుగులోకి వచ్చింది. దాంతో మరో ఐదుగురు బాధితులు ముందుకొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# ఆస్ట్రేలియాను మరోసారి ఓడిస్తాం

## టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ధీమా

ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ 2026 టోర్నీ తరహాలోనే ఆస్ట్రేలియాను మరోసారి ఓడిస్తామని టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ధీమా వ్యక్తం చేసింది. ఆసీస్‌ను ఓడిస్తే తమ ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుందని చెప్పుకొచ్చింది. ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా బంగ్లాదేశ్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో సెమీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో పటిష్టమైన ఆస్ట్రేలియాతో తలపడాల్సి ఉంది. బంగ్లాదేశ్‌తో విజయానంతరం మాట్లాడిన హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ గెలుపుపై సంతోషం వ్యక్తం చేసింది. 'ఇది ఒక మంచి విజయం. మేం ఈ మ్యాచ్‌ను ఇంకాస్త ముందుగానే ముగించాల్సింది. అయినప్పటికీ 2-3 ఓవర్ల ఉండగానే విజయాన్ని అందుకోవడం చాలా మంచి విషయమే. మేం మా ఫీల్డింగ్‌పై చాలా శ్రమించాం. అయినా ఈ మ్యాచ్‌లో కొన్ని క్యాచ్‌లు చేజార్చాం. వచ్చే మ్యాచ్‌లో మా అత్యుత్తమ ప్రదర్శనను చూపిస్తామని ఆశిస్తున్నాను. క్యాచ్‌లు వదిలిన ఆటగాళ్లు మా జట్టులోనే అత్యుత్తమ ఫీల్డర్లు, కానీ కొన్నిసార్లు ఇలా జరుగుతూ ఉంటుంది. నిరంతరం శ్రమిస్తూ.. క్యాచ్‌లు పడుతూ ఉంటే మైదానంలో సరైన పొజిషన్లలో ఉండగలం. ఈ మ్యాచ్‌లో మేం కొన్ని తప్పులు చేశాం. కానీ తదుపరి మ్యాచ్‌లో మా అత్యుత్తమ ప్రదర్శన ఇస్తామని ఆశిస్తున్నాను.ఇక ఆస్ట్రేలియాతో తలపడడానికి మేం పూర్తిగా సిద్ధంగా ఉన్నాం. వారు మా అత్యుత్తమ ప్రత్యర్థుల్లో ఒకరు. ఇలాంటి టోర్నమెంట్‌లలో ప్రతి మ్యాచ్ తప్పక గెలవాల్సిన పరిస్థితి ఉన్నప్పుడు.. మన అత్యుత్తమ ప్రదర్శనను బయటకు తీయాలి. ఒకవేళ ఆస్ట్రేలియాపై మేం గెలిస్తే.. మాకు చాలా ఆత్మవిశ్వాసం వస్తుంది. గతంలో నవీ ముంబైలో సాధించిన విజయం మాకు ఎంతో నమ్మకాన్ని ఇవ్వడమే కాకుండా, మాకున్న కొన్ని అడ్డంకులను బద్దలు కొట్టింది.'అని వన్డే ప్రపంచకప్ విజయాన్ని హర్మన్‌ప్రీత్ కౌర్ గుర్తు చేసుకుంది. గతేడాది జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్-2లో టీమిండియా అద్వితీయమైన ప్రదర్శనతో చిరస్మరణీయమైన విజయాన్నిఅందుకున్న సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఆసీస్ విధించిన 338 పరుగుల లక్ష్యాన్ని భారత్ 9 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. జెమీమా రోడ్రిగ్స్(127 నాటౌట్) అజేయ శతకంతో ఈ మ్యాచ్‌లో సత్తా చాటింది. ఈ గెలుపు ఉత్సాహంతో ఫైనల్లో సౌతాఫ్రికాను ఓడించి తొలిసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది. మరోసారి అదే తరహా ప్రదర్శనతో తొలి టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడాలనే కసితో హర్మన్ సేన ఉంది.



# విశ్వజ




## బాధగా తింటున్నారా బరువు పెరుగుతారు!

బరువు తగ్గేందుకు ఆహారపు మోతాదు తగ్గించడం, పదార్థాల్లో మార్పులు చేసుకోవడం మాత్రమే కాదు. ఆహారం పట్ల మన దృక్పథాన్ని కూడా స్పష్టంగా, సానుకూలంగా ఉంచుకోవాలని చెబుతున్నారు పోషకాహార నిపుణులు. మనసు నిండా అపరాధ భావన పెట్టుకుని ఆరోగ్యకరమైనది తిన్నా సరే, అది శరీరానికి అనారోగ్యాన్నే చేకూరుస్తుందని అంటున్నారు. అందుకే బరువు తగ్గే క్రమంలో ఆహారంతో మన అనుబంధం ఎలా ఉండాలన్నదానికి సంబంధించి కొన్ని సూచనలు చేస్తున్నారు. మనసారా తినండి మైండ్‌ఫుల్‌నెస్ అనేది ఏ పనిలోనైనా ముఖ్యమే. అంటే చేస్తున్న పని మీద పూర్తి ఏకాగ్రత. అలాగే ఆహారం విషయంలోనూ. మనం ఏం తింటున్నాం, దాని రంగు, ఆకృతి, పోషకాలు, రుచి వీటన్నింటినీ అనుభవిస్తూ తినడం వల్ల పొట్టకు తిన్న అనుభూతితో పాటు శరీరానికి ఆరోగ్యం చేకూరుతుంది. బరువు తగ్గాలంటే ఇది ఈ సమయంలో ఇంతే తినాలిఅన్నట్టుగా కాకుండా, ఒక రోజు మొత్తంలోనో ఒక వారం మొత్తంలోనో మనం పూర్తి చేయవలసిన ఆహార లక్ష్యాలను పెట్టుకుని, వాటిని మనసుకు నచ్చిన వేళల్లో నచ్చిన విధంగా తినే ఏర్పాటు చేసుకుంటే పని సులభం అవుతుంది. చోడ్‌దో అప్పుడప్పుడు మనం టెంప్ట్ అయిపోయి తినవద్దు అనుకున్న ఆహారాన్ని కూడా తినేస్తుంటాం. అలాంటప్పుడు 'ఇంక ప్లాన్ మొత్తం నాశనం అయిపోయినట్టే' అని ఫీల్ అవ్వకుండా, ఇవాళ నాకు నచ్చిన ఆహారాన్ని ఎంజాయ్ చేశాను, రేపటి నుంచి మళ్లీ నా ప్రణాళికను అనుసరిస్తాను అనుకోవచ్చు. లేకపోతే అపరాధ భావనతో కీరాదోసకాయలాంటి ఆరోగ్యకరమైన దాన్ని తిన్నా, అది కూడా మన బరువు పెరిగేలా పనిచేస్తుంది. పూర్తిగా నములుతూ, నెమ్మదిగా, ఆకలిని గమనిస్తూ ఆహారం తీసుకోవడం అన్నది హాయిగా బరువు తగ్గేందుకు ఒక మంచి చిట్కా. ఇలా గమనించడం వల్ల నిజమైన ఆకలి లేదా ఊరికే ఆకలిలాగా కలిగే సంకేతాల మధ్య తేడా పసిగట్టవచ్చు. ఎవరైనా నచ్చిన ఆహారాన్ని తినేందుకు అర్హులే. కానీ కొన్ని లక్ష్యాలు సాధించడం కోసం మార్పులు చేసుకున్నా, మనం వాటిని పూర్తి స్థాయిలో పాటించలేకపోవచ్చు. అలాంటప్పుడు మనకు చేతకాదు, నియంత్రణ లేదు.. ఇలా అనుకోకుండా, ఎదుటి వారి పట్ల చూపినట్టే మన పట్ల మనం కూడా సహానుభూతి చూపించుకోవచ్చు. అలా చేయడం వల్ల మరింత బలంగా తయారవుతాం.

## చాపకింద నీరులా..

ఆరోగ్య సంరక్షణలో చాలాదేశాలు ముందున్నప్పటికీ హెపటైటిస్ బి, సి.. ప్రజారోగ్యానికి సవాల్ విసురుతూనే ఉన్నాయి. ఏటా పది లక్షలకు పైగా ప్రాణాలను బలిగొంటున్నాయి. సాధారణ ప్రజలతో పోలిస్తే.. శ్రామిక మహిళలపై అధిక ప్రభావం చూపుతున్నాయి. ఈ 'సైలెంట్ ఇన్‌ఫెక్షన్లు'.. చాపకింద నీరులా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. హెపటైటిస్ బి, సి లక్షణాలతో అనారోగ్యానికి గురైనప్పుడు.. చాలామంది మామూలు అలసట, హార్మోన్ల హెచ్చుతగ్గులు, ఒత్తిడిగా భావిస్తుంటారు. దాంతో వ్యాధి ముదిరి ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా, ఉద్యోగాలు చేస్తున్న మహిళల్లో సమయ పరిమితులు, బాధ్యతలు సర్వసాధారణం. ఈ క్రమంలో ఆరోగ్య సంరక్షణపై అంతగా దృష్టిపెట్టడం లేదు. కొన్ని సంస్థలు వెల్‌నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులకే ఎక్కువగా స్క్రీనింగ్ చేస్తున్నాయి. హెపటైటిస్ నిర్ధారణ పరీక్షలు అరుదుగానే జరుగుతున్నాయి. అంతేకాకుండా.. డయాగ్నోస్టిక్ కేంద్రాలు, క్లినిక్స్ వంటివి సాధారణ వ్యాపార సమయాల్లోనే నడుస్తాయి. దాంతో, ఉద్యోగ–ఉపాధి రంగాల్లో పనిచేసేవారికి స్క్రీనింగ్ చేయించుకోవడం వీలు కావట్లేదు. ఫలితంగా, రోగనిర్ధారణ పరీక్షలు తగ్గి.. వారి ప్రాణాల మీదికి వస్తున్నది. ఈ సమస్యలకు ఆన్–సైట్ స్క్రీనింగ్ సౌకర్యాలు లేకపోవడం కూడా సమస్యను మరింత జఠిలంగా మారుస్తున్నది.

# గట్ హెల్త్‌కు బెస్ట్ ఫుడ్స్ - ఎన్నో సమస్యలకు పరిష్కారం..!!



ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి పోషకాలు అవసరం. మనం తీసుకునే ఆహారం జీర్ణమై శరీరానికి శక్తిని ఇవ్వటంలో జీర్ణ వ్యవస్థ ప్రధాన భూమిక పోషిస్తోంది. కడుపు ఆరోగ్యం బాగుంటేనే శరీరం పూర్తి ఫిట్ గా.. అన్ని రకాల శక్తి అందుతుంది. ఏ మాత్రం జీర్ణవ్యవస్థ సక్రమంగా లేకపోయినా.. శరీరం లో ఎన్నో సమస్యలు మొదలవుతాయి. జీర్ణవ్యవస్థ బాగుండాలంటే గట్ ఆహారం చాలా అవసరం. దీని ద్వారా పూర్తిగా జీర్ణవ్యవస్థ సక్రమంగా పని చేస్తుంది. జీర్ణ క్రియను మెరుగు పర్చేందుకు కొన్ని ఫుడ్స్ ను తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణవ్యవస్థను గట్ అని కూడా పిలుస్తారు. ఇది కడుపు, ప్రేగులు మరియు పెద్దప్రేగులను కలిగి ఉంటుంది. జీర్ణవ్యవస్థ సరిగ్గా పని చేయకపోవటానికి అనేక కారణాలు ఉంటాయి. అందులో అధిక యాంటీ బయోటిక్స్ వినియోగం.. ఒత్తిడి.. నిద్ర లేకపోవటం.. శారీరక వ్యాయామ లేమి.. ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవటం వంటివి కారణాలుగా చెబుతున్నారు. ఆరోగ్యకరమైన గట్ నిర్వహణ కోసం పండ్లు, కూరగాయలు, చిక్కుళు ్ళ, బీన్స్, గింజలు, తృణధాన్యాలు వంటివి అవసరం. ఎక్కువగా ఫైబర్ ఆహారం జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. పప్పులు, గింజలు, ధాన్యాలు లేదా గింజలు వంటి ఎంపిక చేసిన కూరగాయల వేరియంట్‌లలో లభించే ప్రీబయోటిక్ ఫైబర్‌ల నుండి గట్ ఆరోగ్యం చాలా వరకు ప్రయోజనం పొందవచ్చు. పండ్లు మరియు కూరగాయల ద్వారా శరీరానికి కావాల్సిన విటమిన్లు, ఖనిజాలు మరియు ఆరోగ్యాన్ని ఇచ్చే పదార్థాలు లభిస్తాయి. %సూశ్రీంశీ =ఘుఃు% తిరుమల కొండకు ఉచిత ప్రయాణం, పరిమితం – ఇక ఫ్రీ బస్సులో ఇవి తప్పనిసరి..!! జీర్ణవ్యవస్థలో ప్రేగులకు నీరు తప్పనిసరి. ఇది ఆహారాన్ని జీర్ణం చేయడంతో పాటు పోషకాలను గ్రహించడంలో సహాయపడుతుంది మరియు మలాన్ని మృదువుగా చేస్తుంది. మూలికలు, సుగంధ ద్రవ్యాలు, రంగు రంగుల పండ్లు మరియు కూరగాయలు, గింజలు మరియు గింజలు, గ్రీన్ – బ్లాక్ టీ, కాఫీ, కోకో మరియు డార్క్ చాక్లెట్ వంటి పాలీఫెనాల్స్ అధికంగా ఉండే ఆహారాలు గట్ మైక్రోబయోమ్ కు మేలు చేస్తాయి. పెరుగు, కిమ్చి, సౌర్‌క్రాట్, కేఫీర్, కొంబుచా మరియు టేంపే వంటి పులియబెట్టిన ఆహారాలు జీర్ణ ఆరోగ్యంకు ప్రయోజనకరం. ధ్యానం, నడక, తగినంత నిద్ర, ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం. వీటి ద్వారా జీర్ణ వ్యవస్థను బలోపేతం చేసుకుంటే.. శరీరం బలంగా.. ఆరోగ్యంగా ఉంటుంది. ఇతరత్రా సమస్యల పరిష్కారానికి మేలు చేస్తుంది.

# చిన్న పిల్లలకూ నిద్ర ఉండట్లేదు..

## మంచిగా పడుకోవాలంటే పేరెంట్స్ ఈ టిప్స్ పాటించాలి!

ఒత్తిడి.. పెద్దల్నే కాదు, పిల్లల్నీ చిత్తు చేస్తున్నది. విద్యాపరమైన టార్గెట్లలో బాల్యం బందీ అవుతున్నది. ఇక డిజిటల్ గ్యాడ్జెట్ల వాడకం.. పిల్లల నిద్రా నాణ్యతను దెబ్బతీస్తున్నది. వాటిల్లోంచి వచ్చే బ్లూలైట్ వల్ల.. నిద్రను నియంత్రించే మెలటోనిన్ సహజ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతున్నది. మొత్తంగా.. నేటితరం చిన్నారులకు కంటినిండా నిద్ర కరువైపోతున్నది. జీవనశైలిలో మార్పుల వల్ల ఈ సమస్య నుంచి బయట పడే అవకాశం ఉన్నది. కొంతమంది పిల్లలు.. ఇలా పడుకోగానే అలా నిద్రలోకి జారుకుంటారు. కొందరికి అస్సలు నిద్రపట్టదు. అలాంటి వారిని నిద్రపుచ్చడానికి తల్లిదండ్రులు నానా తంటాలు పడుతుంటారు. జీవనశైలిలో వచ్చిన మార్పులే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. అయితే, చిన్నారుల ఎదుగుదలలో ఆహారం తర్వాత నిద్రే కీలకమైంది. మెదడు వికాసానికీ నిద్ర దోహదం చేస్తుంది. కాబట్టి, పిల్లలకు కంటినిండా నిద్ర ఎంతో అవసరం. ఇందుకోసం పిల్లలకు ప్రత్యేక దినచర్యను అలవాటు చేయాలని చెబుతున్నారు నిపుణులు. కథల పుస్తకాలు చదవడం, చిన్నచిన్న వ్యాయామాలు, మృదువైన సంగీతం వినడం వంటివి పిల్లల మనసును ప్రశాంతపరుస్తాయి. ఇక స్క్రీన్ టైమ్‌ను తగ్గించడం, పడుకునే ముందు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను పక్కన పెట్టేయడం.. నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తాయి. వారాంతాల్లోనూ ఒకే సమయానికి నిద్రలేచే అలవాటు.. నిద్ర చక్రాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇక పిల్లల్లో నిద్రను ప్రోత్సహించడానికి.. బెడ్‌రూమ్ చీకటిగా, నిశ్శబ్దంగా, చల్లగా ఉండేలా చూసుకోవాలి. మంచం సౌకర్యవంతంగా ఉండాలి. మనసుకు ప్రశాంతత చేకూర్చే పుస్తకాలు కూడా మంచి నిద్రకు ఆహ్వానం పలుకుతాయి. రాత్రి పడుకునే ముందు శరీరాన్ని సున్నితంగా స్ట్రెచ్ చేయడం, యోగా లాంటివీ.. నిద్రకు సహకరిస్తాయి. అయితే, ఇలాంటి దినచర్యలను పాటించడం కేవలం స్వల్పకాలిక పరిష్కారం కోసమే కాదు. ఇది పిల్లల్లో భావోద్వేగ పరంగా, మానసికంగా సానుకూల మార్పు తీసుకొస్తుంది. స్థిరమైన, ప్రశాంతమైన దినచర్య.. పిల్లలకు స్వీయ నియంత్రణపై నైపుణ్యాన్ని నేర్పుతుంది. దీర్ఘకాలంలో పిల్లలు ఒత్తిడిని నిర్వహించడానికి సన్నద్ధమవుతారు. మెరుగైన భావోద్వేగాలను కలిగి ఉంటారు. మంచినిద్ర వేసే ఈ పునాది.. పిల్లల తరువాతి జీవితంలో మానసిక ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని పలు సర్వేలూ చెబుతున్నాయి.




# మార్కెట్

## మొబైల్స్‌పై జీఎస్టీ 5 శాతమే వేయాలి..

### కేంద్ర ప్రభుత్వానికి ఐసీఈఏ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 19: మొబైల్ ఫోన్లు, వాటి విడిభాగాలపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను 5 శాతానికి తగ్గించాలని భారతీయ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం 18 శాతం పడుతుండగా.. ఇది చాలా భారంగా ఉందని పేర్కొన్నది. జీఎస్టీ స్లాబుల సంఖ్యను 4 నుంచి 2కు తగ్గించేందుకు మోదీ సర్కారు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఐసీఈఏ పై విధంగా కోరుతున్నది. కాగా, ప్రస్తుతం రోజువారీ వినియోగ ఉత్పత్తులపై 5 శాతం, స్టాండర్డ్ గూడ్స్‌పై 12 శాతం, ఎలక్ట్రానిక్స్–సర్వీసెస్‌పై 18 శాతం, లగ్జరీ–హానికర ఉత్పత్తులపై 28 శాతం జీఎస్టీ పడుతున్నది. అయితే వీటిలో 12, 28 శాతం రేట్లను తొలగించి.. 5, 18 శాతం రేట్లకే జీఎస్టీ విధానాన్ని పరిమితం చేయాలని భావిస్తున్నారు. 12 శాతం స్లాబులోని 99 శాతం గూడ్స్‌ను 5 శాతంలోకి, 28 శాతం స్లాబులోని 90 శాతం గూడ్స్‌ను 18 శాతంలోకి మార్చనున్నట్టు తెలుస్తున్నది. అయితే 5, 18 శాతం స్లాబుల్లో ఇప్పుడున్న వస్తూత్పత్తులపై పన్ను భారం ఇకపైనా అలాగే ఉంటుందని సమాచారం. దీంతో మొబైల్ ఫోన్లపై పన్నును తగ్గించాలని, దాన్ని 5 శాతం స్లాబులోకి మార్చాలని ఐసీఈఏ కోరుతున్నది. నేటి డిజిటల్ యుగంలో విద్య, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక సేవలు, పాలనాపరమైన అంశాల్లో మొబైల్ ఫోన్ నిత్యవసర వస్తువుగా మారిందని, పన్ను భారాన్ని తగ్గించాలని ఐసీఈఏ చైర్మన్ పంకజ్ మహిం ద్రు అంటున్నారు. కాగా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో వచ్చే నెల జీఎస్టీ కౌన్సిల్ భేటీలో ఇది తేలనున్నది.




# రిస్క్‌లో 3 లక్షల ఉద్యోగాలు.. భారతీయ ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావం

### టారిఫ్‌లు కొనసాగితే వస్త్ర, రత్నాలు-ఆభరణాల రంగాలకు కష్టాలు

### ఆటో విడిభాగాల తయారీ, ఎంఎస్ఎంఈలకూ ఇబ్బందులే

### ఇరు దేశాల మధ్య వాణిజ్య ఆందోళనలపై నిపుణులు






న్యూఢిల్లీ : అమెరికాలోకి వచ్చే భారతీయ వస్తూత్పత్తులపై ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు.. లక్షల్లో ఉద్యోగాలను ప్రమాదంలో పడేస్తున్నాయి. టారిఫ్‌లు ఇలాగే కొనసాగితే దేశీయ ఎగుమతులపై తీవ్ర ప్రభావం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారిప్పుడు. ముఖ్యంగా అమెరికా మార్కెట్‌పైనే ప్రధానంగా ఆధారపడిన భారత వస్త్ర, రత్నాలు–ఆభరణాల రంగాల్లో 3 లక్షలదాకా ఉద్యోగాలు రిస్క్‌లో పడవచ్చని అంచనా వేస్తుండటం గమనార్హం. దేశంలో పెద్ద ఎత్తున ఉండే డిమాండ్, అమెరికాయేతర దేశాలకు భారీగా జరుగుతున్న ఎగుమతుల వల్ల సుంకాల ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండబోదని కొందరు చెప్తున్నా.. మెజారిటీ విశ్లేషకులు మాత్రం కీలక రంగాలు కుదేలేనన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. వాహన విడిభాగాల తయారీ సంస్థలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లు ఒడిదొడుకులకు గురి కావచ్చంటున్నారు. ఔషధ రంగం వంటి ఒకట్రెండు ఇండస్ట్రీలపై టారిఫ్‌ల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చంటూనే.. చివరకు ఐటీ సేవలు, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ) కూడా ప్రభావితం కావచ్చని చెప్తుండటం ఆందోళనల్ని రేకెత్తిస్తున్నది. కొత్త కొలువుల్లేవ్.. పాత పనులుండవ్ భారతీయ వస్త్ర, రత్నాలు–ఆభరణాల ఎగుమతుల్లో మెజారిటీ వాటా అమెరికాదే. అందుకే ఆ దేశం టారిఫ్‌లు ఇప్పుడు ఈ రంగాల్లో ప్రకంపనల్ని పుట్టిస్తున్నాయి. పెరిగే సుంకాల భారం.. అమెరికాలో భారతీయ వస్త్ర, రత్నాలు–ఆభరణాల వస్తూత్పత్తుల ధరల్ని పెంచగలవు. ఇదే జరిగితే మార్కెట్‌లో అమ్మకాలు పడిపోతాయి. ప్రత్యామ్నాయంగా అమెరికన్లు ఇతర దేశాల నుంచి వస్తున్న వస్త్ర, రత్నాలు–ఆభరణాల వైపు చూసే వీలున్నది. దీంతో క్షీణించే ఎగుమతులు.. ఉత్పత్తి తగ్గుదలకు దారితీస్తే అంతిమంగా వ్యయ నియంత్రణ, ఉద్యోగుల తొలగింపులు, నష్టాల్లో ఉన్న సంస్థల మూసివేతలే ఉంటాయని ఆయా రంగాల నిపుణులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే సుంకాలు ఇలాగే కొనసాగితే దేశీయ వస్త్ర, రత్నాలు–ఆభరణాల రంగాల్లో 2 నుంచి 3 లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డట్టేనని అంచనా వేస్తున్నారు. ఇక ఉన్న ఉద్యోగాలనే తీసేసే కంపెనీలు.. కొత్తగా నియామకాలకు ఎందుకు వెళ్తాయని కూడా ప్రశ్నిస్తున్నారు. దీంతో ఉద్యోగావకాశాలూ సన్నగిల్లుతాయని పలువురు పేర్కొంటున్నారు. తాత్కాలిక, కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో లాజిస్టిక్ వర్కర్లు, షాప్–ఫ్లోర్ వర్కర్లు, సేల్స్ సిబ్బందికి ఇబ్బందులేనన్న అంచనాలున్నాయి. టెక్స్‌టైల్స్, ఆటో కంపోనెంట్స్, వ్యవసాయ, రత్నాలు–ఆభరణాల రంగాలు అమెరికా సుంకాలతో తీవ్రంగా ప్రభావితమయ్యే వీలున్నది. టారిఫ్‌లు 6 నెలలు ఇలాగే ఉంటే అత్యధికంగా జీవనోపాధినిస్తున్న వస్త్ర పరిశ్రమల్లో లక్ష ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉన్నది. సూరత్, ముంబై సీప్జ్ వంటి రత్నాల హబ్‌ల్లోనూ పెద్ద ఎత్తున ఉద్యోగులు రిస్క్‌ను ఎదుర్కొంటారు.

# ఆంధ్రప్రదేశ్

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి
### అందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలి
### క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలి
### ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన

అమరావతి, జూన్26 : వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల్ని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి భద్రత, దోమల నియంత్రణ చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రజారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా మురుగు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవటం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయగలుగుతామన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, రోజు వారీ చెత్త సేకరణ శాస్త్రీయపద్ధతిలో నిర్వహించాలని, ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. "ఫ్రైడే -- డ్రైడే" కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి మురుగునీటి నిల్వలను తొలగించే ఏర్పాటు చేయాలన్నారు. సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపులు, మైక్ అనౌన్స్?మెంట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఇచ్చే తాగునీటి నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థపై పర్యవేక్షణ ఉండాలని పైపు లైన్లలో లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.జారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలి. క్రమం తప్పకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి, అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలి. ముఖ్యంగా వర్షపు నీరు, మురుగునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవటం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయాలి. శుభ్రత పాటించాలని సూచించారు.
పాస్‌పోర్ట్, ఆధార్‌ను ధ్రువీకరణ పత్రాలుగా గుర్తించాలి
వేల మంది సైన్యానికి ఇమామ్ ఎదురు నిలిచారు

## భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

### ఇమామ్ త్యాగాన్ని స్మరించుకున్న ప్రధాని

న్యూఢిల్లీ,జూన్26 : మొహర్రం పవిత్ర మాసం సందర్భంగా.. సత్యం, ధర్మం కోసం హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన అత్యున్నత త్యాగాన్ని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్మరించుకున్నారు. ఈ మేరకు ఆయన తన అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ (గతంలో ట్విట్టర్) ద్వారా ఒక సందేశాన్ని పంచుకున్నారు. "హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన త్యాగం... సత్యం, న్యాయం కోసం స్థిరంగా పోరాడేలా ఎంతో మందికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఇది అచంచలమైన ధైర్యం, విశ్వాసానికి సజీవ ప్రతీకగా నిలుస్తుంది" అని ప్రధాని మోదీ తెలిపారు. స్లాం మత ప్రవక్త అయిన మహమ్మద్ ప్రవక్త మనవడే (కూతురు ఫాతిమా, అల్లుడు అలీల కుమారుడు) హజ్రత్ ఇమామ్ హుస్సేన్. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మొదటి నెల అయిన మొహర్రంలో 10వ రోజును 'ఆషూరా' ( అని పిలుస్తారు. ఈ రోజున షియా ముస్లింలు ఇమామ్ హుస్సేన్, ఆయన అనుచరుల అమరత్వాన్ని స్మరించుకుంటూ, దీనిని అత్యంత విషాద దినంగా పాటిస్తారు. క్రీస్తుశకం 680 (హిజ్రీ సంవత్సరం 61)లో ప్రస్తుత ఇరాక్ దేశంలోని 'కర్బలా' అనే ప్రాంతంలో జరిగిన చారిత్రాత్మక యుద్ధంలో ఈ మహా త్యాగం జరిగింది. ఆ సమయంలో ఉమయ్యద్ రాజవంశానికి చెందిన పాలకుడు యజీద్ , తనను ఇస్లామిక్ సామ్రాజ్యానికి ఏకైక నాయకుడిగా (ఖలీఫాగా) అందరూ అంగీకరించాలని డిమాండ్ చేశాడు. అయితే, యజీద్ ఒక క్రూరుడు, అవినీతిపరుడు, ఇస్లాం ప్రాథమిక, నైతిక సూత్రాలకు విరుద్ధంగా పాలించేవాడు. ఆయన పాలనను అంగీకరిస్తే, అది సత్యం, ధర్మాన్ని కాలరాయడమే అవుతుందని ఇమామ్ హుస్సేన్ దృఢంగా భావించారని ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా లోని ఇస్లామిక్ హిస్టరీ అండ్ బ్యాటిల్ ఆఫ్ కర్బలా చెబుతోంది. అధికార దాహంతో ఉన్న యజీద్‌కు లొంగిపోవడానికి నిరాకరించిన ఇమామ్ హుస్సేన్, కేవలం 72 మంది కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి యజీద్ పంపిన వేల మంది సైన్యంతో కర్బలా మైదానంలో ఎదురునిలిచారు. ఆ చిన్న సమూహంలో 6 నెలల పసికందుతో పాటు మహిళలు, వృద్ధులు కూడా ఉన్నారు. శత్రువులు వారి దారుణత్వాన్ని ప్రదర్శిస్తూ, యూఫ్రటీస్ నది నుంచి ఇమామ్ హుస్సేన్ బృందానికి చుక్క నీరు కూడా అందకుండా మూడు రోజుల పాటు అడ్డుకున్నారు. మండుటెండలో దాహంతో అలమటిస్తున్నప్పటికీ వారు ధర్మాన్ని వీడలేదు. చివరగా, ఆషూరా రోజున జరిగిన అసమాన పోరులో హజ్రత్ ఇమామ్ హుస్సేన్, ఆయన అనుచరులు అత్యంత దారుణంగా, వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేశారు.

## ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకోవచ్చు

### సర్ ప్రక్రియపై కీలక ప్రకటన

న్యూఢిల్లీ,జూన్26 : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైంది. జులై 24వ తేదీ వరకు దీనిని నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది. ఈ ప్రక్రియల భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను అందిస్తున్నారు. ఓటర్లు వీటికి పూర్తి చేసిన తర్వాత బీఎల్‌వోలకు అందించాల్సి ఉంటుంది. ఎన్యూమరేషన్ ఫారంలు అందించిన రెండు, మూడు రోజుల తర్వాత బీఎల్‌వోలు మళ్లీ ఇంటింటికి వెళ్లి ఈ ఫారాలను స్వీకరిస్తారు. తెలుగులో కూడా ఈ పత్రాలు ఉంటాయి. దీంతో నిరక్షరాస్యులు కూడా సులువుగా అర్థం చేసుకుని ఫారం నింపవచ్చు. ప్రతీ రోజు 50 ఇళ్లకు వెళ్లి బీఎల్‌వోలు ఈ దరఖాస్తులను అందించాల్సి ఉంటుంది. గుడవు తేదీలోపు ప్రక్రియను పూర్తి చేయాలని బీఎల్‌వోలకు ఆదేశాలు వెళ్లాయి. దీంతో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు చోటుచేసుకోకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులు చూస్తున్నారు. ఎలాంటి విమర్శలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తెలంగాణలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. వీరందరికి బీఎల్‌వోలు అందించాలి. అనతరం ఓటర్లు వాటిని పూర్తి చేసి తిరిగి అందించాలి. బీఎల్‌వోలు తీసుకోకపోతే ఈసీ టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. జులై 24వ తేదీలోపు వీటిని ఓటర్లందరూ అందించాల్సి ఉంటుంది. అయితే ఆఫ్‌లైన్‌లోనే కాకుండా ఆన్‌లైన్‌లో కూడా ఎన్యూమరేషన్ ఫారం నింపవచ్చు.

# తిరుపతికి 2 బుల్లెట్ ట్రైన్స్!!

### హైదరాబాద్-చెన్నైమార్గం గుండా తిరుపతి
### ప్రత్యేక బుల్లెట్ రైలు లింక్ కారిడార్ ప్రతిపాదన
### ప్రతిపాదనకు లభించిన ప్రాథమిక అంగీకారం
### త్వరలోనే కార్యరూపం దాల్చనున్న ప్రాజెక్టు



తిరుపతి, జూన్26 : దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన హైస్పీడ్ బుల్లెట్ రైలు ప్రాజెక్టుల మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కీలక కేంద్రంగా మారనుంది. హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ కారిడార్‌ను రాజధాని అమరావతి మీదుగా నిర్మించాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్హెచ్ఎస్ఆర్సీఎల్) సానుకూలంగా స్పందించింది. అదే సమయంలో చెన్నై-బెంగళూరు కారిడార్‌లోని చిత్తూరును, హైదరాబాద్-చెన్నై మార్గంలోని తిరుపతితో అనుసంధానించే ప్రత్యేక బుల్లెట్ రైలు లింక్ కారిడార్ ప్రతిపాదనకు సైతం ప్రాథమిక అంగీకారం లభించింది. ఈ కీలక నిర్ణయంతో దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాలన్నీ ఒకే నెట్‌వర్క్‌తో అనుసంధానమయ్యే అద్భుత అవకాశం ఏర్పడింది. హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ కారిడార్ మొత్తం 760.09 కిలోమీటర్ల మేర మూడు రాష్ట్రాల మీదుగా విస్తరించనుంది. ఇందులో తెలంగాణలో 180.32 కిలోమీటర్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా 518.54 కిలోమీటర్ల మేర మార్గం ఉండనుంది. తమిళనాడులో 61.23 కిలోమీటర్ల మేర ఈ మార్గం సాగుతుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 18 స్టేషన్లను ప్రతిపాదించారు. తెలంగాణలో హైదరాబాద్, శంషాబాద్ సహా ఆరు స్టేషన్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాలతో కలిపి తొమ్మిది స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు చిత్తూరు-తిరుపతి మధ్య సుమారు 65 కిలోమీటర్ల పొడవున ప్రత్యేక హైస్పీడ్ లింక్ కారిడార్ ఏర్పాటును ఎన్హెచ్ఎస్ఆర్సీఎల్ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. దీనికోసం తుది స్థల నిర్ధారణ సర్వే, వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీకి సంస్థ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నివేదిక సిద్ధమైన వెంటనే కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖకు పంపి తుది ఆమోదం తీసుకోనున్నారు. ఈ లింక్ కారిడార్ అందుబాటులోకి వస్తే, బెంగళూరు నుంచి చిత్తూరు, తిరుపతి మీదుగా అమరావతి వరకు నేరుగా బుల్లెట్ రైలులో ప్రయాణించే వెసులుబాటు కలుగుతుంది.మరోవైపు 306 కిలోమీటర్ల పొడవైన చెన్నై-బెంగళూరు హైస్పీడ్ కారిడార్‌లో చిత్తూరు ప్రధాన స్టేషన్‌గా నిలవనుంది. ఇందులో తమిళనాడులో 133 కిలోమీటర్లు, కర్ణాటకలో 101 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 72 కిలోమీటర్ల మార్గం ఉండనుంది. మూడు రాష్ట్రాల్లో కలిపి మొత్తం ఏడు స్టేషన్లను ప్రతిపాదించారు. ఈ నెట్‌వర్క్ పూర్తయితే పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు ఊహించని రీతిలో భారీ ఊతం లభిస్తుంది. ముఖ్యంగా తిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే లక్షలాది భక్తులకు అత్యంత వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది.ఈ బుల్లెట్ రైలు ప్రాజెక్టులతో ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారత హైస్పీడ్ రైలు వ్యవస్థకు కేంద్ర బిందువుగా మారుతోంది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, అమరావతి నగరాలను ఒకే నెట్‌వర్క్‌లో అనుసంధానం చేయడం ద్వారా భారీగా పెట్టుబడులు ఆకర్షించే అవకాశం ఉంది. పరిశ్రమలు విస్తరించడం, ఉపాధి అవకాశాలు పెరగడం వంటి సానుకూల ఫలితాలు రాష్ట్రానికి దక్కనున్నాయి. ప్రస్తుతం సర్వేలు, డీపీఆర్ తయారీ ప్రక్రియలను వేగవంతం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారులను ఆదేశించడంతో ఈ కలల ప్రాజెక్టు త్వరలోనే కార్యరూపం దాల్చనుంది. ఈ ప్రాజెక్టు అమలుతో రవాణా సమయం భారీగా తగ్గడమే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఈ హైస్పీడ్ మార్గాలు దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంలో కీలక పాత్ర పోషించనున్నాయి.

## సవాళ్లతో మరోసారి దద్దరిల్లిన తాడిపత్రి

### ప్రభాకర్ రెడ్డి, పెద్దారెడ్డి హౌస్ అరెస్టు!

తాడిపత్రి, జూన్26 : అనంతపురం జిల్లా రాజకీయాల్లో తాడిపత్రి స్టైలే వేరు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి, వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య పొలిటికల్ హీట్ కాగుతూనే ఉంటుంది. తాజాగా మరోసారి అలాంటి పరిస్థితి ఏర్పడింది. జేసీ ప్రభాకర్ రెడ్డి చేస్తున్న రాజకీయాలకు వ్యతిరేకంగా తాడిపత్రి సెంటర్‌లోని గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్నట్టు కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రకటించారు. దీనికి వ్యతిరేకంగా జేసీ ప్రభాకర్ రెడ్డి ఏకంగా వైసీపీ నేతల ఇంటి ముందే ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఇలా ఇరు వర్గాల నుంచి వచ్చిన ప్రకటనతో తాడిపత్రిలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో భారీగా మోహరించిన పోలీసులుల ఇరువురిని ఇంటి నుంచి బయట అడుగు పెట్టనీయకుండా కట్టడి చేశారు. అటు అనంతపురం జిల్లా వ్యాప్తంగా కూడా కీలక నేతలను అడ్డుకున్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా సరే తాడిపత్రిలో మాత్రం రాజకీయం వేరుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు ఉద్రిక్తతలు, రాజకీయ సవాళ్లు సాగుతూనే ఉంటాయి. హింసాత్మక రాజకీయాలు చేస్తున్నారని పెద్దారెడ్డి, జేసీ ప్రభాకర్ రెడ్డి మధ్య నిత్యం వివాదాల సుడులురేగుతూనే ఉంటాయి. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి ఏర్పడింది. జేసీ ప్రభాకర్ రెడ్డి రాజకీయాలకు వ్యతిరేకంగా దీక్ష చేపట్టారు పెద్దారెడ్డి. తాడిపత్రి నడిబొడ్డున ఉన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో తన అనుచరులు, నేతలతో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. దీనికి జిల్లా వ్యాప్తంగా వైసీపీ శ్రేణులు సంఘీభావం ప్రకటించారు. భారీగా తరలివచ్చేందుకు ప్లాన్ చేశారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి చేస్తున్న కార్యక్రమానికి కౌంటర్‌గా టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆందోళనలకు పిలుపునిచ్చారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఇంటి ముందు తాను నిరసన చేస్తున్నట్టు ప్రకటించారు. అధికారంలో ఉన్న తనతోపాటు టీడీపీ శ్రేణులను కేసులు పెట్టి హింసించిన వ్యక్తి ఇప్పుడు దీక్షలు చేయడాన్ని తప్పుపట్టారు జేసీ ప్రభాకర్ రెడ్డి. ఇలాంటి వ్యక్తులు చేసే ప్రయత్నాలను అడ్డుకుంటామని అన్నారు. ఇలా రెండు వర్గాల పోటాపోటీ నిరసనలతో తాడిపత్రి రాజకీయం మరోసారి రాజుకుంది. ఓవైపు మొహ్రం, కీలక నేతలు ఈ మధ్య ఆ ప్రాంతాల్లో పర్యటించారు. పరిస్థితి సున్నితంగా ఉన్న టైంలో ఇరు నేతల సవాళ్లు, ప్రతిసవాళ్లతో వాతావరణం మరింత హీట్ ఎక్కింది. అందుకే దీన్ని కట్టడి చేసేందుకు భారీ సంఖ్యలో పోలీసులు ఆ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ ప్రాంతం వారు తప్ప వేరే వారిని అటుగా రానివ్వలేదు. నిరసనలకు పిలుపునిచ్చిన జేసీ ప్రభాకర్ రెడ్డి, పెద్దారెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. బయటకు రాకుండా అడ్డుకున్నారు. మరోవైపు పెద్దారెడ్డి పిలుపు మేరకు చలో తాడిపత్రి అంటూ కొందరు అనంతపురం జిల్లాలోని వైసీపీ నేతలు జెండాలు ఎత్తారు. వారిని కూడా పోలీసులు కట్టడి చేశారు. అనంతపురం అర్బన్, శింగనమల, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు చెందిన వారందర్నీ కంట్రోల్ చేశారు. చాలా మందిని ఇంటి నుంచి రాక ముందే నిర్బంధించారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నందున నేతలను తాడిపత్రిలోకి అనుమతించలేమని స్పష్టం చేశారు. అయితే పెద్దారెడ్డి మాత్రం తన ఇంటి ఆవరంలోనే బైఠాయించి నిరసన చేపట్టారు. పోలీసుల తీరుపై వైసీపీ నేతలు మండిపడుతున్నారు. దౌర్జన్యాలు చేస్తున్న జేసీ వర్గాలను కట్టడి చేయకుండా తమపై ప్రతాపం చూపించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని తాము శాంతియుతంగా దీక్షలు చేయడానికి అనుమతి ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పోలీసులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వ్యాపారవేత్త వైశాఖ్ అనుమానాస్పద మృతి

బెంగళూరు, జూన్26 : ప్రముఖ కన్నడ నటి, బిగ్‌బాస్ ఫేమ్ కృషి తాపండా నివాసంలో ఒక వ్యాపారవేత్త చనిపోయి కనిపించడం బెంగళూరులో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. స్థానిక పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. నటి స్నేహితుడైన 33 ఏళ్ల వైశాఖ్ అనే వ్యాపారవేత్త ఆమె ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం రాత్రి ఈ విషాద ఘటన జరగగా, సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన శాండల్‌వుడ్ వర్గాల్లో సైతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న బెంగళూరు పోలీసు అధికారుల వివరాల ప్రకారం.. ఘటనా స్థలంలో వైశాఖ్ మృతదేహం ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. గది మొత్తం క్షుణ్ణంగా పరిశీలించినప్పటికీ ఎలాంటి సూసైడ్ నోట్ లేదా మరే ఇతర ఆధారాలు పోలీసులకు లభించలేదు. దీంతో ఇది ప్రాథమికంగా ఆత్మహత్యే అని దర్యాప్తు అధికారులు నిర్ధారణకు వచ్చారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్ట్‌మార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగానే మృతికి గల కచ్చితమైన కారణాలు వెల్లడవుతాయని పోలీసు బృందం స్పష్టం చేసింది.ఈ వ్యవహారంలో ప్రధానంగా అందరి మదిలో మెదులుతున్న ప్రశ్న.. "ఆమె ఇంట్లో అతను ఎందుకు ఉంటున్నాడు? ఆమెకూ, అతనికీ ఉన్న సంబంధమేంటి?". ఈ అంశంపైపోలీసు వర్గాలు, దర్యాప్తు నివేదికల ఆధారంగా అందుతున్న సమాచారం మేరకు.. వైశాఖ్, నటి కృషి తాపండా ఇద్దరూ సన్నిహిత స్నేహితులు. వైశాఖ్ తన వ్యక్తిగత జీవితంలో నెలకొన్న తీవ్ర వివాదాల కారణంగా గత నెల రోజుల కిందట తన భార్యతో విడిపోయాడు. ఆ సమయంలో అతనికి ఆశ్రయం కల్పించే ఉద్దేశ్యంతోనే నటి తన ఇంట్లో ఉండటానికి అనుమతించినట్లు విచారణలో వెల్లడైంది.వీరి స్నేహం వెనుక మరేదైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. అయితే, ఈ ఘటన జరిగిన సమయంలో నటి కృషి తాపండా ఇంట్లో లేరని పోలీసుల అధికారిక ప్రకటన ద్వారా స్పష్టమైంది. ఆమె ఇంట్లో లేని సమయం చూసి వైశాఖ్ ఈ అఘాయిత్యానికి పాల్పడటం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఆమె తిరిగి వచ్చే సమయానికి లేదా ఇతరులు గమనించేలోపే ఈ ఘటన జరిగిందని పోలీసుల రికార్డులు సూచిస్తున్నాయి. విచారణలో భాగంగా నటి వాంగ్మూలాన్ని కూడా పోలీసులు రికార్డ్ చేసే అవకాశం ఉంది. మృతుడు వైశాఖ్ గత కొంతకాలంగా తీవ్రమైన మానసిక ఒత్తిడితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు, వైద్య వర్గాల ద్వారా తెలుస్తోంది. భార్యతో విభేదాలు, కుటుంబ సమస్యల కారణంగా తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లిన అతను.. బెంగళూరులోని ఒక స్థానిక ఆసుపత్రిలో మానసిక వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడు. ఈ డిప్రెషన్ తీవ్రత వల్లే అతను ఆత్మహత్య లాంటి కఠిన నిర్ణయం తీసుకుని ఉండవచ్చని పోలీసులు ఒక అంచనాకు వచ్చారు. డాక్టర్ల దగ్గర ఉన్న అతడి హెల్త్ రికార్డులను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. వైశాఖ్ బ్యాక్‌గ్రౌండ్ పరిశీలిస్తే.. అతనిపై గతంలో క్రిమినల్ కేసులు కూడా ఉన్నట్లు పోలీసు రికార్డులు వెల్లడిస్తున్నాయి. వార్తా సంస్థల కథనాల ప్రకారం.. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ప్రముఖ పారిశ్రామికవేత్త అరవింద రెడ్డిని బెదిరించి రూ.7 కోట్లు డిమాండ్ చేసిన భారీ దోపిడీ కేసులో వైశాఖ్ ప్రధాన నిందితుడు. ఆ బెదిరింపు లేఖ వ్యవహారంలో పారిశ్రామికవేత్త ఇచ్చిన ఫిర్యాదుతో అప్పట్లో పోలీసులు వైశాఖ్‌ను అరెస్ట్ చేశారు. కొంతకాలం జైలు జీవితం గడిపిన తర్వాత అతను బెయిల్‌పై బయటకు వచ్చాడు.

## ఆటోలోనే గర్భిణీ ప్రసవం

భద్రాద్రి కొత్తగూడెం, జూన్26 : ప్రభుత్వాలు మారుతున్నా ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతులు, వైద్య సౌకర్యాలు మాత్రం మెరుగుపడటం లేదు. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలో అర్ధరాత్రి వేళ ఒక గర్భిణీకి ఎదురైన అనుభవం ఇక్కడి వైద్య లీలలను కళ్ళకు కడుతోంది.పినపాక మండలం అమరారం గ్రామానికి చెందిన కలివేటి సంధ్య అనే గర్భిణీకి అర్ధరాత్రి అకస్మాత్తుగా పురిటి నొప్పులు వచ్చాయి. అత్యవసర సహాయం కోసం కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ప్రయత్నించగా అది అందుబాటులో లేదు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా కేటాయించిన 108 వాహనాన్ని వేరే ప్రాంతానికి తరలించడమే దీనికి కారణం. విధిలేని పరిస్థితుల్లో వారు ఒక ఆటోను మాట్లాడుకుని సంధ్యను జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తీరా అక్కడికి వెళ్లేసరికి పీహెచ్‌సీ తాళం వేసి ఉండటంతో వారి ఆశలు అడియాశలయ్యాయి. అక్కడి నుండి పినపాక పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే సంధ్య ఆటోలోనే ఒక బిడ్డకు జన్మనిచ్చింది. తొలి కాన్పు కావడంతో ఆమె పురిటి నొప్పులతో అల్లాడిపోయింది. తీవ్ర రక్తస్రావం కావడంతో నరకయాతన అనుభవించింది. ప్రస్తుతం మణుగూరులోని 100 పడకల ఆసుపత్రిలో తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. రాత్రి వేళల్లో పీహెచ్‌సీలు మూసి ఉంచడం, అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఏజెన్సీ ప్రాంతాల్లో నిరంతర అంబులెన్స్ సౌకర్యంతో పాటు, రాత్రి వేళల్లో కూడా పీహెచ్‌సీలలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కేంద్ర విదేశాంగశాఖ ప్రకటన సరైంది కాదు

### కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,జూన్26 : పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వాన్ని నిర్ధరించే పత్రం కాదని కేంద్ర విదేశాంగశాఖ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పందించారు. కేంద్రం చెబుతున్న విధానం చట్టపరంగా ఒక విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తోందని ఆయన విమర్శించారు. పాస్‌పోర్ట్ పౌరసత్వానికి రుజువు కాదని, ఆధార్ కూడా పౌరసత్వాన్ని నిర్ధరించదని చెబితే, సాధారణ భారతీయుడు తన పౌరసత్వాన్ని ఎలా నిరూపించుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఆ అంశంపై ఉన్న అయోమయాన్ని తొలగించేందుకు చట్టాల్లో సవరణలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇటీవల నిర్వహించిన 'పాస్‌పోర్ట్ సేవా దివస్' సందర్భంగా భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా విదేశీ ప్రయాణానికి ఉపయోగించే పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి ధ్రువీకరణ పత్రం కాదని స్పష్టం చేసింది. ఆ ప్రకటన అనంతరం సామాజిక మాధ్యమాలు, రాజకీయ వర్గాల్లో చర్చ ప్రారంభమైంది. దీనిపై శుక్రవారం 'ఎక్స్' వేదికగా స్పందించిన శశి థరూర్, కేంద్రం వైఖరిని ప్రశ్నిస్తూ పోస్టు చేశారు. ఇదిలా ఉండగా, ఆధార్ కార్డుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ఆయన ప్రస్తావించారు. ఆధార్ అనేది వ్యక్తి గుర్తింపు, నివాసానికి సంబంధించిన పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి ఆధారం కాదని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసిందని గుర్తు చేశారు. దీంతో ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం కోట్లాది మంది భారతీయులు ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఆ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆయన కొన్ని సూచనలు కూడా చేశారు. చట్టాల్లో మార్పులు చేసి, ప్రభుత్వం రద్దు చేయనంత వరకు చెల్లుబాటులో ఉన్న భారత పాస్‌పోర్ట్ లేదా సాధారణ ఆధార్ కార్డును భారత పౌరసత్వానికి తుది ఆధారంగా గుర్తించాలని సూచించారు. అలాగే, భారతీయులు, నివాసితులకు ప్రత్యేక రంగు లేదా ప్రత్యేక గుర్తింపుతో ఉండే ఆధార్? కార్డులను యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా జారీ చేయాలని ప్రతిపాదించారు. ఈ విధంగా భారతీయ పౌరులు, పౌరులు కాని వారిని స్పష్టంగా వేరు చేయవచ్చని శశి థరూర్ అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత సాధారణ ఆధార్ కార్డు లేదా చెల్లుబాటులో ఉన్న భారత పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ప్రభుత్వం గుర్తించవచ్చని చెప్పారు. దీంతో ఎన్నికల జాబితాల సవరణలు వంటి ప్రక్రియల్లో అనవసర వివాదాలు తగ్గుతాయని, పరిపాలనా ప్రక్రియలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. "ఈ రెండు పత్రాల్లో ఏదో ఒకటి ఉంటే భారత పౌరుడిగా గుర్తించే విధానాన్ని అమలు చేస్తే, పౌరసత్వంపై అనవసర చర్చలకు ముగింపు పడుతుంది. ప్రజలకు కూడా తమ గుర్తింపు విషయంలో పూర్తి చట్టపరమైన స్పష్టత లభిస్తుంది" అని శశి థరూర్ తన పోస్టులో పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం నిర్వహించిన సమావేశంలో భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా ప్రయాణ పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి తుది ఆధారం కాదని వెల్లడించింది. అనంతరం గురువారం కూడా ఆ అంశంపై మరోసారి స్పష్టత ఇచ్చింది. ఇటీవల లేదా గత 12 ఏళ్లలో పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ఎప్పుడూ ప్రకటించలేదని తెలిపింది. దీనికి ఆధారంగా పాస్‌పోర్ట్ చట్టం-1967లోని సెక్షన్-20ను కేంద్రం ప్రస్తావించింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే భారత పౌరుడు కాని వ్యక్తికీ కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్ట్ లేదా ప్రయాణ పత్రాన్ని జారీ చేయవచ్చని ఆ సెక్షన్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు వెల్లడించింది. అంతేకాకుండా, 2013లో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పులను కూడా కేంద్రం ప్రస్తావించింది. కేవలం పాస్‌పోర్ట్ కలిగి ఉండటం వల్ల మాత్రమే ఒక వ్యక్తి భారత పౌరుడిగా నిర్ధారణ కాదని హైకోర్టు అప్పుడే స్పష్టం చేసిందని తెలిపింది. కేంద్రం వివరణ, శశి థరూర్ వ్యాఖ్యలతో పాస్‌పోర్ట్, ఆధార్, పౌరసత్వ ధ్రువీకరణకు సంబంధించిన అంశం ఇప్పుడు రాజకీయంగా, చట్టపరంగా మరోసారి చర్చనీయాంశంగా మారింది.




## మా ఇంటి బంగారం కోసం సమంతను ఒప్పించా: రాజ్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, థ్రిల్లింగ్ అంశాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. విడుదలైన తొలి వారం రోజుల్లోనే భారీ వసూళ్లు సాధించిన ఈ సినిమా ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ విజయాన్ని సెలబ్రేట్ చేసేందుకు హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నిర్మాత, దర్శకుడు రాజ్ నిడిమోరు చేసిన వ్యాఖ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సమంత వ్యక్తిగత జీవితం, కెరీర్, ఈ సినిమా ప్రయాణం గురించి ఆయన పంచుకున్న విషయాలు అందరినీ భావోద్వేగానికి గురిచేశాయి. మేము ఎన్నో హిందీ ప్రాజెక్టులు చేశాం. 'ది ఫ్యామిలీ మ్యాన్', 'స్త్రీ' వంటి ప్రాజెక్టులు దేశవ్యాప్తంగా బ్లాక్‌బస్టర్లుగా నిలిచాయి. కానీ 'మా ఇంటి బంగారం' ఇచ్చిన తృప్తి మాత్రం పూర్తిగా భిన్నం. ఈ సినిమా నాకు గుండెకు చాలా దగ్గరైంది. తెలుగు ప్రేక్షకులు చూపించిన ప్రేమ, ఆదరణ నాకు జీవితాంతం గుర్తుండిపోతుంది' అని రాజ్ చెప్పారు. సినిమా నిర్మాణ సమయంలో ఎదురైన సవాళ్లను గుర్తు చేసుకున్న రాజ్, ఒక ఆసక్తికర విషయాన్ని కూడా వెల్లడించారు. ఈ సినిమా ప్రారంభమైన సమయంలో సమంత వ్యక్తిగత జీవితం, ఆరోగ్యంపై బయట ఎన్నో రకాల ప్రచారాలు జరిగాయి. ఆ సమయంలో ఆమె సినిమాలకు దూరంగా ఉండాలనే ఆలోచనలో ఉండేది. నిజానికి ఇక సినిమాలు చేయకూడదని కూడా అనుకుంది. అయితే కనీసం ఈ ఒక్క సినిమా అయినా చేయాలని నేనే బలవంతం చేసి ఒప్పించాను అని రాజ్ వెల్లడించారు.



## దీవానా సినిమా సూపర్బ్ అన్న శ్రీవిష్ణు

### నేడు ఒకటి కొంటే రెండు టిక్కెట్ల ఆఫర్

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఇటీవల విడుదలైన చిన్న చిత్రం 'దీవాన' పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సినిమా సక్సెస్ సాధించిన నేపథ్యంలో చిత్రబృందం తాజాగా 'థ్యాంక్యూ మీట్' నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టాలీవుడ్ హీరో శ్రీవిష్ణు ప్రేక్షకులకు ఒక బంపర్ ఆఫర్ ప్రకటించి సర్‌ప్రైజ్ చేశారు. 'దీవాన' సినిమా తనకు విపరీతంగా నచ్చేసిందని పేర్కొన్న శ్రీవిష్ణు.. ఈ చిత్రాన్ని మరింత మంది ప్రేక్షకులకు చేరువ చేసేందుకు ఒక క్రేజీ అనౌన్స్‌మెంట్ చేశారు. శనివారం ఈ సినిమా ప్రదర్శితమవుతున్న ప్రతి థియేటర్‌లోనూ, మొదటి 25 టికెట్లకు గానూ ఒకటి కొంటే మరొకటి ఉచితం ఆఫర్‌ను వర్తింపజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ వినూత్న ఆఫర్ వల్ల సినిమాకు మౌత్ పబ్లిసిటీ మరింత పెరిగి, థియేటర్లలో లాంగ్ రన్ లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీవిష్ణు సినిమాపై తనకున్న ఫీలింగ్స్‌ను పంచుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నాతో 'సింగిల్' చిత్రాన్ని నిర్మించిన లేడీ ప్రొడ్యూసర్ విద్య కొప్పినీడి కోరడంతో నిన్న ఈ సినిమా ఫస్ట్ హాఫ్ చూశాను. అయితే ఇంటర్వెల్‌లో వచ్చిన ట్విస్ట్‌కి నాకు ఒక్కసారిగా చిప్ ఎగిరిపోయింది. దాంతో మిగతా పనులన్నీ పక్కన పెట్టేసి మరీ సెకండ్ హాఫ్ కూడా పూర్తిగా చూశాను' అని శ్రీవిష్ణు నవ్వుతూ వెల్లడించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడి ప్రతిభను, నటీనటుల నటనను శ్రీవిష్ణు మనస్ఫూర్తిగా అభినందించారు. దర్శకుడికి ఎంత టాలెంట్ ఉందో, దానికి తగ్గట్టుగానే అద్భుతమైన టెక్నీషియన్స్, ఆర్టిస్ట్‌లు దొరకడం వల్లే సినిమా ఇంత బాగా వచ్చిందని కొనియాడారు.




## మర్డర్ మిస్టరీలో తత్త్వం మూవీ

మర్డర్ మిస్టరీ జానర్‌లో.. ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ ఇచ్చేందుకు సిద్ధమవుతోన్న చిత్రం 'తత్త్వం'. దినేష్ తేజ్, దష్విక.కె హీరోహీరోయిన్లుగా నటిస్తోన్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటూ.. సినిమాపై అంచనాలను పెంచేస్తోంది. సైతాన్ సంతానమే గ్రహణం రోజు పుట్టి సైకోలుగా ప్రవర్తిస్తుంటారనే పాయింట్‌ని బేస్ చేసుకుని, ఈ సినిమా రూపుదిద్దుకున్నట్లుగా ట్రైలర్‌లో చూపించారు. అలాంటి టైమ్‌లో పుట్టిన ఓ వ్యక్తి చేసే హత్యల చుట్టూ కథని నడిపిస్తూ.. నిజంగా ఆ హత్యలను ఆ వ్యక్తే చేస్తున్నాడా? లేదంటే వేరే ఎవరైనా చేయిస్తున్నారా? అనే క్యూరియాసిటీని పెంచేలా ఈ ట్రైలర్‌ని కట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్రైలర్ టాప్‌లో ట్రెండ్ అవుతోంది.







## రణబాలి షూటింగ్‌లో విజయ్ గొంతెమ్మ కోర్కెలు


### సోషల్ మీడియా అసత్య ప్రచారాలను తిప్పికొట్టిన నిర్మాత

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆయన నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఇటీవల ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో పలు వార్తలు వైరల్‌గా మారాయి. 'రణబాలి' చిత్రీకరణ సమయంలో విజయ్ దేవరకొండ ఐదు కారవాన్లు ఏర్పాటు చేయాలని కోరారని, తన వెంట పెద్ద సంఖ్యలో అసిస్టెంట్లు ఉండాలని డిమాండ్ చేశారనే ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ వార్తలు అభిమానుల్లో చర్చకు దారితీశాయి. ఈ ప్రచారంపై ఇప్పటికే విజయ్ దేవరకొండ బృందం స్పందించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేసింది. హీరోపై కావాలనే తప్పుడు ప్రచారం జరుగుతోందని పేర్కొంది. అసత్య కథనాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని విజయ్ టీమ్ హెచ్చరించింది. తాజాగా ఈ వివాదంపై చిత్ర నిర్మాత రవి కూడా స్పందించారు. షూటింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, విజయ్ దేవరకొండ నుంచి అసాధారణమైన డిమాండ్లు ఏవీ రాలేదని ఆయన స్పష్టం చేశారు. విజయ్ ఎప్పుడూ పనిపట్ల నిబద్ధతతో వ్యవహరిస్తారని, సమయపాలనకు ప్రాధాన్యం ఇస్తారని నిర్మాత తెలిపారు. ఆయనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు. ఇక 'రణబాలి' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇప్పటికే మంచి బజ్ ఏర్పడింది. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'రణబాలి' చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తయింది. మిగిలిన భాగాన్ని వేగంగా పూర్తి చేసి సినిమాను సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

## మరో మూడు నెలల్లో వారణాసి పూర్తి

### ముఖ్యమైన షూటింగ్ పూర్త ఇచేశామన్న జక్కన్న

మహేశ్ బాబు, ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి' సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ సినీ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. ఈ చిత్ర షూటింగ్ మరో నాలుగు నెలల్లో, అంటే ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా పూర్తిగా ముగియనుందని దర్శకుడు రాజమౌళి స్వయంగా వెల్లడించారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆయన ఒక అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలను పంచుకున్నారు. సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోయే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణతో పాటు వారణాసిలోని ముఖ్యమైన భాగాల షూటింగ్ కూడా ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం కేవలం కథను అనుసంధానం చేసే చిన్న చిన్న సన్నివేశాలను మాత్రమే తెరకెక్కిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇక ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించడంపై రాజమౌళి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కథ ఐమాక్స్ స్క్రీన్‌పై చూస్తేనే అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని తాము ముందుగానే భావించామని, అయితే ఈ ఫార్మాట్ కోసం కథలో ఎలాంటి ప్రధాన మార్పులు చేయలేదని కేవలం సాంకేతిక పరమైన సర్దుబాట్లు మాత్రమే చేశామని తెలిపారు. సాధారణంగా మన కళ్లు సినిమా స్కోప్ ఫార్మాట్‌కు అలవాటు పడ్డాయని, అందువల్ల అటు ఐమాక్స్, ఇటు సినిమా స్కోప్ రెండింటికీ సరిపోయేలా 'అనోమార్ఫిక్ ఫ్రేమింగ్' పద్ధతిని ఉపయోగించి దృశ్యాలను చిత్రీకరించినట్లు వివరించారు. దీనికోసం ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ఆ తర్వాత పని చాలా సులభంగా సాగిపోయిందని జక్కన్న చెప్పుకొచ్చారు. ఇక గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది.




Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com